# దొంగల బండి

## ( నాటకం )

రచన : శంకరమంచి పార్థసారథి

పాత్రలు

1. సత్యానందం
2. చక్రధరం
3. గోపాలరావు
4. సీతారాం
5. జగన్నాథం
6. చిరంజీవి
7. చారుమతి

# దొంగల బండి

## ( నాటకం )

రచన : శంకరమంచి పార్థసారథి

మధ్య తరగతి యింట్లో వీధి వైపు గది.... రెండు ద్వారాలు కనిపిస్తున్నాయి. కుడివైపు ద్వారం వీధిలోకి, ఎడమవైపు ద్వారం యింటి లోపలి గదుల్లోకి దారితీస్తాయి....అక్కడ సాధారణమైన అలంకరణ కనిపిస్తోంది. టేబిల్, కుర్చీలు, గోడలకి పాత కేలండర్లు, దేవుడి ఫోటోలు వున్నాయి.

చారుమతి లోపల్నుంచి చీపురుతో ప్రవేశించి, చీరని బొడ్లోకి లాగి ఎగదోపి, గదిని శుభ్రం చేయడానికి వుపక్రమిస్తుండగా, వీధి తలుపు చప్పుడు కావడంతో సందేహంగా వెళ్ళబోతుండగా లోపలి నుంచి గోపాల్రావ్ గొంతు కంగారు, కంగారుగా , భయంగా , పెద్దగా వినిపించింది.

గోపా : ఫైర్....ఫైర్....నిప్పు....నిప్పు...ఒసే చారూ...కొంపకి నిప్పంటుకుందే ....తగలడిపోతోంది... పారిపో...యింటి వెధవని పిలువ.

చారు : ఆ ! ....అయ్యయ్యో....కొంపకి నిప్పంటుకుందా ! ....( లోనికి అదేపళంగా పరిగెట్టింది. లోపల్నుంచి గోపాల్రావ్ గొంతు యింకా వినిస్తూనే వుంది. వీధి తలుపు యింకా ఆగకుండా చప్పుడవుతోంది. వెంటనే ఇంటి ఓనర్ చక్రధరం తలుపులు విరగొట్టుకుంటూ సినిమాలో హీరోలా రివ్వున వచ్చి గది మధ్యలో చతికిలబడ్డాడు. వెంటనే గోపాల్రావ్ కేకలు ఆగిపోయాయి. చారుమతి అక్కడి కొచ్చింది. కిందపడి లేవడానికి విఫలయత్నం చేస్తున్న చక్రధరాన్ని చూసింది. వెంటనే ఆయన కంగారుగా ! )

చక్ర : కొంపకి నిప్పంటుకుందా ? .....ఆర్పేశారా ? .....అయినా అంత అజాగ్రత్తగా ఎలా వుంటారమ్మా !

చారు : ఆయన కేకలు మీకూ వినిపించాయా ? .....నిప్పుకాదు...నా బొందా కాదు...నిద్దట్లో కలవరింతలు.

చక్ర : కలవరింతలా ? ...అవేం కలవరింతలమ్మా...హడిలి చచ్చేట్లు.... ఎప్పుడూ యింతేనా లేక యీ మధ్యనే మొదలయ్యాయా ?

చారు : సర్లెండి...పెళ్ళయిన దగ్గర్నుంచి చూస్తున్నా...యిదే వరస. అరుపులూ....కేకలు, పాటలూ, పద్యాలూ...అవునూ....మీకు తలుపెవరు తీసారూ ?

చక్ర : తలుపు తీసేదేమిటి ? .....నా శ్రాద్ధం. మీ ఆయన కేకలు విని నిజంగా కొంప తగలడిపోతుందనుకొని తలుపులు విరగ్గొట్టుకొని లోపలికొచ్చి పడ్డా.... నిక్షేపంలాంటి తలుపులు నాశనం అయిపోయాయి.

చారు : మెల్లగా లేవండి....దెబ్బ తగిలిందా ?.....

చక్ర : కిందపడితే దెబ్బలు తగలక, లంకెల బిందెలు తగుల్తాయా ? .....యిలా వచ్చి కాస్త లేవదీయామ్మా.....

( చారుమతి ఓ క్షణం సందేహించి లోపలికి చూసిగోపాల్రావ్ వచ్చే ప్రమాదం లేదనుకొని నిర్ధారించుకొని, అతడికి చెయ్యి అందించింది....చక్రధరం ఆమె చేతిని పట్టుకొని లేవకుండా ....తన్మయత్వంగా )

చక్ర : అలాగా ! అది సరేగానిరాత్రి వంట గదిలో వర్షం కురిసిందామ్మా ?.....

చారు : అబ్బేలేదండీ.....మెల్లగా లేవండి.....

చక్ర : లేస్తాలేమ్మా, తొందరేం వుంది ? ....అది బతికున్నప్పుడు ....ఎవరూ ....మీ అత్తయ్య... బతికున్నప్పుడు...ఎప్పుడూ వంటగదిలో వర్షంకురిసేది....

చారు : ( చేయి విడిపించుకుంటూ ) అంటే అప్పుడు పై కప్పులు రేకులతో వేయించి వుంటారు.....

చక్ర : అవునమ్మా .... నాకేమో మొదట్నుంచి వంటగదిలో తప్ప మరే గదిలోనూ నిద్రపట్టి చచ్చేదికాదు. నాకేవిటిలే, మా వంశంలో మగాళ్ళంతా గూడా వంటగదుల్లోనూ....వీధి అరుగులపైనా పడుకోవడం అలవాటు. అదే మా వంశానికి అచ్చొచ్చింది. కానీ దానికి. ఎవరికీ ....మీ అత్తయ్యకి వంటగదిలో పడుకునే వాళ్ళంటే వళ్ళు మంట....చిన్న చూపూ...దాంతో రోజూ గొడవ, రభసాన్నూ...చివరికి, ఆ రాత్రి ...అదే...అది ప్రమాదవశాత్తు చీరకినిప్పంటుకుని చనిపోయిన రోజు గూడా నే వంటగదిలో పడుకుని వుమెన్స్ వీక్లీ చదువుకుంటుండగా, అది పడగ్గదిలో అగరొత్తులు వెలిగిద్దావని

చారు : పోన్లెండి.....బాధ పడకండి.... ఎన్నిసార్లనుకుంటే మాత్రం పోయినవాళ్ళు తిరిగొస్తారా...ఆవిడకేం ....అదష్టవంతురాలు. మీ చేతుల్లో హరీమంది.

చక్ర : అంటే నీ వుద్దేశం సుమంగళిగా పోయిందనేగా...అదేలే నాకు తెల్సు...అదేవిటోనమ్మా అది పోయి దాదాపు ఏడాది కావస్తోందా.... అంతా నిన్న మొన్న జరిగినట్టుంది. ఏమిటో....యిక్కడి కొచ్చానంటే ఎంతసేపూ ఆ విషయాలే గుర్తొస్తాయి. సరిగ్గా యిప్పుడు నువ్ నిల్చున్నావే...సరిగ్గా అక్కడే నిలబడేది ఎప్పుడూ ....అబ్బ....నీలాగే ఎంత ఆప్యాయంగా మాట్లాడేదో.....

( లోపల్నుంచి గోపాల్రావ్ తిరిగి పెద్దగా అరిచేడు...చారూ....చారూ...ఎక్కడే... అర్జంట్...అంటూ )

చక్ర : ఏవిటీ... మళ్ళీ కలవరింతా ?....

చారు : కాదండీ...వొళ్ళు సలపరింత...

చక్ర : అవున్లే...తెల్లార్లూ పాటలూ పద్యాలూ పాడి కేకలు పెడితే వొళ్ళు పులిసి పోదూ.... అవునూ...చారూ. చారూ ....అంటున్నాడు. కళ్ళు తెరవంగానే చారు గానీ.... పులుసుగానీ కాస్త పుచ్చుకోవడం అలవాటా ?

చారు : సర్లెండి...ఏం చెప్పమంటారు....మా వారి పద్ధతే వేరు...నిద్రమంచం దిగే ముందు ‘ నీ మొహం మండ ఎక్కడ చచ్చేవే... యిలా వుంటుంది. పలకరింపు ....యిహ భోజనం చేసి ఆఫీసు కెళ్ళేటప్పుడు “ ఓయస్...నిన్నే...నే వెడుతున్నా... తలుపేసుకో ” అని.... సాయంత్రం తిరిగిచ్చేక “ చారుమతీ...అంటూ వృద్ధిపొంది ఇహ రాత్రుళ్ళు దీపం ఆర్పేక...ఛ...చెప్పుకోకూడదు గానీ ” డాళింగ్ చారూ....మైడియార్ చారూ ” అంటూ ప్రేమబద్ధలయిపోతుంది.

చక్ర : ఇదేవిటమ్మా....గొంగళీ పురుగు జీవిత దశల్లాగా చాలా వుందే గొడవ... కానీ ఏ మాటాకామాట చెప్పుకోవాలి. నేనేనాడు దాన్ని...అదే మీ అత్తయ్యని ఒసేవ్ గిసేవ్ అని గానీ ‘ ఓయ్ గీయ్ ’ అని గాని ఎరగను. దాని పేరు నిర్మల....ముద్దుగా నిమ్మూ అనే వాణ్ణి....ఆవిడేమో నన్ను చక్రం అనేది...నిమ్మూ, అని నేను, చక్రం అని అది...నిమ్మూ, చక్రం యిలా వుండేది...పెళ్ళయ్యాకనే ఫ్రెండ్సుని గూడా కలవడం మానేస్తే వాళ్ళంతా “ ఒరే ఈ వెధవకి నిమ్మూ చేసిందిరా ” అనే వాళ్ళు జోగ్గానేలే.

( మళ్ళీ గోపాల్రావ్ గొంతు  అసహనంగా వినిపించింది....నీ మొహం మండా....పిలుస్తుంటే  పలికి చావవేమే...వున్నావా...అసలున్నావా ? ఏ వెధవతో  ఏ పనికి మాలినవాడితో మీటింగ్ పెట్టేవ్ )

చారూ : యిహ లాభం లేదు....బాగా మెళుకువొచ్చేసినట్టుంది. కాసేపు కూర్చుంటారా ?

చక్ర : ఏవిటోనమ్మా....ఈ పోర్షన్లోకి వచ్చేనంటే చాలు నాకు పూనకం  వచ్చేస్తుంది. అస్సలు వెళ్ళాలనిపించదు....ప్రతి నిముషం  నిమ్మేగుర్తుకొస్తుంది. ఫ్చ్.... ఏం చేస్తా. అయినా యిల్లు అద్దెకిచ్చాక ఎవరు మాత్రం మాటి మాటికీ రానిస్తారు ? ఏదో  నువ్వూ మా నిమ్మూలాగా నిధానం  గల పిల్లవు గాబట్టి అర్ధం చేసుకోగలవ్....

గోపా : ఏవే....పిలుస్తుంటే  కనీసం వస్తున్నా  అనయినా అనవేం....ఏం చేస్తున్నావ్ ?
( అంటూ వచ్చి చక్రదరాన్ని చూసి కళ్ళు మూసుకుని గిరుక్కున  మరో వైపుకి తిరిగి నిలబడ్డాడు....చక్రధరానికి అతడి ప్రవర్తన అర్దం కాక )

చక్ర : అదేవిటి ? .....అలా కళ్ళు మూసుకుని నిల్చున్నాడు ? కలవరింతలు లాగా ?....యిదో అలవాటా .

చారు : ఆయనతో చాలా వున్నాయిలెండి గొడవలు....వంటిల్లు ‘ ఓసారి చూస్తారా ? ....

చక్ర : అక్కర్లేదమ్మా...వాన కురవలేదన్నావుగా....కాని ఒక్కసారి ఆ తులసిమొక్కని చూసిపోతా ....

గోపా : జీవితంలో యింతవరకు అసలు తులసి మొక్కే చూళ్ళేదా ?

చక్ర : నీ కలాగే  అనిపిస్తుంది. మా నిమ్మూ  బతికున్నప్పుడు ప్రతి శుక్రవారం  తలంటు పోసుకుని, ఆ మొక్క  పక్కన కూర్చొని, తలారి  పెట్టుకునేది.....ఆ తులసికోటని చూస్తే దాన్ని చూసినట్టే  వుంటుందనుకో....

చారు : మీరు రండి మావయ్యగారూ....ఆయన  మాటలకేం గాని.... యిలా రండి....

చక్ర : ఏవిటో ? మీకేవన్నా  ఇబ్బంది కలిగిస్తున్నానో  ! ఏమో  ఏం అనుకోకమ్మా
( యిద్దరూ  లోనికి వెళ్ళిపోగా !)

గోపా :  అబ్బే ఏం ఫర్లేదు చక్రం మావయ్యగారూ....అలా వెళ్ళి  ఆ మరుగుదొడ్డి కూడా చూసిరండి... మధురక్షణాలేమైనా గుర్తొస్తాయేమో ?

చారు : ఉష్...ఆయన వినగల్డు...

గోపా : ఏమే... పొద్దున్నే ఈ క్రిమినల్ వెధవని లోపలికెందుకు రానిచ్చావ్....
దిక్కుమాలిన ఫేసూ వాడూనూ...

చారు : నే రానిచ్చేదేవిటి ? ....మీ కలవరింతలకు కంగారుపడి తలుపులు విరగ్గొట్టుకుని వచ్చి పడ్డారు.

గోపా : అంటే నా కొంపలో నాకు కలవరించుకునేంత స్వతంత్ర్యం కూడా లేదన్నమాట....

చారు : ష్....మెల్లగా – అరవకండి...వింటారు.

గోపా : వింటే విననియ్యి ....యిల్లు అద్దెకిచ్చిన వెధవ ఫస్ట్ తారీఖుకొచ్చి అద్దె డబ్బులు పట్టుకుపోవాలేగానీ, కలవరించాననో, వాడి పెళ్ళాం కల్లోకొచ్చిందనో, యిలా లోపలికి చొరపడితే మన పరిస్థితేమిటి ? అసలు రానీ....యివాళ తేల్చి పారేస్తా....

చారు : చాల్లెండి ఆవేశం....యిదిగో ముందే చెప్తున్నా...అనవసరంగా మీరేం కలుగజేసుకోకండి, అయినా యిల్లు యిచ్చేప్పుడే చెప్పారు.

గోపా : ఏవనీ...నా నిమ్ము...నా నిమ్మంటూ నిముషానికొకసారొచ్చి మనకి మనశ్శాంతి లేకుండా చేస్తాననా !

చారు : అదేం కాదు...ఈ పోర్షనంటే నాకు సెంటిమెంటు ...అంచేత అప్పుడప్పుడు వచ్చిపోతుంటా... కాదనకూడదూ...ప్రతిరోజూ అంటే ఏవారానికో పది రోజులకో వస్తాడనుకున్నానేగానీ, యిలా పాచియింట్లోకి ప్రవేశిస్తాడనే నేనేం కలగన్నానా ? ....

గోపా : అందుకే రానియ్యి ....తేల్చి పారేసి మళ్ళీ గడప తొక్కకుండా చేస్తా....వెధవ కొంపా వీడూనూ...

చారు : ఆ ! చేస్తారు. ఎందుకు చెయ్యరూ...ఆయన ఖస్సుమని కొంప ఖాళీ చెయ్యమంటే చచ్చేది నేను. మీకేం మహారాజులాగా కాలుమీద కాలేసుక్కూర్చుంటారు....

గోపా : ఏవిటే పొద్దునే బయటికొచ్చిన మంత్రిలాగా తెగ భాదపడిపోతున్నావ్....

చారు : అంతకన్న యింక నేనేం చెయ్యగలను లెండి...పెళ్ళయిన ఆరేళ్ళలో అరవై ఆరు కొంపలు మార్చాం... ప్రతిసారీ నే ఇంటికోసం వీధులు పట్టుకు తిరగాల్సిందేగానీ... ఒక్కసారన్నా సరదాగా యింటికోసం వెదికారా ?

గోపా : నాకేం ఖర్మ...రోడ్లు పట్టుకు తిరగడానికి. వుండడానికి నిద్దరోవడానిక నాకు ఎంచక్కా ఆఫీసుంది. యిల్లు అవసరం నీగ్గాబట్టి నువ్వే వెతుక్కోవాలి.

చారు : అందుకే చెప్తున్నా...యిహ నే తిరగలేను. నా వల్లకాదు....అంచేత చక్రం మావయ్య గార్నేం అనకండి.

గోపా : చక్రం మావయ్య, డిక్కీ అత్తయ్య ...వెధవ వరసలూ...నువ్వూనూ....ఈ వెధవ పెళ్ళాన్ని చేతులారా చంపేడు. హంతక ముండా కొడుకు....వాడికింత గౌరవం అక్కర్లేదు...అర్ధమైందా !

చారు : చంపుకోనియ్యండి. ఆయన పెళ్ళాన్ని ఆయన చంపుకుంటే మధ్యన మీ కెందుకు కోపం.

గోపా : ఓహో...వుండక్కర్లేదంటావ్....అంటే ఎవడి పెళ్ళాన్నివాడు చంపుకోవచ్చు అంటావ్...బాగా ఆలోచించి చెప్పు....

చారు : మొగుడూ పెళ్ళాలన్నాక మొగుడు పెళ్ళాన్ని చంపుతాడు. పెళ్ళాం మొగుడ్ని కొడుతుంది. అది వాళ్ళ వాళ్ళ ఓపికల మీద ఆధారపడి వుంటుంది. మనకెందుకొచ్చింది. ఇక మీరేం మాట్లాడకండి...

గోపా : అలాగే చంపుకుతినమను....నాకేం అబ్జకషన్ లేదు...కాని వుదయాన్నే పాచినోటితో ఆ పాపిష్టి మొహం చూసేను. ఏమౌతుందోనని భయంగా వుంది..

చారు : ఏం కాదు....ఆఫీసు టైమవుతోంది. తొరగా వెళ్ళి తయారవండి....
( చీపురు తీసుకొని వూడుస్తోంది )

గోపా : నీకేం...నువ్వలాగే అంటావ్...అసలే నాకు నమ్మకాలెక్కువ. ఒక రోజు ఆఫీసు కెళదామని అలా వీధిలోకెళ్ళానో లేదో యిదే మొహం ఎదురయ్యి వంద చిల్లరుందాని ఆరా తీసింది. లేదని అబద్ధం చెప్పి ఆ బస్సు ఎక్కేనో లేదో...

చారు : ఏవైంది ?

గోపా : ఏం చెప్పమంటావ్....బస్సు ఫుల్లుగా వుంటే కిటికీ పట్టుకువేలాడుతుంటే, యిద్దరొచ్చి పట్టికెళ్ళి ఖాళీగా వున్న యింకో బస్సు ఎక్కించారు. లోపల యింకో ఆయన ఎవరి కోసమో వెయిటింగ్ చేస్తున్నట్టు కూర్చున్నాడు.... యిద్దరికోసం స్పెషల్ బస్సా అని ఆశ్చర్యపోతుంటే ముప్పయ్ కట్టు అన్నాడు... దేనికి సార్ అంటే యాభై అన్నాడు. ఏవిటలా పెంచేస్తారంటే వంద అన్నాడు. అది మొబైల్ కోర్టు అని తెలిసేసరికి రెండొందల పాతిక దగ్గర పాట ఆగింది.

చారు : దానికి మావయ్యగారి మొహం కారణమని మీ నమ్మకం అంతేగా !....

గోపా : యింకా అనుమానమా ....ఇంకోసారి నువ్వు వూళ్ళో లేవు... మీ నాన్న అటక మీదనుండి పడ్డాడని నువ్వెళ్ళావే అప్పుడూ ఇలాగే పొద్దున్నే తలుపుకొట్టి నిద్రలేపి గోపాల్రావ్ పిన్నీసుందా అనడిగేడు...నాకు వొళ్ళు మండి పోయి, మొలతాడుకి వుండాలండీ అన్నా. అయితే నువ్ పడుకో నే వెతుక్కుంటాలే అన్నాడు. చచ్చేంత భయం వేసి యిచ్చేశాననుకో. యింతకీ ఆ రోజు ఏదో ఆలోచిస్తూ రోడ్డుపైన వెళుతుంటే ఓ కాలేజీ అమ్మాయి పని వేళా పిలిచి నీకు యింట్లో అక్కలూ చెల్లెళ్ళూ లేరా ? అని అడిగింది. లేరండి.....ప్రస్తుతం నా వైఫ్ కూడా లేదనేసరికి కస్సుమని కాలిచెప్పు తీసింది.

చారు : అంటే నే వూళ్ళోలేకపోతే ఆడపిల్లల వెంట పడతారన్నమాట.

గోపా : అబ్బే....అదేం కాదు ....ఆవేళ అలా అయిపోయింది. కమ్యూనికేషన్ గేప్ అంతే....

చారు : అంటే చక్రం మావయ్యగారి మొహం చూసినప్పుడల్లా పరువు నష్టమో ధన నష్టమో జరుగుతుందని మీ నమ్మకం.

గోపా : అంతేకాదు....యివాల పాచినోటితో చూశాను....యింకెంత పవర్‌ఫుల్‌గా వుంటుందోనని దిగులుగా వుంది.

చారు : ఆయనొస్తున్నట్టుంది....మీరేం మాట్లాడకండి....యిళ్ళ కోసం నే తిరగలేను....

గోపా : అందుకని ఈ క్రిమినల్ గాడ్ని చూసి కిసక్కున నవ్వి విష్ చేయమంటావా ? నా వల్ల కాదు.. ఈ కొంప కాకపోతే, యింకో కొంప....దేశమేవన్నా గొడ్డు పోయిందా ?....

చారు : అయితే సరే...అంత ధైర్యం వుంటే మీ యిష్టం వచ్చినట్లు మాట్లాడండి....ఈ సారి మీరు యిల్లు వెతికి రమ్మనే వరకూ నేను మా పుట్టింట్లో తలదాచుకుంటా .....ఆ తర్వాత మీ యిష్టం....

గోపా : అలాగే వెళ్ళు .....ఓ నెల రోజులు ఏక బిగిన నువ్వుగానీ అక్కడుంటే మీ నాన్న సెలవు పెట్టి వచ్చి యిల్లు వెతికి పెట్టడూ....నాకా ధైర్యం వుంది.

చారు : పొద్దున్నే మా నాన్ననేం అనకండి....అసలే ఆయనకి వంట్లో కూడా బాగాలేదని వుత్తరం కూడా వొచ్చింది.

( చక్రధరం లోపల్నుంచి వస్తూ )

చక్ర : అమ్మాయ్...ఆ తులసి మొక్కకు నీళ్ళు పోయడం లేదా....ఎండిపోయింది...ఎట్లాగో

రెండు పూట్లా స్నానం చేస్తావుగా...వెంటనే ఓ చెంబుడు నీళ్ళు దాంట్లో గూడా పోస్తుండు...నిమ్మకి  ఆ మొక్కంటే ఎంత ప్రాణమో !.....

గోపా :  చెంబుడేం ఖర్మ, డ్రమ్ముడు .....డ్రమ్ముడు నీళ్ళు పోస్తాం....చాలా ?

చక్ర : ఆ మాట నేనన్నానా....ఎందుకంత కోపం  పొద్దున్నే ....ఎవరి మీద !....

చారు : అబ్బే మీ గురించి కాదులెండి....మా నాన్నగారి మాటొచ్చి లంచాలు పడతారు అంటేనూ, దేశంలో ఎంతమంది ఎన్ని రకాలుగా లంచాలు యివ్వడం లేదూ.... పుచ్చుకోవడం లేదూ...మా నాన్న ఒకడేనా అన్నానని....

గోపా : వెధవ....త్రాష్టుడు....క్రిమనల్ ఫెలో....

చక్ర : ఏవిటా దండకం.....మీ మావగారినే....

చారు : పెళ్ళయి యిన్నేళ్ళయినా  మా నాన్ననడిగి డబ్బు  పట్రామ్మంటారు. కాదన్నానని కోపం....తిట్లు...ఎంత ఆడపిల్లని  యిచ్చుకున్నవాడయినా  ఎన్నాళ్ళని  యిస్తారు చెప్పండి.

చక్ర : ఈ ఒక్క విషయంలో గోపాల్రావ్ వాదనే కరెక్టేమో  అనిపిస్తుందమ్మా.... అల్లుడన్నాక అడిగినప్పుడు  అడిగినంత యివ్వాలి....అసలు అల్లుడంటే ఎవడూ....సాక్షాత్తూ సొంత కూతురికి మొగుడు కాదూ.... పరాయివాడా....

గోపా : అలా చెప్పండి....నే కాబట్టి చదువుకుని, బుద్ధీ జ్ఞానం, వుండి కడుపుకి ఇంత అన్నం తింటున్నా కాబట్టి వొట్టి మాటలతో  పోనిస్తున్నా...అదే ఇంకోడు ఇంకోడయితే గొంతు పిసికో, గాస్ నూనె పోసో పెళ్ళాన్ని చంపేవాడు.

( ఆ మాటలకి చక్రధరం కంగారు పడ్డాడు )

చక్ర : అమ్మాయ్....ఆ తులసి  మొక్కకు నీళ్ళు పోయడం  నువ్ మాటల్లో పడి మర్చిపోతావేమోగాని....యివాల్టికి  నే పోసేస్తాలేమ్మా....

( అంటూ లోనికి వెళ్ళేడు )

గోపా :చూసేవా....ఆ కంగారు....నెంబర్ వన్ రోగ్....పెళ్ళాన్ని డబ్బు కోసం  చంపి ఎవరికీ అనుమానం రాకుండా దొంగ ప్రేమలూ, కట్టు కథలూ.....

చారు : పోన్లెండి....వెళ్ళి మొహం కడగండి....

గోపా : ఎవరికి ? వాడికా ?...

చారు : వాడిక్కాదు...నాకు... మాటలు కూడా అర్థం కావడంలేదా ? ....వెళ్ళి దంతదావనం పూర్తి చూసుకొస్తే కాఫీ యిస్తానంటున్నా....

గోపా : కొంపలోంచి వాణ్ణి పోనియ్యి....అన్నట్టు ఇంకా పేపరు రాలేదేంటి ?

చారు : వస్తే యిక్కడే వుంటుందిగా ...నేనేవన్నా బీరువాలో పెట్టి తాళం వేస్తానా ? ( విసురుగా వెళ్ళిపోయింది )

గోపా : అందరికీ అలుసయి పోయింది...ఇంట్లో పెళ్ళాం దగ్గర్నుంచి బయట పేపరు కుర్రాడి దాకా.... ఓ పద్దతి పాడూ...సమయం సంధర్భం లేకుండా...తేలుస్తా.... ఒక్కొక్కళ్ళ సంగతీ తేలుస్తా... ( అతడి మాట పూర్తి కాకుండానే బయట్నించి పేపరు తాడుతో కట్టబడి రివ్వున వచ్చి అతడికి తగిలింది. గోపాల్రావ్ వీధివైపు కోపంగా చూసి కిందపడ్డ పేపర్ని తీసి బయటకు విసురగా గిరాటేస్తూ ...)

గోపా : రాస్కెల్...పేపర్ని పొలైట్‌గా యివ్వడం తెలీదు... యివాళ నుండి నాకు పేపరేం అక్కర్లేదు...తీసుకెళ్ళు... ఫో.... ( అతడి మాట పూర్తి కాకుండా పేపరు మళ్ళీ వచ్చి అతడికి తగిలింది. గోపాల్రావ్ మరింత రెచ్చిపోయి పేపర్ని మళ్ళీ విసిరి వేయగా మళ్ళీ అది వెంటనే తిరగొచ్చి తగిలింది. గోపాల్రావ్ ఈసారి బయటకు విసిరి అక్కణ్ణుంచి పక్కకు తప్పుకోగా ఈ సారి పేపరు లోపల్నుంచి వస్తున్న చక్రధరానికి తగలగా ఆయన అర్థంకానట్టు పేపర్ని తీసుకొని బయటకు విసరగా, పేపరు మళ్ళీ తిరిగొచ్చి చక్రానికి తగిలింది )

చక్ర : ఈ పేపరు కుర్రాడికింత పంతం పనికిరాదు....అందుకే మా నిమ్మీ పేపరు వద్దు మొర్రో అనేది.... ( అంటూ చక్రధరం పేపర్ని తిరిగి బయటకు విసరబోతుండగా గోపాల్రావ్ దాన్ని ఆయన చేతుల్లో నుండి తీసుకుంటూ )

గోపా : వుండండి... ఈ వెధవ కింత పట్టుదల పంతం ఏవిటో తేలుస్తా.... ( అని బయటకి వెళ్ళబోతుండగా ...సత్యానందం చేతిలో పెట్టెతో సహా ప్రవేశిస్తూ ఎంతో నొచ్చుకుంటున్నట్లుగా )

సత్య : నీ ఉద్దేశ్యం ఏవిటోగాని అల్లుడూ....గడపలో కొచ్చిన వాళ్ళని యిలా పేపర్లతో పుస్తకాలతో కొట్టే అలవాటు మనలాంటి మర్యాదస్తులకుండాల్సిన అలవాటు కాదు....గడపలో వున్నది నేనే గాబట్టి... సరిపోయింది. అదే వేరే ఎవరైనా అయితే నీ ఆరోగ్యం గురించి వాళ్ళేం అనుకుంటారు.

గోపా : అంటే.... యిందాకట్నుంచి బయటనుంచి పేపరు విసిరంది మీరన్నమాట.

సత్య : అంటే లోపల్నుంచి విసిరింది నువ్వు కాదా ?...

గోపా : అహ...నేనేననుకోండి. ఆ అన్నట్టు ఒకసారి యిదిగో ఈయన గూడా బౌలింగ్ చేశారు.

చక్ర :యిది మరీ బావుంది....మీ మావగారు బయట నిలబడి ఇంట్లోకి పేపర్లు వీక్లీలు విసురుతాడని నాకేం తెల్సు ? పేపరు కుర్రాడే పంతం కొద్దీ విసురుతున్నాడుకుని సరదాగా " ఓ చెయ్యి వేశానంతే ...

సత్య : ఓహెూ...ఎవరీయన ?....

గోపా : చక్రాల మావయ్యగారని....

సత్య : అంటే స్కూళ్ళ ముందు జీళ్ళు చక్కిలాలు అమ్ముతుంటాడా....

చక్ర : శివ శివా... ఈ యింటికి ఓనర్ని ....పేరు చక్రధర్రావు ...మీ అమ్మాయి ప్రేమగా చక్రం మావయ్యా అంటుంది.

( అంతలో చారుమతి కాఫీ గ్లాసుతో అక్కడికొచ్చి తండ్రిని చూసి ఆనందంగా )

చారు : మీరా నాన్నా....యిదేనా రావడం....మీ వంట్లో ఎలా వుంది ?

సత్య : అడక్కమ్మా ....ఆరోగ్యం గురించి అడక్కు....అవునూ...అదేవిటమ్మా చిక్కి సగం అయిపోయావ్...అల్లుడేమో కాస్త వొళ్ళు చేసినట్టున్నాడు....

గోపా : చూడ్డానికిలా వున్నానేగానీ నాకూ వంట్లో అసలు బాగుండడం లేదు...ఆ కాఫీ నా కోసమేనా ....ఆ కాస్త నా మొహాన పోస్తే పోయి మొహం కడుక్కుంటా...

సత్య : ప్చ్....ఏవిటో ... రకరకాల జబ్బులొచ్చిపడుతున్నాయి....కాకపోతే, వచ్చేపోయేవాళ్ళని పేపర్లు పెట్టి కొట్టడం ఏమిటి ; కాఫీ అడిగి మరీ మొహాన పోయించుకుని వెళ్ళి కడుక్కోవడం ఏవిటీ ? వెళ్ళవయ్యా...వెళ్ళు... రెస్టు తీసుకో...

చక్ర : ( పెద్దగా నవ్వుతూ ) కమ్యూనికేషన్ గేప్...నా నిమ్ముక్కూడా మాటలు ఓ పట్టాన అర్ధవయి చచ్చేవి కావు....

సత్య : నిమ్మునా ? ....అదే వత్తి... మళయాళం సినిమాల్లో స్టూడెంటు కుర్రాడితో లేచిపోయే పతివ్రతా ? అదేలే...ఆ టైపు వేషాలేసే నటీమణా ?

చారు : అదే నాన్నా...నిమ్ము అంటే నిర్మలగారని...చక్రం మావయ్యగారి భార్య ...పాపం యీ మధ్యనే పోయింది.

గోపా : అదే లెండి... ఈ మధ్యనే పంపించేశారు...

సత్య : అంటే .... చంపేశారా ? ఎవరూ ఎన్నాళ్ళయింది ?

( గుండె చేత్తో పట్టుకుని కుర్చీలో కూలబడ్డాడు )

చారు : నాన్నా ఏవయింది....గుండెల్లో దడగా వుందా ?

చక్ర : యిదిగో... గోపాల్రావ్...నువ్వు వ్యంగ్యంగా మాట్లాడకు... నాక్కోపం వస్తుంది...నీకంత కసిగా వుంటే గడపలో నిల్చుంటాను.... పేపరు పెట్టి కొట్టు.

సత్య : అంటే కసి వున్న వాళ్ళని అల్లుడు పేపర్లు పెట్టి కొడతాడా ?

చక్ర : నిమ్మని పంపించడవేమిటి. ఎవరైనా వింటే నిజవే అనుకుంటారు....అదంటే నాకెంత ప్రేమో నీకేం తెలుసు.యిప్పటికీ మర్చిపోలేక గదా మాటి మాటికీ మీ యింటికొచ్చేది...నిజంగానే చాలా ఫీలవుతున్నానయ్యా !

చారు : మీరేం బాధపడకండి మావయ్యగారు...ఆయన వరుస మీకు తెలియనిదేం ఉంది ? ఎవళ్ళతో ఎలా మాట్లాడాలో కూడా తెలీదు.

చక్ర : అబ్బే గోపాల్రావ్ గురించి నీకు తెలీదూ....యిదిగో నువ్వు ఏం బాధపడకమ్మా. అన్నట్టు వంటగదిలో పంపు లీకవుతోంది కొత్త వాషర్ తెచ్చి వేస్తాలేమ్మా....మళ్ళీ వస్తా... ( గోపాల్రావ్ వంక గుర్రుగా చూస్తూ వెళ్ళిపోయాడు )

చారు : ఏం నాన్నా ...గుండెల్లో దడగా వుందా...కాసేపు రెస్టు తీసుకుంటావా ?

( గోపాల్రావ్ కాఫీ తాగుతూ పేపర్ చదువుతున్నట్లు నటిస్తూ వాళ్ళ సంభాషణ ఆసక్తిగా వింటున్నాడు )

సత్య : రెస్టా నా బొందా ..అయిపోయిందమ్మా..... మీ నాన్న పనయిపోయింది...డాక్టర్ కూడా తేల్చి చెప్పేశాడు...హార్ట్ హారిబుల్‌గా వీకయింది జాగ్రత్త సుమాని... యిహ నేనెంత కాలం జీవిస్తాననేది మీ అందరి చేతుల్లోనే వుంది.....

చారు : అదేవిటి ? మా అందరి చేతుల్లో వుండడం ఏవిటి ? నాన్న

సత్య : అదేనమ్మా ....మన వూళ్ళో హార్ట్ స్పెషలిస్టు వేణుగోపాల్రావ్ గారు లేరూ ఆయన రెండ్రోజులు బాడీ మొత్తం చెకప్ చేసి యిదిగో ఈ వుత్తరం రాసిచ్చారు. యిస్తూ సత్యానందం అహర్నిశలూ ఈ ఉత్తరాన్ని జేబులో వుంచుకో ! కొత్త వాళ్ళు కలినపుడు ముందీ ఉత్తరం చూపించు ఇహ నీకే ఢోకా లేదని అన్నారు....

( అంటూ జేబులోంచి ఓ కాయితాన్ని తీసి కూతిరికిచ్చేడు....గోపాల్రావ్ ఆసక్తిగా చూస్తుండగా చారుమతి ఉత్తరాన్ని చదవడం ప్రారంభించింది )

చారు : ఈ లేఖను మీకు సమర్పించిన వ్యక్తి పేరు సత్యానందం... వీరి తండ్రి నిత్యానందం. వీరి అసలు వూరు కృష్ణా జిల్లాలోని శ్రీకాకుళ గ్రామం. వీరి తండ్రిగారితో నాకు పూర్వపు పరిచయం గలదు....వీరి తండ్రి చక్కటి పండితులు. అందువలన వీరు పండిత పుత్రులను విషయం చెప్పవలసని ఆవశ్యకత నాకు కనిపించుట లేదు. అబ్బ... ఏవిటి నాన్నా డాక్టరుగారి తెలుగు భాష యింత పాత కంపుకొడుతుంది.

సత్య : ఆ డాక్టరుకి విశ్వనాధ సత్యనారాయణగారంటే చచ్చేంత అభిమానం....అసలు విషయం తొందరగా చదువు....

చారు : ఈ సత్యానందం అను పండితపుత్రుడు గత నెల బాధ్రపధ శుద్ధ సోమవారం నాడు నా వద్దకు కడు దీనంగా వచ్చి తన హృదయంలో మిక్కిలి అలజడిగా వున్నదని విన్నవించుకొని తనని పరీక్షింపమని ప్రార్ధించాడు. బాధలో వున్న వారికి సేవ చేయుట నా వృత్తి ధర్మము కదా ! వీరిని మరియొక గదిలోనికి తీసుకెళ్ళి పూర్తి నగ్నముగా పరీక్షించితిని ....రామ రామ...యిదెక్కడి డాక్టరు నాన్నా...

సత్య : వాడంతేనమ్మా...పడిశం పట్టి వెళ్ళినా బట్టలు విప్పమని ప్రాణాలు తీస్తాడు...తర్వాత చదువు....

గోపా : ఆ ...పూర్తి నగ్నముగా గావించి పరీక్షించితిని... కానీ చిత్రము ...నాకేమీ కనిపించలేదు... అదే విషయం అతడికి చెప్పి నేను నిష్క్రమించుచుండగా, ఈ పండిత పుత్రుడు ధృష్టి దోష నివాంణా ఫళకములు...

సత్య : అంటే కళ్ళజోడు ...వాణి తగలెయ్య...కొత్త పదాలు కనిపెట్టి మరీ వాడతాడు....

చారు : దృష్టి దోష నివారణఫలకమునే ధరించుట మర్చిపోతినని నాకు జ్ఞప్తి చేసినాడు....నేకించిత్తు ఆశ్చర్యపడి తిరిగి దృష్టిదోష నివారణా ఫలకములు ధరించి యితడి శరీరమును కూలంకషంగా పరీక్షించితిని ...ఇతడి హృదయము మిక్కిలి పతనావస్తలో వున్నదన్న సంగతి తిరుగులేని సత్యము... హృదయ కవాటములు మూసుకుపోయి.... రక్త ప్రసరణ సక్రమముగా జరగని కారణంగా యితడి హృదయం ఎండిపోయి వేలాడుచున్నది...దాని వల్ల యితడికి లేశమాత్రమైన వుపయోగం కానవచ్చుట లేదు....యితడు కేవలం దైవ కృప వల్లనే జీవించి యున్నాడని నా స్దిర నిర్ణయం.

సత్య : యిక్కడ నుండి చాలా ముఖ్యం...అల్లుడూ నువ్వు కూడా జాగ్రత్తగా విను....

గోపా : మొదట్నుంచి అవుతూనే వున్నా....తొందరగా కానీవే....

చారు : పైన వుదహరించిన కారణమువల్ల యితగాడిపైన వుద్రేకం, వుత్సాహం ఆందోళన వంటి రసప్రయోగములు విషపూరితములగును. వేలాడుచున్న హృదయమును త్రోసి చేయగలవు అందువల్ల సర్వులూ ఈ విపత్కర స్ధితిని గుర్తించి ఏ విషయమునైనా చాలా తేలిక విషయంగా చిరునవ్వుతో చెప్పవలెను. అందరూ సహకరించిన ఈ సత్యానందం మరికొన్ని సంవత్సరములు జీవించు అవకాశము గలదు. కావున యితగాడిని కరుణించి కాపాడండి... భవదీయ .... విద్వాన్ ...డాక్టర్ వేణుగోపాల్రావ్ గురజాడ వారి వీధి రాజమహేంద్రవరం...

సత్య : అదమ్మా సంగతి... అంచేత అల్లుడూ ....నీక్కూడా చెబుతున్నా...నేవున్న నెల్రోజులూ ఏ విషయం గురించయినా కాస్త నిధానంగా చెప్పండి....

గోపా : అంటే చావు కబురన్నా సరదాగా చిరునవ్వుతో చెప్పాలన్నమాట.

సత్య : అవునోయ్...సింపుల్గా అంతే...

గోపా : అయితే చిన్న రిహార్సల్. ఫరెగ్జాంపుల్...

చారు : ఏ విషయం ...ముందు నాకు చెప్పండి...

గోపా : వీల్లేదు...డైరెక్టుడీలింగ్....ఆ ! ....మావగారూ ( నువ్వు ) హి...హి...హి... మన చక్రంగాడు అదే. యిప్పుడొచ్చిన ఓనర్ వెధవ ( నవ్వు ) వాళ్ళావిడ్ని జస్ట్ ఫైవ్ లీటర్స్ కిరసనాయిలు పోసి కాల్చి చంపాడు... హిహిహి...

సత్య : ఏవిటీ.... పెళ్ళాన్ని చంపేశాడా....ఎప్పుడూ ( అంటూ గుండె పట్టుకున్నాడు)

చారు : అంతా వొట్టిది నాన్న... కంగారు పడక... ఆయనకి, ఆవిడకి మామూలుగా మాటామాటా పెరిగింది. ఎంతయినా మగాడు కదా కోపం వచ్చుంటుంది. సరే తాళి కట్టిన వాడు కిరసనాయిలు పోయడంలో వింతేముంది. పూర్తిగా తడసాక అగ్గిపుల్ల గీయనా అనడిగితే గీయండీ అందట....భగ్గుమనిపంచారు...అంతే....

సత్య : ( చాలా రిలీఫ్గా ) అంతేనా ?....ఏవిటో అనుకుని హడలి చచ్చానుకో....

గోపా : అవునూ ...నేచెప్పిందీ యిదేగా...పైగా నవ్వుతూ కూడా చెప్పేను....

చారు : అలా కాదులెండి....నాన్న నాల్రోజులు యిక్కడుంటే మీకు చెప్పటం అలవాటంయిపోతుంది. వెళ్ళి మీ పన్లు చూసుకోండి....వెళ్ళండి.

గోపా : నిజంగా నాల్రోజుల తర్వాత యిక అందరితోనూ యికిలిస్తూ మాట్లాడతానేమోనని

చెడ్డ భయంగా వుందే.... అసలే మా ఆఫీసరు నవ్వితే పేపర్ వెయిట్ పెట్టి కొడతాడు...ప్చ్... ( లోనికి వెళ్ళిపోయాడు )

సత్య : అమ్మాయ్...ఈ చక్కిలాల మామయ్య...

చారు : చక్కిలాలు కాదు...చక్రం ....చక్రం మావయ్య ....

సత్య : అదేలే...వాడు నిజంగా పెళ్ళాన్ని చంపేశాడా !

చారు : పోన్లే నాన్నా....ఆ విషయాలన్నీ నీ కెందుకు ...అసలే నీ ఆరోగ్యం బాగా లేదు... అయినా దేశంలో ఎంతమంది మగవాళ్ళు భార్యల్ని చంపడం లేదు... వాళ్ళల్లో...వీడొకడు...అవునూ...వుత్తరం కూడా రాయకుండా వచ్చావ్... ఏదైనా పనిమీదొచ్చావా...

సత్య : పనా...నా శ్రాద్ధమా ...అదో పెద్ద కథమ్మా....మొన్న హెడ్డాఫీసు నుండి ఓ కుర్రాఫీసరు చెకింగుకంటు వచ్చి తగలడ్డాడు. నాలుగయిదు రోజులు ప్రాణాలు కొరుక్కుతిని .... సరే నిన్న తిరుగు ప్రయాణం అయ్యేడు...ఎంతయినా ఆఫీసరు కదాని రైలెక్కిద్దావని స్టేషన్కొచ్చా ....వాడేమో ఫ్లాట్ఫాంపై నిలబడి ఆవులాగా అరటిపళ్ళు మేస్తుంటే, నేనేమో వాడి లగేజీ లోపల పెడదావని బండీ ఎక్కానమ్మా...దాన్దుంపతెగ...బండి చటుక్కున కదిలింది...కొంప మునిగిందని దిగబోతుంటే ఆ వెధవ అంతా తెలిసినట్లు....నోవర్రీ...ఇంజను ఎటాచయ్యింది.... అంతే అన్నాడు...నిజవే అనుకుని చచ్చా...నాకేం తెల్సు... తీరా చూద్దునుగదా బండి పికప్పయి స్పీడందకుంది. వాడక్కడే వున్నాడు....వాడి లగేజీతో నేనేమో యిలా వచ్చేశా...

చారు : అంటే అమ్మక్కూడా తెలియదన్న మాట ఇక్కడికొచ్చినట్లు...

సత్య : తెలీదు...అదేగా నా బాధ...అమ్మా...అల్లుడ్ని కాస్త రెండు ముక్కలు టెలిగ్రాం... కొట్టమను. ఏం అక్కర్లేదు...ఫాదరిన్లా ఎరైవ్డు సేఫ్లీ అండ్ హేపీ.... నో వర్రీ... గోపాల్రావ్...అంతే చాలు... ( గోపాల్రావ్ లోపలికొస్తూ )

గోపా : ఫాదరిన్లా ఎరైవ్డ్ సేఫ్లీ....అంతవరకు బాగానే వుంది...కానీ అండ్ హేపీ అన్నారు.... అక్కడే కాస్త డౌట్ ...హేపీనెస్ ఎవరికి ? మీకా ? మాకా ?

సత్య : నాకేనయ్యా...

గోపా : అంతేలెండి ...మీరొచ్చాకా ఇంకా మాకు హేపీనెస్ ఎక్కడుంటుంది....ఆ పోనీ అలా

కాకుండా " వ(్రీ ఎరైవ్డు సేఫ్లీ .... బీ హేపీ " యిలా కొడితే ఎలా వుంటుంది...

సత్య : అలా కొట్టొద్దు ...నే చెప్పినట్లు కొట్టు...నీకు పుణ్యం వుంటుంది...అమ్మాయి కాస్త నీరసంగా వున్నట్టుందే....

సత్య : పదండి....కాసేపు రెస్టు తీసుకుందురుగాని...లేవండి....మెల్లిగా...

సత్య : పదమ్మా ...గోపాల్రావ్ ...టెలిగ్రాం ...మర్చిపోక... ( తండ్రీ కూతుళ్ళు అలా వెళ్ళగానే చక్రం మరోవైపు నుండి ప్రవేశించేడు )

గోపా : మళ్ళీ మీ నిమ్మూ గుర్తుకొచ్చిందా ?....

చక్రం : గుర్తు రావడానికి అసలు మరిచిపోయిందెప్పుడూ ...కిచెన్లో పంపు లీకవుతుంటేనే వాషర్ కొత్తది వేద్దాని....అవునూ ...మీ మావగారు ఎన్నాళ్ళు వుంటాట్ట....

గోపా : యింకా నాక్కూడా తెలీదండి...వుండండి అడిగి చెప్తా.... చారూ...చారూ...ఒసేవ్ చారూ... ( లోపల్నుంచి వస్తున్నా అని వినిపించడంతో చక్రం కంగారు పడి )

చక్రం : వూరుకోవయ్యా బాబూ...నీ తొందరపాటు బంగారం గానూ...వూరికే మాట వరసకి అడిగానంతే...యిదిగో గోపాల్రావ్...నీక్కోపం వచ్చినా సరే ఓ సంగతి మాత్రం చెప్తానయ్యా...ఈ రోజుల్లో బతకాలంటే కోపం కాదయ్య కావాల్సింది లౌక్యం ... ముందు చూపున్న... మీ మావగారు లంచాలు అవీ బాగా పడతాడని యిందాకన్నావ్ గుర్తుందా ? మరి...తెలివిగా రెండ్రోజులు ఎక్కువుంచుకొని గుండెలకి అమృతాంజనం రాసినట్టే రాసి యిరవై వేలో, ముప్పై వేలో తెలివిగా పట్టెయ్యాలి.

గోపా : నిజమే సుమండీ...కానీ చిన్న ప్రాబ్లమ్...అహ ఏం లేదు...మా మావగారు అదో టైపు మనిషి.... పెడితే సుష్టుగా తింటాడు..అమృతాంజనం రాస్తానంటే గుండెలకేం ఖర్మ. మొత్తం వళ్ళంతా రాయించుకుంటాడు....కానీ పైకం మాటంటే చీదరింపులు మొదలుపెడతాడు.... అవునూ...పోనీ మీరు చెప్పండి.... పెద్దవాళ్ళు బాగా అనుభవం వున్నవాళ్ళు గదా....అమృతాంజనం లైను కాకుండా అమాంతం పిల్లని చంపేస్తానని నోటీసు యిస్తే పని జరుగుతుందంటారా ?

చక్ర : జరగొచ్చు ...కానీ రిజల్ట్స్ గేరంటీ యివ్వడం కష్టం ...అందులోనూ మీ మావ మహా ముదురంటున్నావ్.

గోపా : నోటీసు గీటీసు కాదండి.... నిజంగా చంపేస్తాం...అప్పుడో ?....

చక్రం : యిహ దానికి తిరుగు ...చంపేస్తాం ఏవిటి ? ....ఏక వచనం వాడితే సేఫ్ !

గోపా : అదేనండి.... చంపేస్తా...పది రోజుల టైమిచ్చి పనికాకపోతే చంపేస్తాం... సారీ... చంపేసాననుకోండి ...వాట్ నెక్ట్స్ ?....

చక్ర : దాంట్లో గూడా కాసిని కాంప్లికేషన్స్ తగలడ్డాయి...అయినా నన్నడుగుతున్నావ్..నాకేం తెల్సు నా బొందం...నా నిమ్మి గూడా అప్పుడప్పుడూ అర్ధ పర్ధంలేని ప్రశ్నలతో విసిగించేది...

చారు : ఏవిటి పిల్చేరు ?....

గోపా : చక్రం మావయ్య గారికి చక్కటి అనుమానం వస్తేనూ....

చక్ర : నాకం అనుమానాల్లేవు... మంచివాడివే...నేఁదో వాషర్ తెద్దావని వస్తే... నా కనుమానాలేవిటి ? మొత్తానికి కొంప ముంచేటట్టున్నావ్ ( హడావుడిగా వంటగదిలోకి వెళ్ళి పోయేడు )

చారు : ఏవన్నారేం ....మావయ్యగారు అంత కంగారు పడిపోతున్నారు...

గోపా : పెళ్ళాన్ని చంపుకోవడం ఎలాగో చెప్పమంటేనూ...భుజాలు తడముకుకుంటున్నాడు... సరే..యింతకీ మీ ఫాదరు ఎన్నాళ్ళుంటాట్ట...

చారు : ఏమో తెలీదు... వుండనీయండి పాపం. రాక రాక వచ్చేడు...పైగా ఆరోగ్యం కూడా బాగోలేదాయె.... రెస్టు తీసుకుంటాడు....

గోపా : వంట్లో బాగోలేదు కాబట్టే నే భయపడి చచ్చేది....గుండె జబ్బు వాళ్ళు ఏ క్షణాన జణగణమన పాడతారో చెప్పలేం...యిక్కడ చచ్చాడే అనుకో – శవాన్ని ఎక్కడ పడుకోబెట్టాలి ? ....కనీసం మీ అమ్మ, మీ అన్నయ్య వచ్చే వరకన్నా శవాన్ని వుంచాలి. టెలిగ్రాం ఛార్జీలా... ఐసు ఖర్చులా ! సరే ...తర్వాత దహనం చెయ్యాలా... యివన్నీ మనవల్ల ఎక్కడవుతాయి...

చారు : ఛ...ఛ ..వూరుకోండి అవేం మాటలు...ఏదో శాస్త్రం చెప్పినట్లు శుభం పలకరా మంకన్నా అంటే....

గోపా : పెళ్ళి కూతురు విడో ఎక్కడుందీ అన్నాట్ట...శాస్త్రాలు నాకూ తెలుసు...యింతకీ గుండెజబ్బు విషయం నిజవేనా ? ....లేక యిక్కడుండటానికి చెప్పిన కథా....

చారు : మా నాన్న అలాంటి వాడేం కాదు.... అయినా డాక్టరు స్వయంగా రాసిచ్చిన కాయితం చూపించాడుగా.... అయినా నమ్మరా ?...

గోపా : అవునూ...ఆ కాయితం నిజంగా డాక్టర్ రాసేడా? ....లేక మీ అమ్మచేత రాయించుకొచ్చేడా ?

చారు : మీ అంత అనుమానం మనుషుల యింకొకళ్ళుండరు ....వెళ్ళి టెలిగ్రాం యిచ్చి రండి... ( వెళ్ళబోతుండగా )

గోపా : వెళ్ళి ఆ జేబులో పర్సుంది పట్రా.... ( చారుమతీ లోనికెళ్ళింది...గోపాల్రావ్ వెనక్కి తిరిగేసరికి జగన్నాథం నమ్రతగా చేతులుకట్టుకు నిల్చున్నాడు.... అతడ్ని చూసి గోపాల్రావ్ అనుమానంగా )

గోపా : యస్ ప్లీజ్ .....ఎవరు కావాలి ?.....

జగ : నా పేరు జగన్నాథవండీ....జర్నలిస్టుని ...అంతా జర్నలిస్టు జగన్నాథం అని...యింకా సింపుల్‌గా జెజె.నాదం అని అంటుంటారు....మీరు సెర్చిలైటు పేపరు గురించి విన్నారా ?

గోపా : వినడం కాదు ...కళ్ళారా చూసేను....రద్దీ సెంటర్లలో కుర్రాళ్ళు ఆటోల్లో...కార్లలో వెళ్ళేవాళ్ళకి బలవంతానా బతిమాలి అంటగడుతుంటారు అదేగా ?

జగ : అదేసార్... సాక్షాత్తూ అదే... కానీ యీ మధ్యన సర్క్యులేషన్ బాగా దెబ్బతింది.

గోపా : ఓహో...అంటే మీ పేపర్ కొనమని రిక్వెస్టా ? నో ప్లీజ్ ...తర్వాత చూద్దాం...అసలే నేను వర్రీస్‌లో వున్నాను...

జగ : మీరు కొనొద్దు సార్...కాస్త నాతో కోపరేట్ చేస్తే మీ జీవితాంతం పేపర్ ఫ్రీగా వచ్చే ఏర్పాటు చేస్తా...

గోపా : పేపర్ ఫ్రీగానా ? ....నాకా.... చిత్రంగా వుందే... ఏం చెయ్యాలో చెప్పండి.చూద్దాం...

జగ : చెప్తా....మందు ఓ ఫ్లవరు పేరు. మీ యిష్టం వచ్చింది చెప్పండి.

గోపా : ఏవిటి ? ఫ్లవర్ పేరొకటి చెప్తే పేపర్ ఫ్రీగా యిస్తారా...అందుకే సర్కులేషన్ పడిపోయివుంటుంది.

జగ : అది కాద్సార్....యింతకీ మీ పేరేవిటి ?...

గోపా : గోపాల్రావ్....అయితే యివ్వరా ?....

జగ : ( లెక్కలేస్తూ ) గోగాగీగూ ....వెరీగుడ్ ....యిప్పుడో ఫ్లవర్ పేరు చెప్పండి..

గోపా : ఊ...కాలీఫ్లవర్...

జగ :  కాలీ ఫ్లవర్... ఫ్లవర్ కాదండీ....

గోపా :  మరి కాలీ ఫ్లవర్ని  ఎందున్నారు...కాలీ ఫ్రూట్ అనో...కాలేఫ్రూటనో అనొచ్చుగా...

జగ : అబ్బ....  మూడు పాడు చెయ్యకండి సార్?... సరే పోనీ ...ఓ కాయ పేరు చెప్పండి....కాస్త ఆలోచించి  చెప్పండి...

గోపా : అలాగే  ...వూ...ఆ...తలకాయ...

జగ :  కాలీఫ్లవర్. తలకాయ ...పైగా గోగాగీతూ...బావుందండి...అంతా రివర్స్‌లో వస్తున్నారు. సో, మీతో పని జరగాలంటే ...( అటూ యిటూ చూసి చటుక్కున గోపాల్రావ్ కాళ్ళ మీద పడ్డాడు )

గోపా :ఛ...ఛ... యిదేవిటయ్యా...లే లే ....పోన్లే ...వేరే పువ్వు పేరు, కాయ పేరు చెప్తాగా...

జగ : మీరేం మాట్లాడకండి ...అంతా నే చెప్తాగా...  సెర్చిలైట్ ఎమ్.డి...కృష్ణాజీ రావు నిన్న మార్నింగ్  నన్ను పిల్చి  మిష్టర్ జగన్నాథం...రెండేళ్ళుగా  నా ఆర్గనైజేషన్‌లో రిపోర్టర్గా పని చేస్తున్నావ్....కానీ ఎంత  సేపూ లారీ ప్రమాదాలు, లాటరీ ఫలితాలు తప్ప చెప్పుకోతగ్గ  న్యూస్ పట్టుకు రావడం లేదు... నాకొద్దు...వేరే జాబ్ చూసుకోమని అల్టిమేటం  యిచ్చారు సార్....

గోపా :  ఓ...అదా సంగతి.. మరా మాట ముందే చెప్పొచ్చుగా .,...పూలూ, కాయలూ అంటూ  కంగారు పెట్టేశావ్. చూడు మిష్టర్....

జగ : జెజె నాథం సార్...

గోపా : చూడు మిష్టర్ జెజె నాథం. ఈ రోజుల్లో వుద్యోగాలు  దొరకడం  చాలా కష్టంగా వుందోయ్....అయినా  ట్రయ్  చేసి ఎక్కడన్నావుంటే చెప్తాగా.... ఎంప్లాయ్‌మెంట్‌లో పేరుందా ?...

జగ : మహాప్రభో ...మళ్ళీ  అపార్థం ...నే వచ్చింది వుద్యోగం కోసం కాదు...

గోపా : మరి...

జగ : ఏదైనా సెన్సేషనల్ న్యూస్ అయిటమ్ కోసం .....

గోపా : నేను మీకు సెన్సేషనల్ న్యూస్ ఏదయినా చెప్పాలా ? ...నా దగ్గరేం వుంటాయ్..ఆ అన్నట్లు మా మావగారు గుండెలేకుండా కొద్ది సంవత్సరాలుగా బతికేస్తున్నారు.... ప్రస్తుతం లోపల గుర్రెట్టి నిద్రపోతున్నారు....కావాలంటే రాసుకో...నా కభ్యంతరం లేదు....

జగ : లాభం లేద్సార్...చెప్పేయటం బెటర్...అసలే మీరే గోగాగీగూ... మీ యింటి ఓనర్ చక్రధరం గారు భార్యని చంపేశారు తెలుసో....

గోపా : అలాగా... ఎన్నో భార్యని ?....

జగ : ఎన్నో భార్యని. అంటే ఆయనికి. మహా ప్రభో ... చక చకా నాలుగు మాటలు చెప్పి నా వుద్యోగం నిలబెట్టండి.

గోపా : చక్రధరం భార్యని చంపేడని ఎవరు చెప్పేరు ?

జగ : జనావాక్యం ...అంతా రహస్యంగా చెప్పుకునేది....

గోపా : ఎందుకు చంపేడు.... ఎలా చంపేడు...ఎప్పుడు చంపేడు...

జగ : ప్రశ్నలతో చంపక తెల్సింది త్వరగా చెప్పండి.

గోపా : చెప్తా గానీ... మరి మా పేర్లూ గోత్రాలు....

జగ : ఛస్తే బయటకు రావు....

గోపా : వాడి పేరు, గోత్రం ఫోటో ?...

జగ : చచ్చినా ఆగవ్.....హెడ్ లైన్స్‌లో వస్తాయ్....

గోపా : చక్రంభాయ్ ....ఆగయా... వక్త్....హాయ్...ఏ వక్త్‌కి యింత జార్‌మే....

జగ : తెలుగులో చెప్పండి...హిందీలో నే వీక్....

గోపా : చెప్తా విను ...ఈ చక్రధరం అసలు వూరు...

చారు : టెలిగ్రాం యిచ్చి వచ్చేటప్పుడు నాన్నకి తెలుగు వీక్లీ కావాలట... కాస్త తెచ్చిపెట్టండి...ఈ యనెవరూ ?....

గోపా : జగన్నాథం అని జర్నలిస్టు...నా యింటర్వ్యూకోసం వచ్చేడు... నా వైఫ్ చారుమతి...

జగ : నమస్తే సిస్టర్...చెప్పండి సార్... నే రెడీ..

( పుస్తకం పెన్సిల్‌తో రడీ అయ్యేడు )

గోపా : ఈ చక్రధరంది ఆముదాల వసల....వెనకాల బాగా ఆస్థిపాస్తులున్నవాడే ....కాకపోతే .... డబ్బంటే కాపీనం ఎక్కువ....

జగ : ఏపీనం ?

గోపా : కాపీనం ...అంటే దురాశ...పిచ్చి ....వీడికి రెండు పెళ్ళిళ్ళు...

జగ : రెండు పెళ్ళిళ్ళా ...అంటే మొదటి భార్య చావుగ్గూడా వీడే కారణమా ?

గోపా : అయ్యుండొచ్చు....

జగ : అయితే సీరియల్‌గా రాయొచ్చు....

చారు : ఏవండీ...ఓసారిలా రండి....

గోపా : ఏవిటీ ...నేను ప్రెస్ వాళ్ళతో మాట్లాడుతున్నప్పుడు డిస్టర్బ్ చెయ్యొద్దన్నానా ? టెలిగ్రాం యిస్తాగా ....నువ్వెళ్ళి పన్చూసుకో....

చారు : అబ్బ టెలిగ్రాం గురించి కాదండీ ....మీతో ఓ మాట చెప్పాలి.... తొందరగా రండి...

గోపా : ఏవిటే...మీనాన్న ....ఓకేనా ...చెప్పవే .....

చారు : ఏవండీ చక్రం మావయ్య లోపల పంపుకి వాషర్ వేస్తున్నారు... అవునూ ...ఈ కుర్రాడికి ఆయన గురించి చెబుతున్నారు...దేనికీ ?

గోపా : అదా – ఏం లేదు సరదాగా చక్రం మావయ్యగారి గురించి పేపర్లో చక్కటి ఆర్టికల్ రాస్తారుట.

చారు : ఏం రాసుకుంటారో వాళ్ళని రాసుకోమనండి. మనమెందుకు చెప్పటం – ఈ విషయం గాని మావయ్యగారికి తెలిస్తే ఇంకేమన్నా వుందా ! తక్షణం ఇల్లు ఖాళీ చేయమంటారు...

జగ : సిస్టర్ – మీకా భయం అక్కర్లేదు ...మీ పేర్లు పైకి రానేరావు.... కమీషన్ రిపోర్టులే పత్రికాఫీసులకు పరుగెత్తుకొస్తున్నాయి. ఈ చిన్న విషయం గురించి మీరేం వర్రీ కాకండి.

గోపా : అవునే ! మనకి తెలిసిన విషయాలన్నీ చెప్పేసాం అనుకో – అటు చక్రంగాడిగాలి తీసినట్లు వుంటుంది. ఇటు ఫ్రీగా పేపరు సంపాయించినట్లు, అవుతుంది...ఇవన్నీ నీకర్థం కాదు గానీ వెళ్ళి పన్నూసుకో...

అదయ్యా ....ఆ ...మొదటి పెళ్ళాన్ని గూడా డబ్బులు తెమ్మని నానా ఏడుపులూ ఏడిపించేవాట్ట....ఓసారి పుష్కరాల రోజుల్లో స్నానానికి కృష్ణానదికి జంటగా వెళ్ళి వొంటరిగా తిరిగొచ్చి బావురుమన్నాట్ట....సరే ! ఆ పిల్ల తాలూకు వాళ్ళు రిపోర్టు గూడా ఇచ్చేరట....ఓ ఎం ఎల్ ఏని పట్టుకుని సర్దుబాటు చేయించుకున్నాట్ట?

జగ : సర్....ఆ మొదటి భార్య పేరు, ఆవిడ పోయిన సంవత్సరం, వీడు పట్టుకున్న ఆ ఎంఎల్ఏ గాడి పేరు చెప్పగలరా ?

గోపా : ఆవిడ పేరూ...ఏదోవుండాలయ్యా ...గుర్తు రావడం లేదు... కామాక్షి,.... నో వనజాక్షి...నో ..పద్మాక్షి...

చారు : ఏమండీ – మిమ్మల్నే....

గోపా : ఏమిటే ...ప్రెస్ కాన్ఫరెన్సులో వుంటే వెనకాల అపోజిషన్ వాడి లాగా వెధవ గొణగుడూ నువ్వూనూ – ఏమిటో చెప్పు....

చారు : ఇళ్ళకోసం ఇహ నేతిరగలేను. మీ యిష్టం...

గోపా : ఓకే. ఇళ్ళకోసం నేనే తిరుగుతా....సరేనా ...నన్నాపకు....నాకావేశం వచ్చింది.

చారు : ఆవేశం వచ్చినప్పుడు అనడం కాదు. అయినా మనకెందుకొచ్చిన గొడవ చెప్పండి ? ఎవడో పెళ్ళాన్ని చంపుకోవడం ఏమిటి ? ఇంకెవడో వచ్చి అడిగితే అంతా చూసినట్లు చెప్పడం ఏమిటి . అయినా చక్రం మామయ్య పెళ్ళాన్ని చంపినట్లుగా ఏమిటి రుజువు ?

గోపా : వాడి మొహం చూస్తే తెలీడంలా – క్రిమనల్ ఫెలో.

జగ : అంటే ఫేస్ రీడింగా ..? అంతేగానీ సాక్షాలు ...ఆధారాలూ...

గోపా : నువ్వేం కంగారు పడక... మన దగ్గర బోల్డంత మెటీరియల్ వుంది. సింగిల్ లైన్ ఆర్డరేసి రెడీగా వుంచా...

జగ : పోనీ ఆ ఫైలు నా మొహాన పడేయ్యండి...వీధిలో కూర్చుని చదువుకుంటా... చారు మీరు గానీ ఈ విషయంలో నోరెత్తారో ....నా శవానికి మారు స్నానం చేయించినంత వొట్టు. నా మీద మీకే మాత్రం ప్రేమ, జాలీ వున్నా నోరు మెదపకండిక

గోపా : చారు....చారు...అది కాదే ...ఓ ఆడపిల్లకి అన్యాయం జరిగినప్పుడు, ఆసంగతి తెలిసినప్పుడు సాటి మనిషిగా ఆ ముద్దాయి గురించి చెప్పాల్సిన బాధ్యత....

చారు : చాల్లే వూరుకోండి. అన్యాయం – ముద్దాయి –బాధ్యత మీకంత ఆవేశంగా వుంటే. ఇంకో అన్యాయం గురించి ఇంకో ముద్దాయి గురించి చెప్పండి, దేశంలో అన్యాయాలకీ ముద్దాయిలకి కొదవేం వుంది గనక ? చక్రం మావయ్యగారి గురించి మాత్రం చెప్పడానికి ససేమిరా వీల్లేదు – దొరక్క దొరక్క ఇన్నాళ్ళకి వంటింట్లో పంపున్న ఇల్లు దొరికింది. ఖాళీ చెయ్యడం నాకిష్టం లేదు. తర్వాత మీ ఇష్టం....

గోపా : అది కాదే ...చారు....

చారు : ఇహనేం చెప్పొద్దు. అయినా మా నాన్నని పిలుస్తానుండండి. నాన్నా....ఓ నాన్నా ....ఓ సారి యిలారా ( లోపల్నుంచి ....' వస్తున్నానమ్మా ' అని రెస్పాన్సు వచ్చింది )

జగ : మీ మామగారు దిగుతున్నారు రంగలోకి – అంటే, తమరు గూడా సెంటిమెంటుకి సరెండరయిపోయి నట్టేనా – నేవేరే వుజ్జోగం వెతుక్కోవాలసిందేనా ?

గోపా : ఇదిగో ప్రెస్సు వాళ్ళు అలా జావకారి పోకూడదు మరి. న్యూస్ లేకపోతే క్రియేట్ చేసుకోవాలి. ... సపోజ్...చక్రం గారికి మూడోసారి పెళ్ళి చేయించాం అనుకో, వాడు గ్యారంటీగా మూణ్ణెల్లు దాటకుండా ఆ పిల్లని చంపేస్తాడు. మళ్ళీ న్యూస్...అప్పుడు పెళ్ళి కూడా కవర్ చేద్దూగాని....

జగ : అంటే ఇప్పుడు వారికి సంబంధం చూడమంటారా ?
( అంతలో లోపల్నుంచి చక్రం పని పూర్తయినట్లుగా చేతులు తుడుచుకుంటూ అక్కడికొస్తూ )

చక్రం : ఏమ్మా ...ఎవర్ని అంత ఆదుర్దాగా పిల్చేవ్....నన్ను కాదు గదా ! ఎవరీ కుర్రాడు – ఎక్కడో చూసినట్లుందే !

గోపా : జెజె నాథం అని...
వీరే ఆ వీర చక్రం ...మన హీరో....

చక్ర : ఆ .....హీరోనా నా బొందా ! అవును ఎవరీ కుర్రాడు

చారు : అదేనండి ....వీడు ...వీడు జగన్నాథం అని నా తమ్ముడు అంటే ఈయనకి బామ్మర్ది...

చక్రం : సరేలే. నీకు తమ్ముడు అతనికి బామ్మర్ది కాక షెడ్డకుడవుతాడా ? ఏం చేస్తుంటావోయ్.

గోపా : కొంప కొంపకీ తిరిగి పూల పేర్లు కాయలపేర్లు చెప్పమని కాళ్ళా వేళ్ళా పడుతుంటాడు.

చక్ర : అదేమిటి, అదేమన్నా హాబీనా .....

సత్య : ఏమిటమ్మా – పిల్చేవ్ – అబ్బాయి టెలిగ్రాం యిచ్చాడా ?

చక్ర : ఇంకా టెలిగ్రాం దేనికి లెండి.... మిమ్మల్ని వెతుక్కుంటూ మీ అబ్బాయిరానే వచ్చాడు.

సత్య : పెద్దోడొచ్చాడా – ఎక్కడా ?

చక్రం : ఇదుగో

జగ : నాన్నా ...ఇక్కడున్నా నాన్నా...అయ్యో...రెండ్రోజులకే యిలా బల్లిలా అయిపోయావేం నాన్నా.....

సత్య : ( గుండెపట్టుకుంటూ ) అమ్మాయ్ ...వీడెవడే ? కొత్త కొడుకు ....ఎవర్రా నువ్వు ....కొంపదీసి నాగరత్నం కొడుకువా ?

చారు : నాగరత్నం ఎవరు నాన్నా ?

చక్ర : అంటే మీరు నా టైపేనన్నమాట.

గోపా : రాసుకో జగన్నాథం – ఇంతకన్నా సెన్సేషనల్ యింకేం వుండదు.

చక్ర : అయితే – యితగాడు మీ అబ్బాయికాడా ?

చారు : అదేనండి...వీడు...అదే నాన్నా ...పోరంకి వెంకటేశ్వర్లు లేదూ...

సత్య : పోయాడుగా ...

చారు : అదే ...పోక ముందు పుట్టినవాడు...అడ్రస్ వెతుక్కుంటూ వచ్చేడు...

సత్య : వెంకటేశ్వర్లు కొడుకా ? ఎంత వాడయ్యావురా ? చిన్నప్పుడు మట్టి, సున్నం తినేవాడు.

గోపా : ఇప్పటికి ఇంకా అవే తింటున్నాడులెండి.

జగ : అయ్యా – వచ్చినందుకు పని జరక్కపోగా, రిలేషన్ అంటగట్టారు. ఇహ పొమ్మంటారా ?

చక్రం : అమ్మాయ్ పంపుకి వాషర్ వేశా. ఇహనేం ట్రబులుండదు... ఇదిగో నీకేం సదుపాయం కావాలన్నా – మొహమాట పడక – అడుగుతూ వుండు చేస్తా ...అన్నట్టు – ఆ తులపిమొక్కలో మాత్రం గుర్తు పెట్టుకుని నీళ్ళు పోస్తుండు – మీ నిమ్మ బ్రతికుండగా, మీరీ పోర్షన్లోకి వచ్చుంటే ఎంత సంతోషించేదో – వస్తానమ్మా ! ( వెళ్ళిపోయాడు )

సత్య : ఇపుడు మీ అమ్మ ఎక్కడుంది రా – నీ పేరేమిటో...

జగ : జగన్నాథమండీ... మా అమ్మ, నాన్న దగ్గరికి వెళ్ళిందండి ...ఈ మధ్యనే....

సత్య : అంటే....మీ అమ్మకూడా ...అరెరె...మహాసాధ్వీరా ...మీ అన్నయ్య ఇంట్లోంచి పది రోజులకోసారి పారిపోతుండేవాడు...

గోపా : ఈ మధ్యన ఫారిన్ పారిపోయేట్ట....మీరెళ్ళి రెస్టు తీసుకోండి – మిష్టర్ నాథం – ఇహ మీరెళ్ళండి.

చారు : మళ్ళీ యీ ఇంటి ఛాయలక్కూడా రావద్దు...

సత్య : అదేవిటమ్మా – వెంకటేశ్వర్లు బాబాయి కొడుకంటే మనకెంతో కావలసిన వాడు ? అలాగేనా మాట్లాడేది. ఈ కాలం పిల్లలకి తనామనా లేకుండా పోయింది. నువ్వేం అనుకోకుండా..... అబ్బాయ్ నీ పేరేమిటో ...వీలున్నప్పుడల్లా వచ్చి పోతుండు అమ్మాయ్...మళ్ళీ గుండెలో కాస్త...

చారు : బరువుగా  వుందా నాన్నా.

గోపా : మామగారూ ...తమాయించుకోండి...దగ్గర్లో అయిస్ కూడా దొరకదు...గాలి గట్టిగా పీల్చి, వాయిదాల పద్ధతిలో వొదలండి.

జగ : అయ్యా...సెంటిమెంటుతో దెబ్బ కొట్టేరు...అయినా ఫర్వాలేదు. వస్తా పెదనాన్నా – ఆరోగ్యం జాగ్రత్త – నే మళ్ళా వస్తాలే....నేనంత  తేలిగ్గావొదలను – ఆశావాదిని  – మళ్ళా వస్తా ( ఎగ్జిట్ )

సత్య : అంత తేలిగ్గా వదల్ను – ఆశావాదిని  –ఏమిటా పిచ్చి కూతలు  సంధి మాటలున్నూ – అంతా వాడి మేనమామ పోలికలొచ్చినట్టున్నాయి వెధవకి..

చారు : పోనీలే....నువ్వు లోపలికి పద.... ఏమండీ .అమ్మకి టెలిగ్రాం

గోపా : ఆ గుర్తుంది...వెడుతున్నా ....( చారు తండ్రిని తీసుకొని లోపలికి వెళ్ళినట్లే వెళ్ళి మళ్ళీ రివ్వున తిరిగొచ్చింది )

గోపా : వచ్చేవా చారూ...మంచి ఛాన్సు  మిస్ చేయించావ్...చక్రంగాడి విశ్వరూపం  ఫ్రంట్ పేజీలో  వేయించేవాడ్ని.

చారు : సర్లెండి...ఏదయినా  కాస్త పనికొచ్చేపన్లు చెయ్యండి. వాళ్ళ ఫోటోలు, వీళ్ళ ఫోటోలు పేపర్లో వేయిస్తే మనకి వొరిగేదేవిటి ?

గోపా : ఒసే....చారూ...ఇంతపిచ్చిదానివి, పిరికిదానివిగా ఎలా బతకుతావే.
నీ గురించే నా  దిగులంతా....

చారు : ఛ...నా గురించి దిగులు పడకండి. కాస్త మా నాన్న గురించి దిగులు పడండి...

చక్ర : ఇదిగో...గోపాల్రావ్ ...గోపాల్రావ్...

గోపా : తులసి మొక్కలో నీళ్ళు పోస్తాం..పదే పదే  ఆ విషయం మీద ఎంట్రీలివ్వకండి..

చక్ర : ఎంట్రీలు కాదు – నా బొందా కాదు – టైగర్ సీతారాం తెలుసా

చారు : అంటే సర్కస్ కంపెనీలో  పెద్ద పులిని ఆడించేవాడా ?

చక్ర : కాదమ్మా ....మన వీధి రౌడీ ..అదేనయ్యా  పది రోజుల క్రితం  ఆ కిళ్ళీ కొట్టు దగ్గర ఓ సిల్కులాల్చీవాడ్ని  పట్టపగలు పొడిచి చంపేడు.

చారు : అమ్మో ...వాడా! మొన్న ఫుల్‌గా తాగొచ్చి ఏదయినా  పచ్చడుంటే పెట్టమన్నాడు.

గోపా : పెట్టేవా ?

చారు : నాకు భయమేసి తలుపులు మూసేసి లోపలికొచ్చేసా

చక్ర : అదేదో వాడు మనసులో పెట్టుకున్నాడల్లే వుంది. మన ఇంటి ముందు నిలబడి దీర్ఘంగా ఏమిటో ఆలోచిస్తున్నాడు.

గోపా : పచ్చడి అడుగుదామా, కూర అడుగుదామా అసలు అదీ యిదీ కాక భోజనమే చేద్దామా అని తేలక ఆలోచనల్లో పడుంటాడు.

చక్ర : అది కాదు. ఏం చెప్పినా ఈకలు పీకుతావ్...వాడి వాలకం చూస్తుంటేకొంపలోకి జొరబడేటట్టే వున్నాడయ్యా... అడుగో ...ఇష్ష్...వచ్చేడు...రానేవచ్చాడు.

( టైగర్ సీతారాం చాలా ప్రశాంతంగా వచ్చేడు. మొహాన విభూదిరేకలు, బొట్టూ కనిపిస్తున్నాయి. సనాతన, సాంప్రదాయ వాదిలా దస్తులు ధరించేడు. ఇల్లంతా కలయచూశాడు. అక్కడున్న ముగ్గురూ భయంతో చూపులు మార్చుకుంటు గుటకలు మింగుతున్నాడు. సీతారాం వెళ్ళి గోడకున్న దేవుడి ఫోటోకి భక్తిగా నమస్కరించేడు... జేబులోంచి చిన్న పొట్లం తీసి, అందర్నీ పరీక్షగా చూసి, మొదటగా చారుమతి దగ్గరకొచ్చి )

సీతా : ప్రసాదం తీసుకో అమ్మా...కళ్ళకద్దుకుని నోట్లో వేసుకో

చక్ర : అది ప్రసాదం కాదు...పాయిజనయి వుంటుంది...తినకమ్మా...మొన్న పచ్చడి పెట్టలేదని.

సీతా : జమాగేలగాపు కిసారిస్....

గోపా : అదేం భాష ...ఎప్పుడూ విన్నట్లుగా లేదే

సీతా : సమయం వచ్చినప్పుడు చెప్తా పాయిజనా ? మర్డర్లలో పాయిజన్ వాడను. చేతిలో కత్తి, గుండెలో ధైర్యం వుండగా నాకేం ఖర్మరా పిరికివాడిలాగా పాయిజన్ తినిపించడం అసలు నేనెవరో తెలుసా

గోపా : టైగర్ సీతారాం కదూ...

చక్ర : మొన్న మీరు ఆ కిళ్ళీ కొట్టు దగ్గర ...హిహిహి... సిల్కు లాల్చీ వాడ్ని ...హిహిహి...

సీతా : ఓ అదా ! శివోహం ...అవన్నీ దీక్షలో వుండగా గుర్తుచేయకండి... జనరల్‌గా పని పూర్తయ్యాక మర్చిపోతానంతే...

గోపా : అంటే ...ఇంతకీ మీరు ఇలా దయచేసింది ప్రసాదం పంపిణీకా ?

చక్ర : అంతే అయ్యుంటుంది.. ఎంత మర్డర్లు చేసుకు బతికే వాడయినా దైవ భక్తి, పాపభీతి వుంటాయ్...నీకేం తెలుసు....

గోపా : నాకెలా తెలుస్తుంది... నేనెప్పుడన్నా మర్డర్ చేస్తేగా...

సీతా : ఇమాలే - పుంజాలే - లటాఫట్.

మర్డర్ మర్డర్ ...మర్డర్...ఛీ ఛీ...మర్యాదస్తులని మొట్టమొదటిగా మీ ఇంటికొస్తే మర్డర్ గురించి తప్ప వేరే విషయం గురించి మాట్లాడరేం.

చారు : వాళ్ళిద్దరూ ఎప్పుడూ అందేనండి...అవునూ మీరేదో అర్థం కాని పదాలు వాడుతున్నారు... ఏమిటవి ?

సీతా : సమయం వచ్చినప్పుడు చెప్తాగాని... అంతా ప్రసాదం తీసుకున్నారా ?

చారు : ఇంకా చక్రం మావయ్యగారు తీసుకోలేదండి.

చక్ర : మీ ఆయనే తీసుకోలి ?

సీతా : ఇంద, ఇద్దరూ చెరో సగం నోట్లో వేసుకోండి...నీ పేరేమిటన్నావ్ ?

గోపా : గోపాల్రావండి...అది నా పెళ్ళాం ..పేరు చారుమతి - ఈయన ఈ యింటి ఓనరు చక్రం గారు.

సీతా : ఏదో గొట్టంగాడు - అవన్నీ వొదిలెయ్యి నీ జీతమెంత ?

గోపా : ఎంతండీ ముష్టి రెండు వేలు - అంటే...

సీతా : శివశివ శంకర శంభో శంకర ...వూ...రెండువేలు ఇంటూ పది బై నాలుగ ప్లస్ వంద మైనస్ రెండొందల యాభయ్యా...వూ...ఐతే ...ఓ వంద యివ్వు చాలు

గోపా : ఎవర్ని ? నన్నా ? వీరినా ?

చక్రం : నిన్నే ...ఇచ్చేయ్.. చాలా రీజనబుల్‌గా అడిగారే....

గోపా : హండ్రెడ్ రూపీసా ? కత్తులు, తుపాకులు కొనుక్కోవడానికి చందానా ?

చారు : మధ్య తరగతి వాళ్ళం. వున్నట్టుండి వందలు, వేలు ఇమ్మంటే ఎక్కడ్నుంచి తేగలం చెప్పండి.

చక్రం : తేవాలమ్మా...సీతారాం గారి లాంటి మనిషి రాక రాక మని ఇంటికొచ్చి అడక్కడక్క అడిగినప్పుడు యివ్వకపోతే ఎలా ? ఇదిగో గోపాల్రావ్ మన ఇబ్బందులు మనకెప్పుడూ వుండేవే .... ఇహనేం ఆలోచించక త్వరగా యిచ్చి పంపించెయ్యి.

గోపా : అంటే తప్పదంటారు...

చక్ర : ఇనకంటాక్సు నుంచైనా తప్పించుకోవచ్చు, కానీ ఇది మాత్రం తప్పదు వూ...

గోపా : సరే కానీండి... మీరింతగా చెప్తోంటే కాదనడం భావ్యం కాదు... అయితే ఓ వంద ఇవ్వండి...ఫస్టుకి అద్దెతోపాటు కలిపియిస్తా...

చక్ర : నేనివ్వాలా ...సరేలే ...నా దగ్గరెక్కడున్నాయ్...డబ్బుల్లేక రెండ్రోజుల్నుంచీ వీధి మొహమే చూడ్లేదు వస్తానోయ్

సీతా : కమర్షియా లొటాడే – ఛటాఫట్ ఆగు – నీ పేరేంట్రా.

చక్ర : చక్రధర రావని.

సీతా : ఒరేయ్ పవ్వు ఇలారా నీకెంతరా జీతం ?

చక్ర : జీతమా...అసలు వుద్యోగమే లేందే ?

గోపా : కాని, ఈ ఇల్లు వారిదేనండి చెడమ్ముకున్నా నాలుగు లకారాలకి తక్కువరాదు. ఇంకా పొలం వుంది. పైగా పెళ్ళాం లేదు. ....అవునూ – పోయిన వాళ్ళ జ్ఞాపకార్థం కప్పులు, ట్రోఫీలు ఇచ్చినట్లు, మీ నిమ్ము పేర్న ఓ కత్తో, తుపాకో , సీతారం గారికి డొనేట్ చెయ్యకూడదా.

చారు : ఇదిగో – మిమ్మల్నే ఏవిటా హాస్యాలు మావయ్యగారితో.....

చక్ర : చూడమ్మా... – ఈ మధ్యన మరీ అలుసయిపోయింది. ఎంత మాట పడితే అంత మాట ఆగకుండా అనేస్తున్నాడు – కాస్త మంచీ, మర్యాద వుండొద్దూ – కనీసం వయసునన్నా గౌరవించుకోవడం నేర్చుకో....ఆ ...? ( వెళ్ళిపోబోతుండగా )

సీతా : ఆగరా పెద్దోడా ? నీ కుళ్ళుడోలు... సింద్రిల్లా ..జితూంగీ... మరి నా పైకం మాటేం చేశావ్.

చక్ర : ఏ పైకం ? ఓ వందగురించా ? మీరడిగింది అతడ్ని ...నన్ను కాదు – పాపం మర్చిపోయుంటాడు.

సీతా : అడిగింది ఆడినయినా, ఎవళ్ళయినా ఇవ్వొచ్చు. దోషం లేదు...మీ అందర్నీ ఓ ఫ్యామిలీ కిందే లెక్కేసా....

గోపా : మరింకేం తొరగా...లక్షలా...వేలా...ముష్టి వందేగా...

సీతా : ఇదిగో ముష్టి గిష్టి అనక...నాకు మంటెత్తి పోతుంది... డిమార్ జమారం...నమాత్రే...ఆ ....టైగర్ సీతారాం ఇల్లుపట్టి అడుక్కుతినే ఖర్మేం పట్టలేదు ఇహ పట్టదు గూడా – మీ యిద్దర్లో నేనడిగిన ఆ వంద ఎవరిస్తారో తేల్చుకోండి....త్వరగా ...మళ్ళీ అవతల నాకు చాలా పన్లున్నాయ్.

చక్రం : మర్డరా...

చారు : దొమ్మి ఏమో....లేక

గోపా : రేపా ?

చక్ర : కాదు ఇవాళే అయ్యుంటుంది

సీతా :వచ్చిందగ్గర్నుంచి చూస్తున్నా ,హత్యలు, మాన బంగాలు తప్ప వేరే మాటేరాదు నోట్లోంచి...చూడపోతే మళ్ళీ పెద్ద మనుషులు...

సరాసరి వెళ్ళి ఆవుకి అరటి పళ్ళు పెట్టుకోవాలి... ముసలీ ముదక వాళ్ళని రోడ్డు దాటించాలి...తర్వాత గుడ్డికుంటివాళ్ళకి ధాన ధర్మాలు చేసుకోవాలి. తర్వాత ఇంటికెళ్ళి స్వంతంగా కూడోండుకు తినాలి. అదీ కార్యక్రమం. అంతేగాని....మర్డర్స్ ...శివ శివ.

గోపా : ఇంతమంచి కార్యక్రమాలు మీ స్వతం డబ్బుతో చేసుకుంటే మంచిది గానీ, మా సొమ్ముతో చేస్తారా....పుణ్యం మాత్రం మీకా ? ఇదేవన్నా సబబుగా వుందా ?

చారు : ఆవుకి అరటిపళ్ళు వొక్క రోజు పెడితే పుణ్యం వచ్చి పడిపోతుందేవిటి. రోజూ వుండాలి గాని...

సీతా : ఈ రోజు నుంచి ఒక నలబై రోజులు ఇదే ప్రోగ్రాం ...అర్ధవైందా ?

గోపా : అంటే రోజూ ఓ వంద చొప్పున మేమే ఇవ్వాలా .

సీతా : అక్కర్లేదు...రోజుకో ఇంటి వాళ్ళివ్వాలి.లిస్టు తయరు చేసి పెట్టాగా...మొదటి రోజు అంటే యివ్వాళ మీరు చూసుకోవాలి.

చక్ర : ఇదంతా వింటుంటే సీతారాంగారేదో దీక్షలో వున్నారేమోనని డౌటుగా వుంది ...

సీతా : డౌటు అక్కర్లేదు... నిజంగానే దీక్షలో వున్నా ...నలబై రోజుల పాటు హత్యలు, మానభంగాలు, దొమ్మీలు , దోపిడీలు అన్నీ మానేసి, పుణ్య కార్యాలు చేస్తూ వుంటే బాగా కలిసొచ్చి మంత్రినయి పోతానని కోయదొర చెప్పేను..ఇవాళ్ళి నుండి మొదలుపెట్టా...

గోపా : అంటే నలబై రోజులు ఎవరిమీద చెయ్యి చేసుకోరన్నమాట.

సీతా : లేదు – కేవలం చిరువ్వుతో కాలం గడిపేస్తా. ఒక వేళ ఎవరన్నా కోపం తెప్పించినా, ఆ కోపం కంట్రోలయ్యేదాకా అర్ధం పర్ధం లేని నాలుగు మాటలనేసుకుని తర్వాత విషయంలో కొస్తానన్నమాట.

చారు : అదా... ఇందాకేదో కొండబాష మాట్లాడేరు.

చక్ర : చెయ్యి చేసుకోవడమమే కాకుండా కత్తి. కఱ్ఱ, మొదలైన ఆయుధాలు ధరించరా...

సీతా : జంబార్...హాట్టియో – చికిలీమీల్ – జమేలీ మ్యాప్

చారు : కోపం వచ్చినట్టుంది.

సీతా : కోపంరాదు మరీ – దీక్ష దిగేదాకా నన్నురెచ్చగొట్టకండి.

గోపా : అదండీ – సంగతి – ఇవ్వాళ్టినుంచి ఓ నలబై రోజుల పాటు చెయ్యి వాడరు – కత్తి కఱ్ఱలాంటి ఆయుధాలు దరించరు, హత్యలు, మానభంగాలు లాంటి కార్యక్రమాలకీ దూరంగా వుంటూ ఆవులకి పళ్ళు పెట్టుకుంటూ కాలక్షేపం చేస్తారు.

చారు : అయితే ఇంకెందుకండీ ఆలోచన.బయటకు నెట్టండి వెధవని...

సీతా : ఆ....

గోపా : ఆ అంటూ నోరు తెరవకురా ...వంద కావాలేరా వంద ...ఇక్కడేవన్నా నీ పిత్రార్జితం దాచేసుకున్నావా ? లేక ప్రింటింగ్ ప్రెస్సు పెట్టాననుకున్నావా !

చక్ర : దేవుడు శరీరం ఇచ్చేడు ...హాయిగా కష్టపడి బతకొచ్చుగా....ప్రతి సన్నాసిని బెదిరించి దర్జాగా బతకడం అలవాటయిపోయింది. వెళ్ళు వెళ్ళు ఇంకో ఇల్లు చూసుకో అమ్మాయ్ ఆ తులసి –చెట్లో గుర్తు పెట్టుకుని, నీళ్ళు పోస్తుండమ్మా వస్తా...

గోపా : ఏమేవ్ – వెళ్ళి నీళ్లు తోడు – ఆఫీసుకు టైం అవుతోంది.

సీతా : ఆగండాగండి ( జేబులోంచికీ తీసి ) ఇదెలా వుంది ?

చక్ర : కత్తా ? కన్నుల పండగ్గా వుంది  కాని, నలభై  రోజులు దాన్ని ముట్టనని.

సీతా : అన్నాకదూ...కాని మనసు  మార్చుకున్నా దీక్ష రేపట్నించి  ప్రారంభిద్దామని ...

గోపా : అంటే ఆగిపోయిన కార్యక్రమాలన్నీ ....

సీతా : పేరు పేరు  వరసనా జరిగిపోగలవ్ ...ఆవుకి అరటిపళ్ళు  పెట్టుకొని పది నిముషాల్లో  వస్తా... వంద ఎవరిస్తారో  తేల్చుకోండి...వంద యిచ్చావా... దీక్ష యివాళ్టినుంచి లెక్క  లేదా రేపట్నుంచీ, జోమీతీ, ..మయ్యస్యీవీ...గోమాలియా ....ఆ ( వెళ్ళిపాయాడు )

చక్ర : ఏమిటయ్యా అంటాడు ? అంటే  ఇంకా దీక్ష దిగనట్లే లెక్కా ?

చారు : ఏమండీ ! త్వరగా వెళ్ళిపోలీసులకి  చెప్పొస్తేనో  ...వెధవని  రెక్కలు విరిచి మరీ పట్టుకుపోతారు.

గోపా : అయిదు నిముషాల్లో వెనక్కొచ్చి వొళ్ళు వాయగొడతాడు.

చక్ర : అవునమ్మా  – వీళ్ళకి వాళ్ళకి  బాగా లాలూచీలుంటాయిట. అయినా  వాడితో గొడవెందుకు ? రాగానే ఓ వంద యిచ్చి పంపించేయ్...పెద్ద వాడ్ని  ఎందుకు చెప్తున్నానో ,...విను...

గోపా : సరే కానీండి... అయితే అతను రాగానే మీ యింటికి పంపిస్తా...

చక్ర : మా యింటికెందుకయ్యా...వాడడిగింది నిన్ను...

చారు : మనదంతా ఒకే ఫ్యామిలీ అని అన్నాడు గదా ! పెద్దవారు మీ చేతలు మీదగానే ఇవ్వండి.

చక్ర : నా పెద్దరికం  పెంటకుప్పలో  పడ్డట్టేవుంది. నా దగ్గర చిల్లిగవ్వ లేదయ్యా  గోపాల్రావ్ ...వొట్టు ( అంతలో  సత్యానందం లోపల్నుంచి  అక్కడికొస్తూ )

సత్యా : ఏమిట్రా ..అంతా గొడవ పడుతున్నారు ? ఏ విషయం  గురించి .

గోపా : సీతారం  అని ఓ పెద్ద రౌడీ డబ్బులడిగి  పది నిముషాల్లోగా సర్దకపోతే, అందర్నీ వరుసగా  మరర్ చేసి పారేస్తానని  బెదిరించి  వెళ్ళిపోయేడు .

సత్యా : ఏమిటి ? చంపేస్తాడా ? అందర్నీనా...హమ్మో...ఆ

చారు : అంతా వొట్టిదే నానా...ఆయనలాగే అంటరు...ఆ టైగర్ గాడేదో ఏదో దీక్షలో చచ్చాట్ట... రోజుకో ఇంటి వాళ్ళు వంద రూపాయలు ఇవ్వాలి ఇవ్వనంటే సరద్దాగా హత్యో, మానభంగమో చేసుకుంటానన్నారు అంతే...

సత్యా : అంతేనా ...ఏమిటో అని కంగారుపడ్డా...

చక్ర : గోపాల్రావ్...మీ మామగార్ని టచ్ చేసి చూడు...

గోపా : ( సత్యానందాన్ని తాకి ) మామూలుగానే వున్నారు షాకేం కొట్టడంలేదు..

చక్ర : నీ హాస్యాలు బంగారం గానూ ... నే చెప్పేది క్యాష్ గురించి.

గోపా : ఓ అదా మీరనేది చారూ...మీ ఫాదర్ని...

సత్యా : ఏమిటది .

చారు : ఏం లేదు నాన్నా...నీ దగ్గర ఓ వంద కాగితం వుంటే యిస్తారేమో, మళ్ళీ వెళ్ళేటప్పుడు ఇచ్చేద్దామని ...

సత్యా : సరేలే ... నా దగ్గరెక్కడున్నాయ్...డబ్బులేక టిక్కెటు కూడా కొనకుండా టాయిలెట్లో నిబలడి ట్రావెల్ చేసొచ్చా వెళ్ళడానికి ఛార్జీల గురించే వర్రీ అయిపోతుంటేను. అన్నట్టు అల్లుడూ టెలిగ్రాం యిచ్చావా – అత్తయ్యగారికి....

గోపా : అయిడియా బాగానే వుందండి – కానీ వంద పంపించేసరికి ఆలస్యమౌతుందేమోనని..

సత్యా : వంద గురించి కాదయ్యా ! నే సేఫ్‌గా చేరేనని...

చారు : ఏమండీ ...ఇప్పుడేం చేద్దామో ఆలోచించండి వాడు మళ్ళీ వస్తాడేమో ?

చక్ర : వస్తాడమే ఏమిటి వచ్చి తీరతాడు..ఆవుకి అరటిపళ్ళు పెట్టడం ఎంతపని అవీ ఆవురావురంటూ వుంటాయేమో ఐదు నిముషాల్లో లాగేయ్యవూ!

చారు : ఏమండీ ...పోనీ....మేం రేపిస్తాం...ఇవ్వాల్టికి పక్కింటికి వెళ్ళమంటేనో....

చక్ర : ఆలోచన అద్భుతంగా వుంది కానీ వెళ్ళి ఛస్తాడాని...

సత్యా : ఆ ! వెళ్ళక ఛస్తాడా ! వాడిక్కావలసింది డబ్బు ఎవరిస్తేనేం.

చారు : పోనీ...ఈలోపు మీరెళ్ళి స్నానం అదీ కానివ్వండి ..అంతగా కాదు కూడదంటే వెంటబెట్టుకుని ఆఫీసుకన్నా తీసుకెళ్ళొచ్చు....

గోపా : అదీ నిజమే, అయితే నే వెళ్ళి చేసొస్తా...పద ..నీళ్ళు తోడు...

( గోపాల్రావ్, చారుమతి లోపలికెళ్ళారు )

చక్ర : ఛ..ఛ..ఏమన్నా చెప్పండి ...దేశం తగలడిపోయింది. కత్తి చూపించి దోచుకునే వాళ్ళోకపక్క ...లంచం లంచం అంటా పీల్చి పారేసే పీత వెధవలోపక్కా ...కష్టపడి బతకడం ఇష్టం లేక...వెధవల్ని నిలువున్నా కాల్చి పారెయ్యాలి...

సత్య : కత్తి చూపించి దోచుకునే వార్ని అన్నావ్... కరెక్టు నిజంగా కాల్చి పారెయ్యాల్సిందే కానీ లంచం తీసుకునే వాళ్ళంటావ్ ...పాపం వాళ్ళేం చేస్తారయ్యా....అవసరం కొద్దీ వాళ్ళూ వీళ్ళు వచ్చి, యిచ్చిపోతుంటే. అయినా మీకు తెలీదులే ...ఇప్పుడు లంచం అంటే అర్ధం ..నాన్ టాక్సబుల్ అడిషనల్ పే అండ్ అలెవెన్సెస్ అన్నమాట...అయినా లంచం అనే పద్ధతి ఉంది. కాబట్టే పన్లు చకచకా జరిగిపోతున్నాయి. అదే లేకపోతే పన్లు మానేసి ఆఫీసుల్లో మంచాలేసుకుపడుకో !

( అంతలో చిరంజీవి లోపలికొచ్చి వాళ్ళిద్దర్నీ చూసి సందేహంగా జేబులోంచి కాగితం తీసి, చదివి, చకచకా వెళ్ళి చక్రం కాళ్ళపైబడి )

చిర : రక్షించండి బాబూ...మా అయ్య చావు బ్రతకుల్లో వున్నాడు...మీరు ఆడిని బతికించాలి..నాకు ఉద్యోగం వద్దు... నా డబ్బు యిప్పించేయండి...

చక్ర : ఎవరయ్యా నువు .

సత్య : లంచం తీసుకొని కూడా పన్చెయ్యని వాళ్ళని కాల్చడం కాదు – నిలువునా పాతెయ్యాలి ఏమంటావ్ !

చక్ర : చెప్తా – ఎవడ్రా నువ్వు.

చిరం : నా పేరు చిరంజీవి. బంగారప్ప కొడుకుని. నా వుద్యోగం కోసం తమరికి ఐదువేలు యిచ్చారంట. దయచేసి వాపస్ ఇచ్చేయండి... అయ్యకి వైద్యం చేయించుకోవాలి.

సత్య : కుర్రాడికి పితృభక్తి ఘనంగా వుంది – పాపం యిచ్చెయ్ – వేరే కేసే చూసుకుందూ గానీ...

చక్ర : ఛ...ఛ...నాకేం తెలీదు. రేయ్....ఎవరు కావాల్రా నీకు – నా పేరు చక్రధర్రావ్...

చిరం : చక్రధర్రావ్ ....అయితే వారన్నమాట...గోపాల్రావు గారంటే...

( అంటూ సత్యానందం కాళ్ళమీద పడి... )

దయుంచండి బాబు ...పేదోళ్ళం మా అయ్యంటే నాకు ప్రేణవండీ...ఆడులేందే నే బతకలేనండీ... నాకు వుజ్జోగం వద్దు. నా ఐదువేలు నాకిచ్చి పుణ్యం కట్టుకోండి బాబూ మీ ఆఫీసరు గారు కాగితం కూడా రాసిచ్చి, మిమ్మల్ని కలవమన్నారు.

( చక్రధర్రావ్ అతని జేబులోని కాగితాన్ని తీసుకుని పైకి చదివేడు )

చక్రం : డియర్ గోపాల్రావ్ ! వీడ్ని నీదగ్గరకు పంపిస్తున్నాను. తిరిగి నా దగ్గరకి రాకుండా మేనేజ్ చెయ్యి తర్వాత మాట్లాడుకుందాం – బలరామ్మూర్తి... ఎవరీ బలరామ్మూర్తీ...

సత్యా : మా అల్లుడికి ఆఫీసర్ వెధవయి వుంటాడు.

చక్ర : ఇంతకీ మీ అయ్య డబ్బు ఎవరికిచ్చేట్ట.

చిర : ఆఫీసరు గారు ఐదు వేలు అడుగుతున్నారని, గోపాల్రావ్గారే తీసుకున్నారట పైగా పది రోజుల్లో ఆర్డర్సు వస్తాయని గూడా చెప్పేరట. కానీ, రెండు నెలలయిపోయింది. ఇంతట్లో అయ్యకి ఆరోగ్యం పాడయిపోయింది. ఆపరేషన్ చేయాలంట. నాకుద్యోగం వద్దు డబ్బులిప్పించెయ్యండి.

చక్ర : అదీ సంగతి మీ అల్లుడు, వీళ్ళఫాదర్ దగ్గరా ఆఫీసర్ అడుగుతున్నాడని ఐదు వేలు పుచ్చుకున్నాడు. వుజ్జోగం గ్యారంటీ అని ప్రామిస్ చేశాడు.

సత్యా : అదే, ఆఫీసర్కి పాస్ ఆన్ చేసుంటారు.

చక్ర : మరయితే, అదే ఆఫీసర్ ఇతగాడ్ని ఇక్కడికెందుకు పాస్ ఆన్ చేసినట్లు .

చిర : ఐతే గోపాల్రావ్ గారంటే – మీరూ కాదా !

చక్ర : కాదురా అబ్బీ – ఆయన ఆ గోపాల్రావ్ గారికి పిల్లనిచ్చిన మామగారు నీక్కావలసిని ఆ గోపాల్రావ్ లోపల స్నానం చేస్తున్నాడు. వస్తాడు అవునూ – ఆఫీసరు బలరామ్మూర్తి ఏమన్నాడు ?

చిర : నే చెప్పిందంతా విని, నువ్వెరో నాకు తెలీదు. నీ అయ్య ఎవరో నాకు తెలీదు. అంటూ ఈ చీటీ రాసిచ్చి, వెళ్ళి గోపాల్రావ్ గార్ని కలవమన్నారండీ. అందకు నే యిలా వచ్చేసా. కాస్త వారిని తొందరగా పిలవండి... బస్సుకి వేళయిపోతోంది.

సత్యా : పాపం... వొట్టి అమాయకుడిలా వున్నాడు...లంచం పెట్టిన సొమ్ము, మంచానికి పెట్టిన సొమ్ము వెనక్కొస్తాయా ?

చిర : కాస్త తొరగా పిలవండి ...మీకు పుణ్యం వుంటుంది.

సత్యా : అల్లుడూ ...నాయనా గోపాల్రావ్...ఎవరో వచ్చేరు చూడు...

( లోపల్నుంచి గోపాల్రావ్ రెస్పాన్సు వినిపించింది – కానీ చారుమతి ప్రవేశించింది)

చారు : ఏం నాన్నా...పిల్చారు...ఎవరీ కుర్రాడు...

చక్ర : గోపాల్రావ్ వైఫోయ్, ఇతడు చిరంజీవని ....

చిరం : మా అయ్య గోపాల్రావ్ గారికి 5 వేలు యిచ్చేరండి. ఆఫీసరు గారు కూడా కాగితం రాసిచ్చేరు. తొరగా డబ్బు లిమ్మని చెప్పండమ్మా నే మళ్ళీ మావూరెళ్ళిపోవాలి.

చారు : 5 వేలేమిటి ? ఆఫీసరు గారు కాగితం రాసివ్వడమేమిటి .

సత్యా : అదేనమ్మా ఆఫీసరు గారు వుద్యోగం యివ్వడానికి ఐదువేలు లంచం అడిగితేనూ ఇతగాడి తండ్రి ఆ డబ్బు ఆఫీసరు గారికి ఇమ్మని గోపాల్రావ్ కిచ్చేట్ట అదీ సంగతి.

చక్ర : వుద్యోగం వద్దు – ఆ డబ్బు యిచ్చెయ్యమంటాడు – అంతే

చారు : తీసుకున్నది ఆఫీసరయితే, ఈయనెందుకివ్వాలి.

సత్యా : అల్లుడికి అనుభవం తక్కువ. ఇలాంటి విషయాల్లో మిడిల్‌మాన్‌గా ఛస్తే వుండకూడదు.

చక్ర : ఆఫీసరు గారు చీటి రాసి పంపించేరు. కేసు సెటిల్ చేయమని...

సత్యా : అల్లుడ్ని పిలువమ్మా, అసలేం జరిగిందో మనకేం తెలుస్తుంది,

చారు : ఏం చదివావురా అబ్బీ...

చిరం : బి.ఏ.నండి టైప్ గూడా పాసయ్యేనండి.

సత్యా : మీ అయ్యకేం జబ్బురా...

చిరం : తెలీదండి. నెత్తురు కక్కుకుంటే డాక్టర్ దగ్గరకి తీసుకెడితే, ఆపరేషన్ చెయ్యాలి, ఐదు వేలు అవుతుంది అన్నారండి.

చక్ర : ఏమిటో పాపం. ఈ లేని వెధవల్ని చూస్తే అదేమిటో అప్పుడప్పుడూ జాలేస్తుంటుంది.

( అంతలో గోపాల్రావ్ అనుమానపు చూపులతో అక్కడికొస్తూ )

గోపా : ఏం కావాలయ్యా ! అసలైనా ఎవర్నువ్వు...

చక్ర : ఇతడే నువ్వడిగిన గోపాల్రావ్ – ఇతని పేరు చిరంజీవిట.

గోపా : మీరుండండి .. ఏంపని మీదొచ్చేవ్...ఎవరు పంపేరు

చిరం : బలరామ్మూర్తి గారు ఈ చీటి మీకు చూపించి, డబ్బు తీసుకోమన్నారండి

( గోపాల్రావ్ కాగితం చదువుతుండగా )

చిరం : నే బంగారప్ప కొడుకునండి...నా పేరు చిరంజీవి

గోపా : సరే నువ్వెళ్ళి ఆఫీసు దగ్గరుండు ...నే వచ్చి మాట్లాడతా ....

చిరం : ఆఫీసరు గారు రావొద్దన్నారండీ. తొరగా డబ్బులు ఇప్పించేస్తే మీకు పుణ్యం వుంటుంది.

గోపా : జరిగిన విషయాలన్నీ నీకు తెలీవు. అంచేత వెళ్ళి అక్కడుంటే నే వచ్చి మాట్లాడతాగా వెళ్ళూ....

చిర : వుహూ... వెళ్ళనండి డబ్బు తీసుకుని గాని యిక్కడ్నుంచి కదలనండి చావు బతకుల్లో వున్న మా అయ్యని రక్షించుకోవాల.

చక్ర : గోపాల్రావ్...పాపం చాలా వర్రీగా వున్నట్టున్నాడు...కాదనకు..

సత్యా : ఇదుగో అల్లుడూ నువ్వింత అమాయకుడివని నేననుకోలేదయ్యా...ఇంత తెలివి తక్కువగానా చేతులు తడుపుకునేది...

చారు : ఐనా మధ్యలో మీకెందుకు చెప్పండీ...ఆ డబ్బేదో సరాసరి ఆ ఆఫీసరు వెధవకి ఇమ్మంటే పోయేదిగా ?

సత్యా : అమ్మడూ – ఇవన్నీ నీ కర్దం కావులేమ్మా...ఈ మధ్యన అంతా ఏదో పేరుతో పుచ్చుకుంటూనే వున్నారు. కొంతమంది లంచం అంటే, ఇంకొంతమంది కమీషన్ అని కిక్ బాక్స్ అని, పార్టీ ఫండని, ఏదీకాక పోతే డొనేషన్ అని...రకరకాల పేర్లతో డబ్బు చేతులు మారుతూనేవుంటుంది.

చక్ర : అసలు లంచం యివ్వడం గాని, పుచ్చుకోవడం గాని పెద్ద ఆర్టు. గోపాల్రావ్ గూడా పెద్ద ఆర్టిస్టని యిప్పుడే అర్థమైంది.

గోపా : నాకేం తెలీదు అనవసరంగా మీరంతా వూహాగానాలు చేయకండి...

చక్ర : అంటే ...ఈ విషయంలో  నీకేమీ కిక్ బాక్స్  ముట్టలేదంటావ్. అలా అని మమ్మల్ని నమ్మమంటావ్. అంతేగా ?

చారు : ‘ కిక్‌బాక్స్ ’ ఏమిటి నాన్న ?

గోపా : అంటే ...పోపుల డబ్బాల్లే ...అర్థమైందా ?

సత్యా : అల్లుడూ  అమ్మాయిని అనవసరంగా విసుక్కోక, తెలీని విషయాల్ని వెంటనేఅడిగి తెల్సుకోమని  దానికి చిన్నతనం  నుంచీ నేనే అలవాటు చేశా...అంటే ...అమ్మాయ్...

గోపా : మీరంతా లోపలికి తగలడి  మాట్లాడుకోండి. ఒరేయ్ – నువ్వెళ్ళి  బలరామ్మూర్తి ఇంటి దగ్గరుండు నే వస్తా.

చిరం : నే వెళ్ళనని ఇందాకే  చెప్పాను. నే వెళ్ళనంతే...

( గోపాల్రావ్ నెత్తి కొట్టుకున్నాడు )

చక్ర : అసలు కిక్ బాగ్స్ అంటే ఏమిటి .

సత్యా : నీకూ కిక్‌బాక్స్ అంటే తెలీదా. అమ్మడూ  జాగ్రత్తగా విను. చక్రం మావయ్య చేత మనం ఓ పెద్ద తుఫాకీ  కొనిపించాం అనుకో,.

చక్రం : ఇది మరీ బావుంది, ఈ వయసులో  తుఫాకులు, మర ఫిరంగులతో నాకేం పని?

సత్యా : అబ్బ...అడ్డురాక ...సపోజ్ తుపాకీ కొనిపించాం  అనుకో.....దాని వెల వెయ్యి రూపాయిలు..అప్పుడు కంపెనీ వాళ్ళు తొమ్మిది వందలు వాళ్ళు తీసుకోని, పనికిరాని తుఫాకీని  వీరి చేత కొనిపించినందుకు మనకి వంద రూపాయలు  వెనక్కి తంతారన్నమాట.

చారు : వెనక్కి తన్నడం దేనికి నాన్న. చేతికివ్వొచ్చుగా...

సత్యా : తన్నడం అంటే  గాడిద తన్నులు కాదమ్మా. అదో గౌరవ ప్రదమైన పదం. ఆ వందని  కిక్ బాక్స్ అంటారు – అర్థమైందా.

గోపా : సరే నే వీణ్ణి  ఆఫీసర్ దగ్గరకి  తీసికెళ్ళి మాట్లాడొస్తా పదరా...

చారు : ఏమండీ  ఆ టైగరు  గాడొస్తే .. ఏం చెప్పమంటారు...

చక్ర : నిజమే నయ్యా పోనీ ముందా సీతారాం గాడ్ని సమాధాన పరిచి తర్వాత వెళ్ళకూడదు !

సత్యా : ఇదిగో కుర్రాడా ! పెద్దవాణ్ణి చెప్తున్నా ..మా అల్లుడు అరగంటలో ఆఫీసుకొస్తాడు వెళ్ళి అక్కడుండు...రాకపోతే మళ్ళీ రా...సరేనా...

చిరం : కుదరదండీ అయినా డబ్బులిచ్చి అటు యిటూ తిరిగే ఖర్మ నాకేం పట్టిందండి.

గోపా : ఏమిటి చూస్తున్నకొద్దీ రెచ్చిపోతున్నావ్. అసలు మీ అయ్యనాకు డబ్బులిచ్చినట్టుగా ఏమిటి ఋజువు.

చిరం : మా అయ్యా చదవుకున్నవాడు కాడు కాబట్టి, అబద్ధం ఆడడు. నాకు తెల్సు.

గోపా : ఓహో ...అంత నమ్మకమా ! అయితే వెళ్ళి మీ అయ్యను రమ్మను, నేన్నీతో మాట్లాడను.

చిరం : రాలేడండి...మంచంలో వుండే మనిషి ఎలా వస్తాండి.

చక్ర : రావాలయ్యా .ఇప్పుడు వీర్ని చూడు.... మంచంలో వుండాల్సిన మనిషి మరి ఓపికి చేసుకొని కూతురింటికి రాలేదూ !

చారు : మర్యాదగా బయటకు నడు... లేకపోతే పోలీసుల్ని పిలుస్తాం.

చిరం : పిలవండి...పోలీసుల్నే కాదు. పేపరు వాళ్ళని కూడా పిలవండి... జరగింది మొత్తం చెప్పి మీ అందరి అంతు తేలుస్తా !

చారు : ఏమండీ వాడంత గట్టిగా మాట్లాడుతున్నాడు అంటే నిజంగా ఇచ్చే వుంటాడు. తీసుకొచ్చి యిచ్చెయ్యండి వెధవ డబ్బు....

గోపా : నాకేం తెలీదు మొర్రో అంటుంటే.

సత్య : అంతా అయోమయంగా వుంది. అల్లుడేమో నాకేం తెలీదంటున్నాడు. మరి ఆఫీసరేమో వుత్తరం యిచ్చి మరీ పంపేరు. డబ్బు యిచ్చెయ్యమని .

చక్ర : రిటైర్డు జడ్జీలాంటి తమకే గందరగోళం అనిపిస్తే మాలాంటి పబ్లిక్ లాంటి పామరులు సంగతేమిటి ?

గోపా : ఈ విషయాలన్నీ మీ కనవసరం దయచేసి మీ పోర్షన్లోకి వెడతారా ? ప్లీజ్

చారు : వెళ్ళు వెళ్ళంటే ఇక్కడే వేలాడటానికి మావయ్య గారికేం పరువుమర్యాద, రోషం, వేషం లేని వెధవ ఫేసు అనుకున్నారా...ఒక్క క్షణం కూడా వుండరు.. ఆ !

చక్ర : బాగా చెప్పావ్...ఇక్కడ నాకేంపని... ఏదో నా నిమ్ము గుర్తొస్తే ఇలా వచ్చేనుగానీ అమ్మాయ్,ఆ మొక్క సంగతి గుర్తుంచుకో వస్తా ( ఎగ్జిట్ )

గోపా : ( సత్యానందంతో ) మీరు గూడా వెళ్ళి గుండెకి అమృతాంజనం రాసుకుంటూ రెస్ట్ తీసుకోండి వెళ్ళండి చారూ తీసుకెళ్ళు

సత్యా : ఇదిగో అల్లుడూ ఇలాంటి విషయాల్లో అల్లరి పడకూడదు మనకే నష్టం. జాగ్రత్త సుమా పదమ్మా...

( ఎగ్జిట్ – సత్యానందం )

చారు : నువ్వు పద నాన్న....నే వస్తున్నా..

గోపా : ఇదిగో చూడు మిష్టర్ నీకు వుద్యోగం కావాలని ఇప్పించమని మీ నాన్న ఆ బలరామ్మూర్తిని బతిమాలితే, వాడు అయిదు వేలు కావాలని అడిగారు. మీ నాన్నసరేనని వెళ్ళి డబ్బు తెచ్చి ఆయనకిమ్మనమని నా చేతిలో పెట్టేడు. ఆ రోజే నేను ఆ డబ్బు మొత్తం వాడికి అందచేసేసా... ఇది జరిగిన సత్యం. కాని నాకు చెప్పినట్లు కాక ఆర్డర్స్ రావడం, కాస్త ఆలస్యం అయింది. కాని తప్పక ఉద్యోగం వస్తుంది. కాస్త వోపిక పట్టు.

చిరం : నాకిప్పుడు వుద్యోగం వద్దండీ డబ్బు కావాలి. మా అయ్యకి వెంటనే ఆపరేషన్ చేయించాలి.

గోపా : సరే అయితే నేనూ ఆయనతో మాట్లాడాలి గదా. కాస్త టైం కావాలి మళ్ళీ ఎల్లుండిరా ...

చిరం : రానండి నాకిదే పనా...డబ్బు తీసుగ్గాని ఇక్కడ్నుంచీ కదల్ను...

చారు : ఇష్ మెల్లిగా మాట్లాడు చుట్టుపక్కల వాళ్ళు వింటే పరువు పోతుంది,

గోపా : విననీవే ఏం ఫర్వాలేదు ఏ వెధవ తీసుకోవడం లేదె లంచం ఈ రోజుల్లో...

చారు : అంటే తీసుకున్నారన్నమాట.

చిరం : నా సంగతి త్వరగా చూడండి. పొద్దెక్కి పోతావుంది.

గోపా : చారూ...నాకేం తెలీదు...నే పైసా ఎరగను...ఇది నిజం నిజం వొరే నువ్వెళ్ళి కాస్త ఆ గడపలో నిలబడు...

చిరం : నేనిలబడనండి. డబ్బులు ఇచ్చింది కాక, అడుక్కుతినేవారిలాగా వాకిళ్ళలో నిలబడాలా...నేవెళ్ళను. తొరగా యిచ్చేయ్యండి.

గోపా : రాస్కెల్ మర్యాదగా మెత్తగా చెప్తుంటే మరీ నీ యిష్టం వచ్చినట్లు కూస్తున్నావ్. ఎవడ్రా నువ్వు – బయటికి నడు...

చారు : ఇష్ అరవకండి సావిత్రమ్మ ఎప్పుడూ ఆ గోడ పక్కనే ఛస్తుంది.

గోపా : ఛావనీ... నాకం భయం లేదు...పద బయటికి వెళ్ళి నీకు దిక్కున్న వాడితో చెప్పుకో పో...

చిరం : ఏవండోయ్ మర్యాదగా వుండమని చెప్తున్నా... నా వొంటిపైన చెయ్యి పడిందా...

గోపా : ఏం చేస్తావు ! వుద్యోగం తీయిస్తావా ... వురేయిస్తావా...పద, నడు, బయటికి వూ...గెటవుట్ ( అంటూ అతడ్ని బలంగా బయటికినెట్టేడు. వెంటనే చిరంజీవి గుండె చేత్తో పుచ్చుకుని బాధతో మెలికలు తిరుగుతూ పడిపోయేడు )

చిరం : అమ్మా....నొప్పి.... గుండెల్లో ...ప్రాణం పోతోంది...

గోపా : ఏమైంది...ఎక్కడా నొప్పి నీళ్ళు కావాలా... చారూ త్వరగా వెళ్ళి గ్లాసుడు నీళ్ళు పట్రా

( చారు కంగారుగా లోపలికెళ్ళింది )

చిరం : నీళ్ళు...నీళ్ళు...వొద్దు సార్...డబ్బు...డబ్బు...అయ్యకి ఆపరేషన్ అబ్బా....

గోపా : కాసేపు పడుకుంటావా ! యిలారా...

చిరం : నిన్నటినుంచి తిండి కళ్ళు తిరుగుతూ సార్...అమ్మా ! ఆ...!

( పడిపోయేడు గోపాల్రావ్ ఆదుర్దాగా పడిపోయిన అతడ్ని పరీక్షగా చూసి, అనుమానం వచ్చినట్లుగా గుండె శ్వాస పరీక్ష చేసి...)

గోపా : మైగాడ్. చచ్చిపోయేడు !

( చారు నీళ్ళగ్లాసుతో వచ్చింది )

చారు : ఇదిగోనండి. నీళ్ళు....అదేమిటి అలా పడిపోయేరు. స్పృహ పోయిందా )

గోపా : స్పృహ కాదే.....చారూ ...వాడు .వాడు. పోయినట్లున్నాడే

చారు : ఆ....

( అంతలో చక్రం మళ్ళీ అక్కడికొస్తూ )

చక్ర : నాకసలు బుద్ధి లేదులే. అంతా నా వాళ్ళే అనుకుంటా తులసి మొక్క సంగతి చెప్పటానిక్కాదు వచ్చింది స్క్రూ డ్రైవర్ వంట గదిలో మర్చిపోయిచచ్చా. అదేమిటి – కుర్రాడ్ని అలా పడుకో పెట్టేవ్ తన్నేవా!

చారు : అబ్బే  – తన్నలేదండి. బయటికి వెళ్ళమని అలా నెట్టేసరికి.
గోపా : గుండె చేత్తో పుచ్చుకుని ఇదిగో అలా పడిపోయాడు.
చక్రం : పడిపోవడం అంటే .... కొంపదీసి పోయేడా ?
గోపా : అదే నాకూ  తెలీకుండా వుంది. మీరు చూడండి పెద్ద వాళ్ళు.
చక్ర : అయినా నాకెందుకొచ్చింది. ఇందాకేగా అన్నావ్. ఈ విషయాలన్నీ మీ కనవసరం.అని మనిషికో  మాట గొడ్డుకో దెబ్బ అని... ( పరీక్ష చేసి ) ఇంకా అనుమానం  ఏమిటి ? పోయిచచ్చేడు....
చారు : హమ్మమ్మో ! ఓరి నాయనోయ్.... ఓరి దేవుడోయ్...
సత్యా : ఇక్కడే వున్నానమ్మా...ఏమిటి అంతా ఏదో ...అయ్యో ...ఆ కుర్రాడు  అలా నేలపైన పడుకున్నాడేం ?
చక్ర : ప్రాణాలు పోతే రేపు మనమూ అలాగే పడుకుంటాం.
సత్యా : ప్రాణం పోతే...అంటే ....అంటే...వాడు
చక్ర : చచ్చిపోయేడూ అదే  మీ అల్లుడు చంపేసాడు...
సత్యా : ఆ ....చచ్చిపోవడమే. హమ్మో ...నాకేదో ...అమ్మా...
చారు : చచ్చిపోవడం అంటే  చచ్చిపోవడంకాదు నాన్న, గుండె కాస్తా ఆగిపోయింది అంతే.
సత్యా : ( రిలీఫ్‌గా  ) అంతేనా ...నిజంగా  ఏదో జరిగిపోయిందని కంగారు పడి చచ్చాననుకో !  అవునూ గుండె  మాత్రం వున్నట్టుండి ఎందుకాగిపోతుంది. అతడిపైన చెయ్యి చేసుకున్నావా!
గోపా : అబ్బే వెళ్ళి  ఆఫీసు దగ్గరుండు. నే వస్తానని వూరికే మెల్లిగా ఇలా తోసేనంతే !
చారు : అంతే, గుండె చేత్తో పుచ్చుకుని  ఇదిగో అలా పడిపోయేడు.
చక్రం : జీవితం అంటే నీటి బుడగని అన్నారు కదాని. నీ యిష్టం వచ్చినట్లు చెప్పకమ్మా. నెడితే  ఎక్కడన్నా ప్రాణాలు  పోతాయా. గట్టి దెబ్బ ఏదో తగిలే వుంటుంది.
గోపా : లేదండీ.  అస్సలు నేనేం చెయ్యలేదు. వొట్టు.

చక్రం : చేసిందంతా చేసి, చిన్న వెధవలాగా, ఒట్లు దేనికీ... ఇంట్లో ప్రాణాలు పోయాయి. నక్షత్రాలు మంచిదవునో కాదో. అమ్మాయ్ వెళ్ళి పంచాంగం పట్రా.

సత్యా : నీ పంచాంగం పాడుగానూ, ఏం చెయ్యాలో తెలీక పిల్లలు అల్లాడిపోతుంటే, పంచాంగాలు ముహూర్తాలు అంటూ చంపుకు తింటావ్.

చక్ర : ఆ...అలాగే అంటారు. ఇల్లు నాది ...నక్షత్రం మంచిది కాకపోతే మీకేం వేరే ఇల్లు చూసుకుంటారు. ఇల్లు పాడు పెడితే నష్టపోయేది నేనూ !

చారు : మామయ్యగారూ, మీరేం కంగారు పడకండి. మేమంతా లేమూ. ఇప్పుడేం చెయ్యాలో కాస్త చెప్పండి.

చక్ర : చేసేందుకు ఇంకేముంది – వెళ్ళి పోలీసుల్ని పిల్చుకు రావడం తప్ప.

గోపా : పోలీసులా ?

చక్ర : మరి. హత్య జరిగినప్పుడు పోలీసుల్ని పిలవక, రికార్డింగ్ డాన్సు వాళ్ళని పిలిపిస్తావా ?

సత్యా : నిజమే మరి... ఐనా అల్లుడూ – అంత దూకుడేమిటి. వచ్చి డబ్బులడిగాడే అనుకో. ఏదో సామరస్యంగా సెటిల్ చేసుకోవాలనే గాని, నెట్టుకోటాలు, తోసుకోడాలు ఏమిటయ్యా లేబర్ వెధవల్లాగా ....ఛ...ఛ...

చక్ర : ఐదువేలిచ్చినా వాడు వచ్చి అడగడూ – అదేం తప్పా ! వెధవకి పావలాపోతే పిండాకూడు సయించదు. నిద్రపట్టి చావదు.

చారు : అక్కడికి పక్కనుంచి చెప్తూనే వున్నా, అరవొద్దండీ – ఆవేశం వొద్దండీ అని... వింటేనా వూహు... పూనకం వచ్చినట్టుగా రంకెలు, కేకలు ఇప్పుడేమయింది. ఎవళ్ళకైనా తెలిస్తే ఎంత నామర్ధా !

గోపా : కాసేపు నీ నోరు మూస్తావా నన్ను ఆలోచించుకోనీ. అయిందేదో అయిపోయింది. ఇప్పుడు ఏం చేస్తే బావుంటుంది. చక్రధరరావుగారూ....కాస్త సలహా చెప్పండి...

చక్ర : ఏమిటి ? ఇంత గౌరవం నాకే. ఇంట్లోకొచ్చిన ఇన్నాళ్ళకి పూర్తి పేరుతో ఎంత గౌరవంగా పలకరించావయ్యా. మర్డర్ చేస్తే చేసేవు గానీ, మేనర్స్ నేర్చుకుని, మనిషి వయ్యావు. నాకెంతో ఆనందంగా వుందయ్యా.

సత్యా : మర్డరు చెయ్యటం ఏవియటయ్యా. అతడ్ని నేనేం చెయ్యలేదు. తోస్తే పడిపోయి ప్రాణాలు వొదిలాడని ఇందాక చెప్పనే చెప్పాడు.

చక్ర : చాల్లే వూరుకోండి, అతడు చెప్పటం మీరు నమ్మడం. తోపులాటకే ప్రాణాలు పోయేట్టయితే, రోజు, బస్సుల్లో, సినిమా హాళ్ళల్లో చివరికి అసెంబ్లీలోనించి గూడా బతికెవరూ బయటికి రారు. ఆ !

గోపా : ఫ్చ్ నే చంపలేదండీ.

చారు : మీరుండండి. నాన్నా పోనీ రెండో కంటి వాడికి తెలీకుండా ! బయటికి లాగి పారేస్తానో ?

సత్యా : బాగానేవుంటుంది....కానీ ...వీడు ఇక్కడికొస్తున్నట్లు ఎంత మందికి చెప్పి చచ్చేడో ...ఏమో !

గోపా : అవునూ ...అదీ నిజమే ! ఫ్చ్...నాకు పిచ్చేక్కేటట్టుంది.

చారు : అయినా. ఆ ముష్టి అయిదువేలకి కక్కుర్తి పడడం దేనికి చెప్పండి.

గోపా : ఆ డబ్బు తీసుకొని, ఆ వెదవకిచ్చేసానని ఎన్నిసార్లు చెప్పిచావాలి.

చక్ర : ఆ వెధవకిస్తే మరి ఈ వెధవ నీ వెంట ఎందుకు పడతాడు. చెప్పు అహా...లాజికల్గా ఆలోచించు.

సత్య : సరే తీసుకున్నాడయ్యా. మా అల్లుడు ఐదువేలు వుదోగ్యం యిప్పిస్తానని తీసుకున్నాడు. ఐతే ఏమిటంటావ్. అదేం పెద్ద నేరమా. రోజూ పేపరుని ఫాలో అవ్వు. ఎంత కామనో నీకే తెలుస్తుంది.

చక్ర : అలా అయితే ఇంకా ఆలోచనదేనికి. ఆ అయిదు వేలల్లో కనీసం అయిదొందలు ఖర్చుపెట్టి శవానికి దహనమన్నా చేయించండి.

గోపా : నాకేం తెలీదు...డబ్బు నే తీసుకోలేదు. నిజం ...నా మాట నమ్మండి.

సత్యా : గోపాల్రావ్ అనవసరంగా ఆవేశపడకు. లంచం తీసుకోవడం ఈ రోజుల్లో నేరం కాదు. మర్డర్ చేయించిన వాళ్ళకి ప్రమోషన్లు యిస్తున్న కాలం యిది.

సీతా : ఆ వందా తొరగా యిచ్చేసుకోండి. అంతా చెక్కసున్నం తిన్నట్లుగా బొమ్మల్లా నిలబడిపోయేరు. నాకోసం ఎదురు చూస్తున్నారా. అరటి పళ్ళు త్వరగానే దొరికాయి గాని, ఆవు దొరికేసరికి ఆలస్యం అయిపోయింది. వీడెవడూ ? నట్టింట్లో నిద్దరోతున్నాడు ?

చక్ర : నిద్దరా – అంటే వాడు చావలేదంటారా ?

సీతా : అంటే – చచ్చిపోయాడా !

చక్ర : అసలేం జరిగిందంటే, మన గోపాల్రావ్ ఇతగాడి దగ్గర వుద్యోగం యిపిస్పస్తానని ఐదువేలు....

గోపా : నేతీసుకు చావలేదని చెప్పానా !

చారు : అబ్బు మీరంతా వుందండి. అసలేం జరిగిందటే, ఈ కుర్రాడు వుద్యోగం కావాలని ఐదువేలు ....

సీతా : లంచం ఇచ్చేడు., సరే అయితే...

గోపా : నాక్కాదు – మా ఆఫీసరు వెధవకి, ఇప్పుడొచ్చి, నాకు ఉద్యోగం వద్దు. ఆ డబ్బు యిచ్చెయ్యమంటూ కూర్చున్నాడు.

సీతా : అయినా యిచ్చింది ఆఫీసరు గారికి కదా. నీ వెంట ఎందుకు పడ్డాడు.

చక్ర : అదే అర్థం కాక అంతా అయోమయంగా వుంది.

చారు : ఐనా డబ్బులేమో ఆ ఆఫీసరు వెధవ తీసుకొని, మనుషుల్ని చీటి రాసిచ్చి యిటు పంపిస్తాడా ! అడిగేవాళ్ళు లేక గాని...వెధవని వొళ్ళు వాయకొట్టొద్దూ !

సత్యా : అందుకే వాళ్ళని ఆఫీసర్లు అనేది. అనుభవించేది వాళ్ళు . హైరానా పడి చచ్చేది ఇదిగో ....ఇలా....

చక్ర : ఆఫీసరు మాత్రం వూరికే ఇక్కడికి ఎందుకు పంపిస్తాడు ఏదో....

గోపా : నేనేం తీసుకోలేదు మహాప్రబో అని ఎన్నిసార్లు చెప్పేను.

సత్యా : తీసుకున్నా ఫర్వాలేదులే. మహప్రభో అని నేనెన్నిసార్లు చెప్పలేదు.

సీతా : ఇష్ – ఇంతకీ ఈ కుర్రనాకొడుకొచ్చి ఆడిచ్చిన డబ్బులు అడిగాడని నలుగూరు కల్సి ఆడ్ని చావగొట్టి చంపేసారు అంతేగా ?

చక్ర : రామ రామ – నాకేం తెలీదు – ఆ సమయానికి పడగ్గదిలో బూజు దులుపుకుంటున్నా.

సత్యా : నేను లోపల – సరిగ్గా అలా పడుకుని పై కప్పు వంక చూస్తూ తమ్ముడు చక్రధరం వస్తే బూజు దులిపించి సున్నం కొట్టించమని అడుగుదామని.

చక్ర : అంతా నోల్మూ ముయ్యండి. అదేనండి వీడొచ్చి డబ్బు కావాలని మొండిపట్టు
పట్టుకూర్చున్నాడు. నయానా భయానా చెప్పి, చివరికి విసుగెత్తి వూరికే ....ఇలా

చక్ర : నెట్టేసరికి ప్రాణాలు పోయాట.

చారు : స్వామీజీ ! అసలు ప్రాణాలు నిజంగా పోయినాయో, లేదో కాస్త చూసి చెప్పండి
( సీతారాం పరీక్షగా చూస్తుండగా )

చక్ర : ఎక్కడపుట్టేడో, ఎక్కడ పెరిగాడో, వెతక్కుంటూ వచ్చి మరీ నీ చేతుల్లో
హరీమన్నాడయ్యా...

సీతా : ప్చ్...ప్రాణాలు పోయి చాలా సేపయింది. అనుమానం లేదు.

చారు : అలా నీళ్ళు నవులుతూ నిబడతారేమండీ... ఏం చెయ్యాలో ఆలోచించండి.
పోనీ – బయటకి లాగి తలుపేస్తేనో, మున్సిపాలిటీ వాళ్ళు చూసుకుంటారు.

సత్యా : మున్సిపాలిటీ వాళ్ళు ఆ చచ్చిన వాడిని చూసుకోవటం ఎలా వున్నా పోలీసులు
బతికున్న మనందర్ని చంపుకు తింటారు.

చక్ర : బాగా చెప్పారు. అందుకే యిలాంటి విషయాల్లో తొందర పనికిరాదు...మీరూ మీరూ
అంతా కల్సి జాగ్రత్తగా ఆలోచించుకుని చేసుకోండి. వస్తానమ్మా ...వస్తానోయ్...

సత్యా : వొరే – తమ్ముడూ నేనా హార్టు పేషెంట్‌ని, కాస్త నువ్వన్నాదగ్గరుండి పన్జరిపించు.
చిన్న పిల్లలు వాళ్ళకేం తెలుస్తుంది.

చక్ర : సరేలే దగ్గరుండి జరిపించడానికి ఇదేంమన్నా అక్షరాభ్యసమా, అన్నప్రాసన, మర్డర్.
ఇలాంటి వాటికి ఎంత దూరంగా వుంటే అంత మంచిది ఆ !

సీతా : సరే...సరే...ముందు నేనడిగిని ఆ వందా నాకివ్వండి. నేవెళ్ళేక తీరుబడిగా
ఆలోచించుకోండి.

గోపా : నాకేమిటో అంతా అయోమయంగా వుంది. కాళ్ళూ చేతులూ ఆడటం లేదు.
ఇప్పుడేం చేస్తే బావుంటుందో, అసలేం చెయ్యాలో సీతారాం గారూ కాస్త
మీరన్నాచెప్పండి ప్లీజ్....

సీతా : ఏం చెయ్యాలీ అంటే – రూల్సు ప్రకారం, పోలీసులుదగ్గరకెళ్ళి .జరిగిందంతా చెప్పి, వాళ్ళని పిల్చుకొస్తే, శవాన్ని పోస్టుమార్టంకి, మీ అందర్నీ స్టేషన్‌కి పంపిస్తారు. సరే…తర్వాత కేసులు, శిక్షలు …అవెలాఁగూ తప్పవ్. ఇది నువ్వు ఏం చెయ్యాలీ అనడిగావ్ దానికి సమాధానం. ఇహ ఏం చేస్తే బావుంటుందీ అన్నదానికీ….

గోపా : చెప్పండి…ఏం చేస్తే బావుంటుంది

( సీతారాం అందర్నీ పరీక్షగా చూసి, అనుమానంగా )

సీతా : వీళ్ళంతా నీక్కావలసిని వాళ్ళేగా. ఎక్కడా నోళ్ళు విప్పరుగా.

గోపా : అబ్బే ఆ భయం ఏం లేదండీ. ఇది నాభార్య ఈయన మా మామ గారు. ఇహ ఈయన.

చక్రం : ఇంటి ఓనర్ని …పేరుకేగానీ, నిజానికి వీళ్ళతో కల్సిపోయా…అదే మా నిమ్మి బతికుంటే…

సీతా : ఇష్ – అయితే రెండో కంటికి కూడా తెలీకుండా శవాన్ని అవతలికి దాటించేయండి. జరిగిందంతా మర్చిపోండి అంతే…

చారు : అవునండీ పోలీసులు, కేసులు, కోర్టులు ఇవేమీ లేకుండా ఆ శవాన్ని టైగర్ గారు చెప్పినట్లు తీసుకెళ్ళి ఆ సుందరమ్మ ఇంటి ముందు పడుకోబెట్టి వస్తే సరి. అప్పుడు గాని దాని తిక్క కుదర్దు.

సత్యా : కాని అమ్మడూ. శవాన్ని సుందరమ్మ ఇంటిదాకా తీసుకెళ్ళే లోపల ఎందరమ్మలు, ఎందరయ్యాలు చూస్తారో ఆలోచించేవా ?

చక్ర : అందులో మన వీధుల్లో మొగాళ్ళంతా – వీధుల్లోనే పడుకుని ఛస్తారు

సీతా : సరే…అవన్నీ మీరంతా తీరుబడిగా తర్వాత ఆలోచించుకోండి. ఆ నా వంద నాకిస్తే నే వెడతా. అన్నం వండుకుని మరీ తినాలి.

గోపా : కాసేపు మీరు మాతో వుంటే ధైర్యగాం వుంటుంది. భోజనం గురించి ఏం ఆలోచించకండి.

చారు : మొన్న మీరొచ్చి పచ్చడి అడిగారూ. పెట్టలేదని ఎంత బాదపడి పోయానో వార్ని అడగండి. మనసులో మాట ఎవరికి చెప్పుకోవాలో తెలీక మానాన్న గార్ని వుత్తరం రాసి మరీ పిలిపించా కదూ నాన్న.

గోపా : నువ్వు కాస్త నోరు ముయ్యవే… సీతారాం గారు ఇప్పుడేం చెయ్యమన్నారు.

చక్ర : చారుమతి నాలాగా మందమతేమో అనుకున్నాగాని ...అమ్మో...అమ్మో...

సత్యా : తమ్ముడూ , అమ్మాయి ఏమందో, ఎందుకన్నదో ఆలోచించి ఆ విషయం మర్చిపోయి, గోడలకి పట్టిన బూజు గురించి ఆలోచిస్తే బావుంటుంది.

సతా : సరే, అయితే ....ముందు శవాన్ని లోపలగదిలోకి మార్చండి చిటుక్కున ఎవరన్నా వచ్చినా ఇబ్బంది వుండదు. తర్వాత ఆలోచిద్దాం.

గోపా : గుడ్ అయిడియా. చారూ అటు పట్టు.

చారు : అమ్మో, నేనా శవాలంటే చచ్చే భయం. ఏం నాన్నా

సత్యా : నాకు తెలీదా ? నీకంతా నా పోలికలేగా ...నాకూ భయమే...

గోపా : ఇద్దరూ లోపలికెళ్ళి తలుపు వేసుకు కూర్చోండి. పిరికి మొహాలు బాబాయి గారూ కాస్త - ఓ చెయ్యి అలా వెయ్యండి.

చక్ర : నేనా ! సరేలే నిమ్ముపోయినప్పుడే భయంతో పారిపోయి, పదోనాటికి వచ్చేను...నావల్ల కాదయ్యా ఏం అనుకోక.

గాపా : సరే పోనీండి ! ఇలా రండి. కాస్త మీతో పర్సనల్‌గా ఓ విషయం చెప్పాలి. అహ ఏం లేదు. ఇందాకా వచ్చిన కుర్రాడు. పోరంకి వెంకటేశ్వర్లు గారబ్బాయి కాదు. జగన్నాధమని జర్నలిస్టు. మీ నిర్మల చావు గురించి చెప్పమని ప్రాణం తోడేస్తున్నాడు. మళ్ళీ రమ్మన్నాలెండి.

చక్ర : భలేవాడివయ్యా. నువ్వెప్పుడూ యింతే చిన్న చిన్న విషయాలక్కూడా బెంబేలు పడిపోతావ్ మనలో మనం సాయం చేసుకోకపోతే ఎలా. పట్టు...వూ.... ( శవాన్ని చెరో వైపు పట్టి ఈడ్చుకెళుతుండగా, మధ్యలో ) ఆ వెధవకి ఏమన్నా చెప్పావా ?

గోపా : ఇంకా లేదు ( పదండి ఇద్దరూ లోపలికి శవాన్ని మోసుకు వెళ్ళిపోయేరు )

సత్యా : అమ్మాయ్ - పీనుగులంటే భయం అన్న సన్నాసి, మళ్ళీపట్టమంటూ అంత వుత్సాహంగా ముందుకొచ్చేడు. కాస్త తల తిరుగుడు గాని వుందా...వెధవకి...

చారు : చక్రం మామయ్య బుర్రగ్గూడా చక్రాలున్నాయి. కాస్త నిలకడ తక్కువ నాన్న అదో రకం మగాడు.

సీతా : ఆడు నవ్వుతూ నాలుగు మర్డర్లు చేసెయ్యగల్డు ( అంతలో లోపల్నించి గోపాల్రావు చక్రం అక్కడికొచ్చేరు. )

చక్ర : చూసేవా...అప్పుడే శవం ఎంత బరువెక్కిందో . త్వరగా వొదిలించుకోకపోతే కంపు గూడా మొదలవుతుంది మరి ...నీ యిష్టం...

చారు : ఏమండీ ....ఆ శవాన్ని ఏ గదిలో దింపేరు వంటగదిలోన...

చక్ర : కాదులేమ్మా పడగ్గదిలో ఓ పక్కగా పడుకోబెట్టాం....గోపాల్రావ్ ఇహ నేవెళ్ళి, నా వంటా అదీ చేసుకోవాలి.

గోపా : వెళ్ళండి వెళ్ళండి ఆ జగన్నాదం వచ్చేసరికి మీరుంటే కాస్త యిబ్బందిగా వుంటుంది. అవునూ మీ నిర్మల గారి పుట్టిల్లు నిడదవోలు కదా !

సత్యా : నిడదవోలా? అంటే అమ్మాయ్ కొంపదీసి, వీడు సదాశివుడి అల్లుడా. ఈమధ్యన ఆ పిల్లని అల్లుడు చంపేశాడని ఒకటే గోల

పీతా : ఇష్....ఇదంతా తేలే వ్యవహారంలా లేదు గాని, ఆ వంద యివ్వండి నే పోతా...

చక్ర : ఇదుగో గోపాల్రావ్, కంగారు పడక, నేనిక్కడే వుంటా. ధైర్యంగా వుండు...ముందు ఆ శవాన్ని ఎలా వొదిలించుకోవాలో ఆలోచించు.

చారు : అవునండి. టైగర్ గారు ఉండగానే ఏదో ఒకటి చేసేస్తే.....

గోపా : అవునవును సీతారాంగారూ ....శవాన్ని రెండో కంటి వాడికి తెలీకుండా ఎలా వొదిలించుకోవాలో కూడా చెప్తే.

సీతా : చెప్తాగానీ నే మాత్రం రంగలోకి దిగను...అంతా మీరే చూసుకోవాలి...సరేనా !

గోపా : అలా అనేస్తే మాగతేం కాను. దీక్షలో వుండగా మాలాంటి వాళ్ళకి సహాయం చేస్తే మీకు పుణ్యం, పురుషార్ధం . ఇలాంటి విషయాల్లో బొత్తిగా అనుభవం లేని వాళ్ళం.

చారు : అన్నయ్య గారూ, పోనీ దీక్ష ఈ వొక్క రోజుకి వాయిదా వేసి రేపట్నుంచి ప్రారంభించండి మీ చెల్లెల్లాంటి దాన్ని. మీ సొంత బావగారే హత్య చేస్తే మీరిలా పట్టనట్లు వెళ్ళిపోతారా ?

సత్యా : ఒరేయ్ అబ్బీ ...నీ పేరేమిటో ఆ....సీతారావుడూ...పెద్దవాడ్ని . చెప్తున్నా విను –చిన్న పిల్లలు. అనుభవం లేని వాళ్ళు మొదటిసారి కాబట్టి నువ్వు కాస్త దగ్గరుండి జరిపిస్తే మళ్ళీసారి వాళ్ళే మేనేజ్ చేసుకుంటారు.

గోపా : అంతా యిష్టం వచ్చినట్టు తలో మాట అనకండి...ఎంత టైగరయినా, ఆయన
మనసు నాకూ తెల్సు...వెన్నపూస, కాదనరు నాకు తెల్సు...

గోపా : సరే అనండి మాకు ధైర్యంగా వుంటుంది ప్లీజ్...

సీతా : ప్చ్ – దీక్షలో వున్నా, ఇలాంటి పన్లు తప్పడం లేదూ ? ఓ 40 రోజులు పాటు
మీలాగా – అదే మామూలు జనంలాగా వుందావనుకుంటే ...మొహమాట
పెట్టేస్తున్నాదరు...సరే కానివ్వండి.

చారు : హమ్మయ్య నాన్న సరే అన్నారు ఇహ మనకేం భయం లేదు.

సత్యా : ఆ...సరే అన్నాడా ! హమ్మో సంతోషంగా వుందే...అమ్మాయ్ గుండెలో కాస్త...

గోపా : అబ్బే ఆయన సరే అన్లేదండి ...జస్ట్...ఓకే అన్నాడు అంతే...

సత్యా : అంతేనా ....ప్చ్... సరే అన్నాడేమోనని సంతోషపడిపోయా...

సీతా : నాకంతా అయోమయంగా వుంది... సరే అనడానికి ఓకే అనడాడానికి గల తేడా
ఏమిటి ?

చక్ర : అదే నాకూ అర్థం కాకుండా వుంది. ఇదిగో గోపాల్రావ్...

గోపా : ఆ సంగతి తర్వాత మాట్లాడుకుందాం ముందు శవాన్ని ఎలా వదిలించు కోవాలి
అనేది తేలాలి, చెప్పండి సీతారాంగారూ ఏం చెయ్యమంటారు ?

సీతా : శవాన్ని పోలీసుల కంటపడకుండా వొదిలించుకోవడం అంత తేలికైనా పని కాదు..
చాలా కష్టం దానికి టాక్సీకావాలి. కనీసం 1000 రూపాయలన్నా అవుతుంది.

గోపా : వెయ్యి రూపాయిలే....

చక్ర : మరి డెడ్ బాడీ డిస్పోజింగ్ చాలా కష్టం. మాటలు కాదు – ఆహా అంటూ
వుంటారు. మనకేం తెల్సు !

గోపా : సరే – తర్వాత

సీతా : ఇద్దరు ముగ్గురు నమ్మకస్తులైన మనుష్యులు కావాలి. పోయినానోరు తెరవనివాళ్ళు
వున్నారా.

గోపా : ఆ ...రెడీ ...నేనూ మా మామగారూ, చక్రధర్రావు గారూ...

సత్యా : అల్లుడూ – నావల్ల కాదయ్యా. నన్నొదిలెయ్యి. అసలే వోపికలేదు. పైగా హార్టు
పేషెంటుని కాబట్టి నువ్వు చక్రం తమ్ముడూ.

చక్ర : నావల్ల కాదన్నయ్యా నువ్వేమన్నా అనుకో. ఏదో ఈ గదిలోంచి ఆ గదిలోకి పట్టమంటే, సాయంపట్టా గాని...ఆ శవాన్ని వేసుకొని,టాక్సీల్లో ...బస్సుల్లో వుహు...నా వల్ల కాదు...

చారు : ఏవండీ ఆ జగన్నాధం మళ్ళీ వస్తానన్నాడు గదూ...

చక్ర : ఐనా సరే .... నేనా శవం వెంట వెళ్ళనమ్మా ఆ కుర్రాడొస్తే కాస్త నా దగ్గరక్కూడా పంపించమ్మా. నేనూ పది నిమిషాలు చూసిన వాటిని గురించి క్లుప్తంగా చెప్పాలి.

గోపా : ఓహో...బెదిరింపా ? నాగ్గాని తిక్కరేగిందంటే, సరాసరి పోలీసుల దగ్గరకెళ్ళి, మీ గురించి, నా గురించి అంతా చెప్పేసి, సరెండరయిపోతా, ఇద్దరం ఢంకా పలాసో, పులీ మేకో ఆడుకుంటూ కాలక్షేపం చేద్దాం...సిద్ధమేనా... ?

సీతా : సరే ...అయితే ఇహ నేనెందుకు వెడతా మరి.

చారు : వెళ్ళకండి మీరెళ్ళిపోతే ఎలా. ఏమండీ ...ఆయన మనం తర్వాత తీరుబడిగా మాట్లాడుకుందాం. ముందు జరగాల్సిన కార్యక్రమం గురించి

గోపా : టాక్సీకి వెయ్యిరూపాయిలు ఒకే. పోతే ముగ్గురం మనుష్యులు పోనీ ..వాళ్ళని గూడా మీరు అరేంజీ చేయగలరా ?

సీతా : చేస్తే – మరో అయిదువేలవుతుంది.

చక్ర : అయిదువేలే .

చారు : టాక్సీకి వెయ్యి. వాళ్ళకి ఐదు వేలు – మొత్తం ఆరువేలా ?

గోపా : మా పరిస్థితులు మీ కర్ధమయ్యే వుంటాయ్ – వున్న ఫళాన ఆరువేలు తెమ్మంటే మా వల్ల కాని పని. కాస్త కనికరించిండి.

చక్ర : దీక్షలో వున్నానన్నారు. దేవుడి పేర్న డిస్కౌంట్ యిస్తార్లే కంగారు పడక.

సీతా : అబ్బే ...టాక్సీకిచ్చే వెయ్యి రూపాయిల్లో తగ్గించేందుకేమీ వుండదు... ఇహ నమ్మకస్తులైన మగ్గురికీ కనీసం, అయిదు వేలన్నా ఇవ్వకపోతే. వాళ్ళెక్కడన్నా వాగేరంటే మీరు అవస్థల్లో పడిపోగల్రు. కాబట్టి ఇప్పుడు డబ్బు కాదు ముఖ్యం.

సత్యా : ఒరే అబ్బీ సీతారాముడూ, పెద్దవాడ్ని , నీ తండ్రి లాంటివాడ్ని, నా మాట విను, ఏదో చిన్న పిల్లలు సరదాగా మొదటిసారి హత్య చేసుకున్నారు. ఈ సారికి నే చెప్పినట్లు కానియ్యి. మళ్ళీసారి నువ్వు అడిగినంతా యిప్పిచ్చే పూచీ నాది.

సీతా : ఏమిటి ఇంతకీ మీరనేది ?

సత్యా : అదేనయ్యా ఈసారికి కలిపి, ఆయంబాపతు నాలుగవేలల్లో పని పూర్తి చెయ్యి కాదనకు.

సీతా : అబ్బెబ్బే ...కుదరదండి మీరు ఆరువేలిచ్చినా దాంట్లో నాకు మిగిలిందేమీ వుండదు. బయట ధరలు ఎలా వున్నాయో మీకు తెల్సుగా ! ఇళ్ళమీద పడి అల్లరిపెడితే ...ఆరొందలు ....చెయ్యి చేసుకుంటే పన్నెండొందలు, కాలో , చెయ్యో తియ్యాలంటే ఆ ...రెండువేల ఆరొందల ముప్ఫై నాలుగు ......సరే ...చంపేస్తే పది వేలు వెధవది బస్సులమీద రాళ్ళేసి అద్దాలు బద్దలుగొడితే యిస్తున్నారు గదండీ ఐదొందలు.

సత్యా : అవన్నీ బయట పార్టీ వాళ్ళిచ్చే రేట్లు. వాళ్ళకంటే పార్టీ ఫండ్సు వుంటాయి కాబట్టి అడిగినంత యిస్తారు కానీ మేమో !

చారు : గుట్టు చప్పుడు కాకుండా వుద్యోగాలు చేసుకు బతికేవాళ్ళం. వాళ్ళిచినట్లు మేం ఎలా యివ్వగలం చెప్పండి.

చారు : అన్నయ్యగారూ ....కాదన్ను ...నాకు తెల్సు.

సీతా : అబ్బే కుదరదమ్మా ఇవన్నీ నా రేట్స్ కావు. యూనియన్ వాళ్ళ రేట్లు కాదంటే చెప్పండి ...నేపోతా మీరే మేనేజ్ చేసుకోండి.

సత్యా : అందరూ తలో మాటా మాటాడకండి. అస్సలు బొత్తిగా పెద్దవాళ్ళని గౌరవించడం ఏమీ లేకుండా పోయింది. మా రోజుల్లో ఐతే, మ్యారేజీ గానీ. మర్డర్ గాని ఒకడు చెప్తే మిగతా అందరం తు.చ. తప్పకుండా నడుచుకునేవాళ్ళం. అప్పట్లో డిసిప్లిన్ అలా వుండేది. సరే....చివరగా, అన్నీ కలిపి అయిదు వేలు. టాక్సీ ప్లస్ ముగ్గురు మనుష్యులు, మొత్తం అయిదువేలు యిచ్చేట్టు , వాళ్ళొచ్చి డబ్బు, శవాన్ని తీసుకెళ్ళేటట్లు అంతే. ఇహ ఎవ్వరేం మాట్లాడకండి.

సీతా : కానీ, నా కష్టాన్ని మీరు అర్ధం చేసుకుకోకుండా.

చక్ర : అన్నయ్య చెప్పింది చాలా రీజనబుల్‌గా సంసార పక్షంగా వుంది. తథాస్తు వూ...కానివ్వండీ

చారు : సరే – అయితే –మరి ఏమండీ త్వరగా

గోపా : అబ్బ నువ్వుండవే – మరి సీతారాం గారు ఓకే గదా !

సీతా : ఫ్చ్... మొత్తానికి మొహమాటం పెట్టి చంపేస్తున్నారు. పెద్ద మనుషులతో పని. సరే. కానీండి అయితే – డ్రయివర్‌కి రెండొందలు బేటా మీరే యిస్తారుగా.

సత్యా : అవన్నీ మాకేం సంబంధం లేదు. అన్ని లాంఛనాలు కలిపి, అయిదు వేలు. వాళ్ళ ముగ్గురికి కాళ్ళుకడిగి, అయిదు వేలు క్యాష్‌ని, ఆ పనవగానే వాళ్ళ చేతుల్లో పెడతాం. అంతే.

సీతా : సరే కానివ్వండి. ఏదో సోషల్ సర్వీస్ చేసినట్టే మిగిలిందేం వుండదు. అయితే నే వెళ్ళి మా కుర్రాళ్ళని టాక్సీ తీసుకురమ్మని ఫోన్ చేస్తా. ఇంతకీ ఈ ఇంటి నెంబరెంత ?

చక్ర : రాసుకోండి మూడు – గీత – నాలుగు – గీత –ఆరొందల ముప్ఫై నాలుగు అడ్డగీత ఇంగ్లీషు – ఎ – అడ్డగీత – ఇంగ్లీషుబి –చిన్న గీత – రెండు– అడ్డగీత ఇరవై నాలుగు చిన్న గీత –రాజధాని – ఏ.

గోపా : కెపిటల్ ఏ అంటే రాజధాని ఏ అని కాదు.

సీతా : సరే సరే...ఇది తెమిలే వ్యవహారంలా లేదుగాని, బండ గుర్తులు చెప్పి రమ్మంటా గానీ, ఈ లోపల డబ్బులు రెడీ చేసి పెట్టుకోండి ( ఎగ్జిట్ వెళ్ళిపోతాడు )

చక్ర : అది కాదయ్యా గోపాల్రావ్, కేపిటల్ అంటే రాజధాని అని కదా అర్ధం. మరి కాపిటల్ ఏ.ని రాజధాని ఏ అనే కదా, అనాలి .

సత్యా : ఆపవయ్యా, దిక్కుమాలిన సందేహాలు నువ్వునూ....అల్లుడు –ఇహ ఆలస్యం దేనికి, త్వరగా వెళ్ళి డబ్బులు తెచ్చుకో.....

గోపా : అలాగే మామగారు ...కాస్త మీ పెట్టె తాళాలిస్తారా ?

సత్యా : డబ్బు తెచ్చుకోమంటే నా పెట్టె తాళాలెందుకూ ?

గోపా : భలేవారే ...ఎంత మామగారయినా మీ పెట్టెని మీ తాళాలతో తెరవడం గౌరవం, సాంప్రదాయకం.

సత్యా : ఆ ! అంటే నీ వుద్దేశ్యం ఆ డబ్బు నీకు నేనివ్వాలి .

గోపా : కాక,...అంతడబ్బు నా దగ్గర ఎక్కడ వుంది. బేరాలు కుదిర్చిన మీరే ఒడ్డున పడెయ్యాలి.

సత్యా : నేనా ! హు ఇందాకా వందకాగితం అడిగితేనే లేదన్నాను. అంత డబ్బు నా దగ్గర ఎలా వుంటుందనుకున్నావ్ ? అయినా సంధర్భం వచ్చింది కాబట్టి చెప్తున్నా. నీ కంత పొగరు మొత్తనం పనికిరాదయ్యా. ప్రతివాళ్ళ మీదకి అలా ఒంటికాలి మీద దూకుతావా ? ఇదేవన్నా మర్యాదస్తుల లక్షణమేనా ?

చక్ర : బాగా అన్నారు, కాస్త మంచి చెడు తనా మనా వుండొద్దు క్షణ క్షణానికి కస్సు బుస్సు మనడం, చిన్నంతరం పెద్దంతరం లేకుండా ప్రతి వాళ్ళని ఎంత మాట పడితే అంత మాటలనడం బాగా అలవాటయిపోయింది. ఉసురు తగల్దా వూరికే పోతుందా ?

చారు : ఆ విషయాలన్ని తర్వాత మాట్లాడుకోవచ్చు...ఆ ....కాస్త పని పూర్తయేట్టు చూడండి మామయ్యగారు !

చక్ర : సరే కానీండి ...నాకేమిటి అభత్యంతరం !

చారు : హమ్మయ్య ! ఏవండి ఇంకా దిగులెందుకండి మావయ్య గారూ సరే అన్నారు.

చక్ర : ఆ ! నువ్వడిగింది డబ్బు గురించా ? నేను రెక్కసాయం అనుకున్నా.

గోపా : ఇన్నాళ్ళూ మాటలతో మీ మనస్సు నొప్పిస్తే క్షమించండి. అయిదువేలు సర్దుబాటు చేస్తే వారం పదిరోజుల్లోగా.

చక్రం : తిరిగి ఇచ్చేస్తానంటావ్...బావుందయ్యా ...చాలా బాగుంది. అయినా అంత మొత్తం నీ దగ్గర వుంటుందని ఎలా అనుకుంటావ్ ! వేలకి వేలు ఇంట్లో పెట్టుక్కూర్చోటానికి నేనేవన్నా లక్షధాకారినా ! ఇదిగో చూడు....ఇక్కడ వున్నవాళ్ళంతా నీ వాళ్ళు కాబట్టి మొహమాటపడక ఆ కుర్ర వెధవ దగ్గర తీసుకొన్న డబ్బులు బయటకు తియ్యి. నే ఎందుకు చెప్తున్నానో విను.

గోపా : నేనా డబ్బులు ఆఫీసరు గాడికి ఇచ్చేసానని చెప్పానా .

సత్యా : ఆఫీసరు గాడికి ఇవ్వకపోయినా తప్పు కాదని నే చెప్పాగా !

చారు : మరి ఇంతకీ ఎలాగండి మరి.

గోపా : అంతేనే, లోకమే అంత – అంతా సలహాలిచ్చే వాళ్ళేగాని, సహాయం చేసే వాళ్ళే లేరు. ఎవళ్ళ స్వార్ధం వాళ్ళది. ఎవళ్ళ భయాలు వాళ్ళవి. అయినా ఏం ఫర్లేదు. పిల్లనిచ్చిన వాళ్ళు ఇల్లిచ్చిన వాళ్ళు కాదన్నంత మాత్రాన కాగల కార్యాలు ఆగిపోవు.

చారు : దిగులుపడకండి...నారు పోసిన వాడు నీరు పోస్తాడు. మర్డర్ చేయించినవాడే మార్గం చూపిస్తాడు.

గోపా : కరెక్టు గానీ ఎవరకి తప్పినా నీకూ నాకు తప్పదుగా. పెళ్ళిలో ధర్మే. అర్ధేచా అన్నానే గాని, మర్డరేచ అనలేదని, అలిగి తప్పుకోకుండా సాయం చెయ్యాలి.

చారు : అలాగేనండి... ఏం చెయ్యాలో చెప్పండి. నాన్నని లోపలికి తీసుకెళ్ళి అడగమంటారా ?

గోపా : వొద్దు ...దున్నపోతులకి పాలు పితికే ప్రయత్నం చెయ్యకు. నీ మెళ్ళో ఆ నాంతాడు తీసి ఇలా తే అమ్మేసి పని పూర్తిచేస్తా.

చారు : ఏవటన్నారు. నా మెళ్ళో సూత్రాలు, గొలుసు అమ్మి ఆ చచ్చిన వాడ్ని అవతలకి దాటిస్తారా ! ఇదెక్కడన్నా చూసారా ! కనీసం విన్నారా !

గోపా : ఇప్పుడు విన్నావుగా ఇహ చూద్దురుగాని, త్వరగా మెళ్ళో పసుపు కొమ్ముకట్టుకొని, ఆ గొలుసు ఇలా తే.

సత్యా : వొరే తమ్ముడూ – ఇవాళ తేది. వార నక్షత్రాలేమిటో చూసి కాస్త అల్లుడికి చెప్పు.

చక్ర : ఇవాళ దశమి శుక్రవారం, మూలా నక్షత్రం మొదటిపాదం, పైగా పూర్తి వర్జ్యం కూడా వుంది.

సత్యా : దశమి, శుక్రవరం మూలానాక్షత్రం, మొదటిపాదం పైగా వర్జ్యం. అమ్మదు అల్లుడట్లాగే అంటాడు గానీ ఇవ్వకమ్మా.

గోపా : మావగారూ...

సత్యా : అమ్మాయి నీకు గుర్తుందా ! మా నాన్న, అదేనే మీ తాత ఇలాగే నాయనమ్మ మెళ్ళో మంగళసూత్రాలు, దశమీ శుక్రవారం తీసికొని అమ్మి ఇంటికి కరెంటు పెట్టించాడు. తర్వాత ఏం జరిగిందో తెలుసుగా ?

చారు : అవును నాన్న గుర్తొచ్చింది. తాతయ్య పదిహేను రోజులు తిరక్కుండానే కరెంటు షాక్ కొట్టి చచ్చిపోయాడు. హమ్మో మీరేవన్నా అనుకోండి. నేను మాత్రం గొలుసు ఇవ్వనంతే

గోపా : అంటే ఏవిటే, పెళ్ళాం మెళ్ళో మంగళసూత్రాలు, దశమి శుక్రవారం నాడు తీసుకుంటే ఆ మొగుడు చస్తాడంటావ్. అంతేగా ! ఏం ఫర్లేదు . నే రెడీ ఇలా ఇవ్వు త్వరగా.

సత్యా : నువ్వు రెడీ అయినా మేము ఇంకా రెడీ కాదయ్యా . అంచేత కుదర్దు నీ తిప్పలు నీవు పడు అంతే !

గోపా : చారు. నీ సమాధానం కూడా ఇదేనా ?

చక్ర : మంగళసూత్రాలు ఇచ్చి మొగుడ్ని చంపుకోవటం చాలా ఛీఫ్‌గా వుంటుందయ్యా !

చారు : నావల్ల కాదండి. అయిదో తనంకంటే ఆడదానికింకేం కావాలండి. చూస్తూ చూస్తూ చేతులారా చెట్టంత మిమ్మల్ని – అమ్మో.

గోపా : నువ్వు కాదంటే నే జైలు పాలవుతానే!

చారు : మొగుడు అస్సల్లేనిదానికన్నా జైల్లో వున్నా ధైర్యంగానే వుంటుంది మీక్కోపం వచ్చినా సరే నే మాత్రం ఇవ్వను.

గోపా : అంతేనే, అంతే తల్లి, భార్య, పిల్లలూ, చుట్టాలూ , పక్కాలు, అందరు నిన్ను గౌరవించేది. నువ్వు సంపాదించినంత కాలమే, ఎలా సంపాయిస్తున్నావన్నది వాళ్ళకనవసరం. కాని చిన్న చిక్కొచ్చి వెనక్కు తిరిగి చూసుకుంటే నీ వాళ్ళే నీకు పరాయి వాళ్ళుగా కనిపిస్తారు. అనరాని మాటలతో హింసిస్తారు. మనషిలో ఈ స్వార్ధమే లేకపోతే. వాల్మీకి అంతటి మహాముని అయివుండే వాడూ కాదు, మాహా కావ్యరచన చేసుండేవాడు కాదు.

చక్ర : ఇంతకీ నువ్వనేది, ఏదైనా పుస్తకం గాని రాస్తానంటావా .

గోపా : ఒక మనిషి కష్టార్జితాన్ని ఇంకెవడో దోచుకోవటం, ఎంత అనాగరీకమో, అసహ్యమో, నేరమో, నాకు తెలిసొచ్చింది. మీరంతా కాదన్నా ఆ డబ్బు నే ఏర్పాటు చేసుకోగల్ను.

చక్ర : మరింకేం త్వరగా కానియ్యి....

సత్యా : ఏం చెయ్యదల్చుకున్నావో కాస్త చెప్పు. అమ్మాయి అడగవేం.

గోపా : చిన్నతనంలో నాకు అన్నం తినిపించిన వెండి కంచం మా అమ్మ తన గుర్తుగా నాకిచ్చింది. దాన్ని అమ్మేసి డబ్బు తెస్తా ( లోనికి వెళ్ళాడు )

చారు : నాన్నా. ఆయనకి నిజంగా కోపం వచ్చిందంటావా. అదోలా మాట్లాడుతున్నారు.

సత్యా : ఏం కంగారు పడకమ్మా ...అయినా మగవారి కోపం ఎంత సేపూ ...పైగా
నేనున్నాగా ...దగ్గరుండి సర్దుబాటు చేస్తా సరేనా !

చక్ర : చాల్లేండి...ఇంత చిన్నవిషయానికి పన్లు మానుకొని పడుండాలా ఏమిటి నేను లేనూ !
గోపాల్రావుని చొక్కా పుచ్చుకుని నిలేసి...
( సీతారాం ప్రవేశం )

సీతా : ఓం ....ఏవైంది... డబ్బు రెడీనా...

సత్యా : ఫోన్ చేసావా ?

చక్ర : మనుషులు, కారు రెడీనా ! అంకులూ అల్లుడ్ని పిలవండి ( జగన్నాథం ప్రవేశం )

జగ : హల్లో...అందరికీ గుడ్ మార్నింగ్ ( సీతారాంని చూసి ) ఓహో ! నువ్వు
ఇక్కడున్నావా ! నా పేరు జగన్నాథం, జర్నలిస్టుని గుర్తొచ్చేనా !

సత్యా : ఏవిట్రా ....నువ్వు జర్నలిస్టుగా పన్జేస్తున్నావా ! మరి చెప్పావు కావేం.

చక్ర : నువు మళ్ళీ ఎందుకొచ్చినట్లు నడు బయటకు.

చారు : అలా చెప్పండి వెధవకి బుద్దిలేకపోతే సరి.

సీతా : ఇక్కడికి ఎందుకొచ్చేవని వాళ్ళంతా అడుగుతున్నారు. అంచేత మర్యాదగా
తప్పుకుంటే బావుంటుంది.

జగ : అలాగే కాని, ఏంటి సారా కుంభకోణంలో నీ పేరు బాగా వినిపిస్తోంది.
తాంబూలాలు ఘనంగా ముట్టాయిటా నిజవేనా ?

సత్యా : అదేమిటే. మన వెంకు బాబాయి కొడుకుని పట్టుకొని

చక్ర : మీరేం మాట్లాడకండి. వెంకుకు బాబాయి లేదు పెంకు బాబాయి లేదు.

చారు : నాన్నా ! కాసేపు నువ్వేం మాట్లాడక తర్వాత చెప్తాగా. నిన్నే వెడతావా. బయటకు
నెట్టమంటావా ?

జగ : సరే అలాగే వెడతాను. కాని ఓ సంగతి గుర్తుంచుకోండి. హంతకుల్ని దొంగల్ని
అంత తేలిగ్గా వొదిలి పెట్టే రకం కాను. మళ్ళీ వస్తా ( సీతారాంతో ) పోలీసులు
కన్ను గప్పి కల్తీ సారాని ఎంతో నేర్పుగా పంపిణీ చేస్తున్నావుట కంగ్రాట్సు
( లోపల నుంచి గోపాలరావు కంగారుగా అక్కడికి వస్తూ )

గోపా : చారే...చారు...చారు

సత్యా : ఏమిటయ్యా ? ఏమైంది ? ఏమిటా కంగారు.

గోపా : లోపల శవం కదుల్తోంది నే కళ్ళారా చూసాను.

జగ : శవమా ! ఎక్కడ. పదండి చూద్దాం.

గోపా : జగన్నాథం. నువ్వా ....

జగ : అవున్నేనే ....పదండి చూద్దాం.

చక్ర : గోపాల్రావ్ మర్యాదగా వీణ్ణి బయటకు పంపించెయ్యి.

సత్య : అద్సరేనయ్యా. అసలీ శవాలు కదలటం ఏవిటి. నాకేమీ అర్థం కాకుండా వుంది.

చారు : అంతా వొట్టిదే నాన్నా. అసలు శవం ఎక్కడువున్నదని. ఆఫీసులో ఆయన నాటకం వేస్తున్నారుట. రిహార్సలు, చేసుకుంటున్నారంతేకదండీ.

గోపా : లేదే. నాకేమిటో అంత కంగారుగా వుంది. వెండి కంచం బయటకు తీద్దామని అలా బీరువా దగ్గరకి వెళ్ళేసరికి వొళ్ళు జల్లుమంది. ఆ శవం కదిలిందే.

జగ : భయపడకండి ....చూద్దాం పదండి.

చక్ర : ఏం అక్కర్లేదు. మేమేం చూసుకోగలం నడు బయటకి.

చారు : అవును.వెడతావా ! సీతారాం గార్ని చేయి చేసుకోమంటావా ?

సత్యా : అయితే వీడు వెంకు బాబాయి కొడుక్కాడా ! మరి నెట్టండి. వెధవని బయటకి వీడ్ని చూడంగానే అనుకొన్నా ఆ బట్టతల వాడికి ఈ గిరజాల జుట్టు వెధవ ఎలా పుట్టేడాని...

సీతా : ఆగండి. ఆవేశపడి లాబం లేదు. జగన్నాథానికి మన గురించి అంత తెలిసీ వుంటుంది, దాచి ప్రయోజనం లేదు. జరిగింది మొత్తం చెప్పేయ్యటం మంచిది.

జగ : ఇంకో సారా కేసా !

సీతా : కాదు వీళ్ళ సొంత కేసు. నాకేం సంబంధం లేదు వొట్టు

సత్యా : అసలింతకి అల్లుడు చూసింది ఎంతవరకు నిజమో తెలుసుకొంటే
సరిపోతుందిగా ఆ కుర్రాడు నిజంగా బతికే వుంటే ఇహ మనం ఈ జగన్నాధానికి
భయపడాల్సిన పని లేదు. ఏం అల్లుడూ !

చక్ర : నాకయితే ససేమిరా ఇష్టం లేదు. ముందు వాడిని తక్షణం బయటకు నెట్టాలని నా
నిర్ణయం.

గోపా : మామగారు చెప్పింది బావుంది. కాని నాకంతా కంగారుగా వుంది. మీరెవన్నా
వెళ్ళిచూసిరండి.

సీతా : సరే లోపల వున్నది శవమా మనిషా అన్నది. మీకు నాకే గాదు. ఈ
జగన్నాధాన్నికూడా చాలా అవసరం. అంచేత మేం ఇద్దరం వెళ్ళి చూసొస్తాం.

జగ : అక్కర్లేదు. నేను మనుష్యుల్ని నమ్ముతాను. మీరెళ్ళి చూసి రండి.

సీతా : నీలాంటి వాళ్ళని, నాలాంటి వాళ్ళని, ఇలాంటి వాళ్ళు నమ్మరు అంచేత పద
చూసొద్దాం.

జగ : ఓకే.పదండి ( సీతారాం, జగన్నాధం లోపలికి ఎగ్జిట్ )

చక్ర : గోపాల్రావ్ ముందే చెప్తున్నా నా భార్యచావు గురించి ఆ వెధవతో ఏవన్నా
చెప్పావో... మర్యాదగా వుండదు. అయినా నాకర్ధం కాక అడుగుతా. నా పెళ్ళాన్ని
నే చంపుకుంటే నీకేంమిటంటా అబ్జక్షన్. నా చొక్కా నే చింపుకుంటా అదేవన్నా
నేరమా ! నా కలర్ టి.వి ని భడేల్న బద్దలకొట్టుకుంటా నీకేమిటి అభ్యంతరం.

సత్యా : ఓరి నిన్ను తగలెయ్య. పెళ్ళాం అంటే కలర్‌టి.వి ఖద్దరు చొక్కానో
అనుకుంటున్నావా ? మనిషిరా ! నీలాగా, నాలాగా మనషిరా. ఇంటి దీపాన్ని
చేజేతులారా ఆర్పుకునే వెధవ్వి.

చారు : నాన్నా కాస్త ఆగుతాదా !

గోపా : అయినా ఇపుడు తేలాల్సింది వీరి భార్య చావు గురించి కాదు.

చక్ర : మరి !

( సీతారం అక్కడికొచ్చాడు )

సీతా : నువు చూసింది నిజం కాదు.ఆ కుర్రాడు ఎపుడో పోయాడు.

చక్ర : హమ్మయ్య గోపాల్రావు అర్థం అయ్యిందిగా అదీ సంగతి. అందుచేత వాక్కు తగ్గించి వ్యవహారం చూడు.

గోపా : నిజంగా, బాగా పరీక్షగా చూసారా ? కాని నే చూసింది – అవును ఇంతకీ ఆ జగన్నాధం ఏడి ?

సీతా : శవాన్ని మొహంలో మొహం పెట్టి పరీక్షగా చూస్తుంటేను బయటకు వచ్చి గదికి గడియపెట్టేసా .

చక్ర : వాడా గదిలో ఎందుకండీ బాబూ. బయటకు తోసెయ్యక

చారు : అవునండి, వాడా శవాన్ని చూసాడు. ఎవడు వీడు. ఎలా పోయేడు. ఎప్పుడు పోయేడు అంటూ యక్ష ప్రశ్నలు వేస్తే మనగతి ఏం కాను !

సత్యా : ప్రతి విషయానికి కంగారు పడకమ్మా. అందరూ కలిసి అందమైన ఓ కథ చెప్పేద్దాం. సరేనా !

సీతా : లాభం వుండదు. జర్నలిస్టులు మనం చెప్పే కల్లబొల్లి కథల్ని అంత తేలిగ్గా నమ్మరు. పైగా చెప్పేస్తేనో.

చక్ర : చెప్తాగా చెప్పు ఎలా చెప్తానో నేనూ చూస్తాగా నువ్వు చెప్పటం పూర్తి కాగానే ఇక్కడ జరిగిందంతా నే చెప్పనూ.

చారు : అవునండీ జరిగిందంతా బయటకు పొక్కితే పరువుకి పరువు పోతుంది. కేసులు, కోర్టులు.

సీతా : పరువుతో పాటు ఉద్యోగం పోతుంది. తర్వాత పద్నాలుగేళ్ళు జైలు పడుతుంది.

సత్య : ఈ వయసులో, ఈ బలహీనమైన గుండెతో నీ పెళ్ళానికి తిండి పెట్టలేనయ్య. నా వల్ల కాదు. తర్వాత నీ ఇష్టం – బాగా ఆలోచించుకో.

గోపా : అబ్బబ్బ – ఆపండి – ఏదో అంతా అయిపోయినట్లు ...సీతారాంగారూ ఈ పరిస్థితిలో ఏం చెయ్యాలో మీరే చెప్పాలి. నా బుర్ర అసలు పన్జెయ్యడం లేదు. ఏం చెయ్యమంటారు.

సీతా : అంతా కలిసి ఏదో ఒక ఉపాయం ఆలోచించి ఈ ఉపద్రవం నుంచి బయటపడాలి. లేకపోతే, మీరు, నేను, వాడు, అంతా జైలు పాలుకాక తప్పదు.

చక్ర : అంటే వాడు మీక్కూడా కంట్లో నలుసన్నమాట ?

సీతా : అంతే కాదు. పక్కలో బల్లెం కూడా, సారా కేసులు గుంరించి నన్నే అడిగాడంటే, వాడికి ఈ పాటికి ఎన్నో విషయాలూ తెలుసుంటాయని నా అనుమానం.

చక్ర : మరి ఇంకేం, అయితే వీడు చాలా డేంజర్ మనిషి అన్నమాట.

సీతా : డేంజర్ కాదు మీరు జాలి పడి వదిలేరో – బోనులో సింహాన్ని పైకి వదిలినట్లే . ఇవాళ ఈ హత్య గురించి. రేపు నీ పెళ్ళాం చావు గురించి ఎల్లుండి వారి లంచాల భాగోతం గురించి, వాడు పేపర్లో రాసి తీరతాడు. అప్పుడు పరువులు, ప్రాణాలు పోవడం తథ్యం బాగా ఆలోచించుకోండి.

గోపా : మరి అయితే ఏం చేద్దాం అంటారు.

సీతా : అయితే వినండి. ఈ జగన్నాథాన్ని కూడా చంపెయ్యాలి.

గోపా : ఇంకో హత్యా..

చారి : మళ్ళీ ఇంకో శవం.

సత్యా : ఆరారగా ఈ హత్యలేమిటే అమ్మడు ?

సీతా : ఛ నోరు ముయ్యండి, ఆ జగన్నాథం గాడి చావు ఇక్కడున్న అందరికి ముఖ్యం లేకపోతే ఆడు మన చావు కళ్ళ చూస్తాడు.

సత్యా : నాకేమిటో భయంగా వుంది.

గోపా : కాని చూస్తు చూస్తు ఒక నిండు ప్రాణాన్ని ?

చక్ర : మనం బతకాలంటే వాణ్ణి చంపాలయ్య తప్పదు.

చారు : స్వామిజీ మీరే మమ్మల్ని ఒడ్డున పడేయ్యాలి.

సీతా : సరే అయితే మన అందరి తరపున ఆలోచించి మరి చెప్తున్నా జాగ్రత్తగా వినండి. ఆ జగన్నాథాన్ని చంపటం అనేది మనందరం కలిసి చేసుకుంటున్న శుభకార్యం లాంటిది. అంటే అంతా తలో పని చేసుకోవాలి. అంచేత ఆ గదిలోనే వాడి గొంతు కాస్తా పిసికి వాడ్ని నే చంపేస్తా. తర్వాత జరగాల్సిన పన్లన్ని ఇహ నాకేం సంబంధం వుండదు. మీరే చూసుకోవాలి. సరేనా !

గోపా : ఓ అలాగే ! మనిషిని చంపటం తెలియదు గాని, మిగతా పన్లంటారా. కొట్టిన పిండి.

సత్యా : కొట్టిన పిండా, అప్పడాల పిండా, ఆలోచనా సాలోచనా లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడక, అయినా నాకెందుకొచ్చింది. నాకేం సంబంధం లేదు.

చక్ర : ఇదిగో గోపాల్రావ్, అంకుల్ చెప్పే దాన్ని గురించి కాస్తా ఆలోచించు. ఒక శవానికే అల్లల్లాడిపోతుంటే రెండు శవాల్ని మూడో కంటి వాడికి తెలియకుండా ఎలా దాటిద్దామని. నన్ను మాత్రం ఇబ్బంది పెట్టక తర్వాత నీ ఇష్టం.

సీతా : దాని గురించి మీకు దిగులక్కర్లేదు. ఇవాళ కల్తీ సారా తాగి జనం కుప్పలు కుప్పలుగా చనిపోయారూ...ఆసుపత్రి వరండాలో అన్నీ శవాలే. ఈ రెండు శవాల్ని కూడా తీసుకెళ్ళి వాటితో కలిపించే పూచీనాది. ఇంకేం ఆలోచించకండి. ఆ జగన్నాధాన్ని మీ నలుగురు కలిసి చంపెయ్యాలి. ఆ తర్వాత పని అంతా నాకు వదిలెయ్యండి. నేను ఫ్రీగా ఒక్క పైసా తీసుకోకుండా చేసి పెడతాను.

చారు : అవునండి మావయ్య గారు చెప్తున్నది నిజమే గ్లాసులో నీళ్ళు తాగి తీరుబడిగా ఆలోచించండి

గోపా : అంటే ఏమిటి మీరంతా అనేది శవాన్ని వొదిలించుకోవటం మనవల్ల కాదు కాబట్టి ఆ జగన్నాధాన్ని చంపే పనిని వొప్పుకోమనేనా.

చక్ర : మనసు రాయి చేసుకొని సరే అను.... ఊ

సత్యా : అల్లుడూ కానియ్యి పీనుగలతో హైరాణా పడటం కన్నా ఇదే నయం.

చారు : నాన్న, మామయ్య గారు. ఎలాగుపై ఎత్తున వుండనే వుంటారు.

చక్ర : ఇదుగో చారుమతి

సీతా : ఉష – తాచుపామునింట్లో పెట్టుకుని తాపీగా కబుర్లు చెప్పుకోవడానికి సిగ్గులేదా మీకు సరే. ఆ జగన్నాదం గాణ్ణి మీ నలుగురు కలిసి చంపెయ్యాలి. ఆపైన పనంతా నాది ఫ్రీగా చేసి పెడతా ఓకేనా.

చారు : నాన్నా ! స్వామీజీ పనంతా ఫ్రీగా చేసిపెడతారుట.

సత్యా : విన్నానమ్మా. గోపాల్రావ్ ఇంకా దేనికయ్యా ఆలోచిన హాయిగా ధైర్యంగా ఎంతమందినయినా చంపొచ్చే.

చక్ర : అంటే ! స్వామీజీ ఇది దేవుడి పేర్న డిస్కౌంటా.

సీతా : కాదు. మీరు, నేను, అంతా దొంగలం అందరం ఒకే బండిలో ప్రయాణిస్తున్నాం అప్పుడప్పుడు . ఈ జగన్నాధం గాడిలాంటోళ్ళు ఆ బండికి అడ్డుపడి ప్రయాణంలో ప్రమాదాలు తెచ్చి పెడుతుంటారు. ఆ అడ్డు తొలిగించుకోటానిక మనం మనం సాయం చేసుకోవాలి. అంచేత డబ్బులు తీసుకోకుండా శవాన్ని దాటించేస్తా ఇంతకీ రెడీనా !

గోపా : కాని, చూస్తూ చూస్తూ ఒక మనిషిని చంపటం....

చారు : సర్లెండి – మీరెక్కడ దొరికారండి పిరికి మా లోకం మీకంత భయంగా వుంటే ఆ కుర్రాడిని కదలకుండా పట్టుకోండి చాలు, అప్పుడు చక్రం మావయ్య గారు...

చక్ర : మర్డర్ చేస్తారంటావ్. బావుందమ్మా మహా చక్కగా వుంది. అయినా నాకు తెలియక అడుగుతా అస్సలు నేనెందుకు మీతో సహకరించాలట.

సీతా : ఆ జగన్నాదం బతికుంటే పెళ్ళాం చావు గురించి వాకబు చేస్తూనే వుంటాడు కాబట్టి ఏదో రోజు నువు లాకప్‌లోకి వెళ్ళాల్సి వస్తుంది కాబట్టి.

చక్ర : అమ్మో !

సీతా : అంచేత ఎవళ్ళు నోరు తెరవకండి, నే చెప్పినట్టు చెయ్యండి నాగ్గానీ తిక్కరేగిందంటే ఓం ఆరు శవాలను ఇక్కడే దహనం చేసెయ్యగల్ను త్వరగా ఎవళ్ళడ్యూటీ వాళ్ళు చెప్పేసుకోండి ...వూ....

సత్యా : సరే కాని అల్లుడూ నా పరిస్థితి తెల్సుగా ఆ కాళ్ళు పట్టే పని నాకిప్పించు.

చారు : నేను అరవకుండా నోరు నొక్కుతా.

గోపా : కదలకుండా వెనుకనించి గట్టిగా పట్టుకుంటా !

చక్ర : ఇహ మిగిలింది పీక నొక్కటం అదేం ఖర్మమో ఎప్పుడూ నాకదే డ్యూటీ

సీతా : ఇహ – జరగబోయే ఆనటకం చెప్తా వినండి ఇప్పుడు వున్నట్టుండి ఈ ముసలాయనకి హార్టు ఎటాక్ వస్తుంది.

చక్ర : అసలు వారికి హార్టే లేదే !

సత్యా : అక్కడికి నీకు వుండి చచ్చినట్టు.

గోపా : అబ్బ మీరు నోరు ముయ్యండి....ఆ చెప్పండి !

సీతా : మీరంతా ఆయన చుట్టూ మూగి కంగారుగా ఆందోళన పడిపోతుండగా, లోపల్నించీ నేను. జగన్నాథాన్నిక్కడికి తీసుకొస్తా , సహజంగా దగ్గర కొచ్చి ఏమైంది. ఏమిటని అడుగుతాడు కాని మీరెవ్వరూ ....అతడి మాటల్ని వినిపించుకోక మీ తొందరలో మీరుంటారు. అప్పుడు నేను చెప్తానని అతడ్ని ఇలా ఇక్కడికి తీసుకొచ్చి చెప్తుండగా మీ నలుగురూ చప్పుడు చేయకుండా వెనకనుంచి వచ్చి వొకళ్ళు అరవకుండా నోరు మూస్తారు ఇంకోడు కదలకుండా గట్టిగా పట్టుకుంటారు. మరొకళ్ళు గట్టిగా పీకపీసుకుతారు. కిందపడిపోగానే. ప్రాణాలు పోయినట్లు నిర్ధారణ చేసుకున్నాక నేవెళ్ళి టాక్సీ పట్టుకొస్తా. ఆ తర్వాత జరగాల్సింది నే చూసుకుంటా, మీకేం సంబంధం లేదు....ఓకేనా.

గోపా : అలాగే...కానీ

చక్రం : అవును...ఇంతకీ....

సీతా : ఏమన్నా అనుమానాలుంటే చక చకా అడిగేసుకోండి, ప్లాన్ పాడయిందా మీ అందరి పని గోవిందా.

చారు : నాన్న పెద్దవాడివి ముందు నువ్వడుగు.

సత్యా : అడుగుతానమ్మా, ఇందాకట్నుంచీ ఎదరుచూస్తున్నా, అడిగేస్తున్న అల్లుడు నన్ను క్షమించి వొదిలెయ్యి , బుద్దిగడ్డి తిని ఇలా వచ్చా. ఈవయసులో హత్యలు మానభంగాలు నా వల్ల కాదయ్యా !

చక్రం : హత్య మాత్రమే చెయ్యమనేది. మాన భంగం కోసం మిమ్మల్ని ట్రబుల్ చెయ్యం.

గోపా : అడగమన్నది. అనుమానాలు, క్షమాభిక్షలు కావు. మొత్తం రంగం సిద్ధమైంది ఎవరేం మాట్లాడకండి. సీతారాంగారు మేం రెడీ...

సీతా : అయితే. ముందు ఈ ముసలాడ్ని పడుకోబెట్టి మీ ముగ్గురే చుట్టుముట్టి గొల్లుమనండి...

గోపా : మీరిలా రండి. చక్రంగారూ మీరిట్లారండి. చారూ ఆ కుర్చీ యిట్లా జరుపు.

సత్యా : గుండె జబ్బు వచ్చినట్లు నటించడం – ఎలాగ....

గోపా : నటించక్కర్లేదు. వచ్చిన దగ్గర్నుంచి జరుగుతున్న తంతే కంటిన్యూ చేయండి అంతే....

సత్యా : అంతేనా ? అయితే అమ్మాయ్ – ఇదేమిటీ నా గుండెల్లో హమ్మో – ఓర్నాయనోయి

చక్రం : ఇష్ ....గుండె జబ్బు వెధవకి అంత గొంతా !

సత్యా : ఇదిగో – తిడితే నాక్కోపం పస్తుంది. నాగ్గాని కోపం వచ్చిందంటే చచ్చినా గుండె నొప్పిరాదు. తర్వాత మీ ఇష్టం.

సీతా : ఇష్...త్వరగా

( సత్యానందం మధ్యగా పడుకున్నాడు. ముగ్గురూ చుట్టూ కూర్చున్నారు )

సీతా : మొదలెట్టండి.

చారు : నాన్న.... నాన్న... అన్యాయం చేసి వెళ్ళిపోతున్నావా నాన్నా అమ్మ వచ్చి అడిగితే ఏం చెప్పమంటావు నాన్న !

సత్య : గోదానాలు – భూదానాలు అంటూ బ్యాంకులో డబ్బుగాని తీస్తే కాళ్ళు విరగ్గొడతానని చెప్పమ్మా

చక్రం : ఏమిటో పాపం – డబ్బంటే ఎంత ప్రాణమో ! ముండాకొడుక్కి చచ్చిపోయినా

సత్య : తిట్టొద్దని ముందే చెప్పానా ! మళ్ళీ తిట్టు కాని వినిపించిందా....చచ్చినవాడిని ఇకిలిస్తూ లేచి కూర్చుంటానంతే.

గోపా : ఇష్ – పడుకోండి ఏమిటో ....మామగారని మాటే గాని, నిజంగా తండ్రిలాంటి వాడు నేనంటే ఎంత ప్రేమో, ఆప్యాయత, ఉదయం లేవగానే – మామగారు మరీ బలహీనంగా వున్నారు. హొటల్నుంచీ ఏదైనా టిఫిన్ గానీ తెమ్మంటారా అని అడిగితే

చక్రం : వొద్దనుంటారు. ఎంత అభిమానం, ఎంత మొహమాటమో, నే మాత్రం ...ఏరా అన్నయ్య.... మా ఇంట్లో గూడా పది రోజులు వుండాలి అంటే అలాగే అన్నాడని సంతోషపడ్డానేగాని, ఇలా జరుగుతుందని....

సత్య : అబ్బ....చచ్చినట్లు పడుంటే ఎంత హాయిగా వుంది. మీరేం బాధపడకండి. ఈ పది నిమిషాలు కాంగానే, నే చక్రం తమ్ముడి ఇంటికి మకాం మారుస్తా !

సీతా : ఒ.కే.ఒకే.అంతా రెడీనా. అయితే నే వెళ్ళి వాడ్ని పట్టుకొస్తా. రైట్ ...వన్ ...టూ ....త్రీ ...స్టార్ట్ ( సీతారాం లోనికి ) వెళ్ళాడు ( అంతా ఘొల్లు మన్నారు. అంతా తలో మాటా అంటూ బాధపడిపోతున్నారు )

గోపా : ( కళ్ళు తుడచుకుంటూ ) ఇంత ఘోరం జరుగుతుందని నే కలలో కూడా అనుకోలేదు చారూ.

చారు : ఇహనేనెలా బతికేదండీ – నాన్న నెలకి నాలుగుసార్లు వస్తాడనే ధైర్యంతో బతికేదాన్నండీ.... ఎంత పన్చేశావో నాన్న...

చక్ర : గోపాల్రావ్ ...అయిపోయింది. పీనుగుని ఎంతసేపని ఇంట్లో పెట్టుకుని కూర్చుంటావ్. ప్రాణం పోయేక ఈ వెధవ పీనుగతో మనకేం పని.

సత్యా : పీనుగా గీనుగా అన్నావంటే పళ్ళు రాలతంతా. పొలైట్‌గా ఫీలవ్వు.

చారు : బాధపడకు నాన్నా పది నిమిషాలు చెవులు, కళ్ళు మూసుకో నాన్న – జేబులో చిల్లరుండాలి ఎక్కడ దాచేవ్ నాన్నా.

గోపా : మామగారు ఇంకో పది రోజుల మీకు సేవ చేసుకుందాం అని ఆశపడ్డానే నా ఆశని ( ఏడుపు ఆపి ) దాన్నేవని అంటారు.

చక్ర : అడియాశ ....నాయనా !

గోపా : అడియాశ చేసి, పోయారా మామాగారు – నేనెలా బతికేదండీ మీరంటే ఎంత ప్రేమ, అనురాగం ( మళ్ళీ ఏడుపు ఆపి ) మూడో దాన్నేమంటారు.

చారు : తెలిసున్నపదాలతో బాధపడండి. మనింట్లో తెలుగు డిక్షనరీ లేదండీ.

చక్ర : పోన్లే – అమ్మా నాన్నా గారు నిజంగా పోయే వేళకి నే కొనిపెడతాగా గట్టిగా – ఏడవండి వాడొస్తున్నాడు.

చారు : ఎంత పన్చేశావ్ నాన్న.

సీతా : మీ మొహాలు మండ. అరిగిపోయిని రికార్డుల్లా నాన్న...నాన్న నాన్న అని, అవేం ఏడుపుల్రా తల ధిమ్మెక్కి ఛస్తోంది...విని వినీ – కొత్త ప్రయోగాలు చేసి కొత్త కొత్త పదాలు వాడండి....

గోపా : దొరక్క దొరక్క చావడానికి నా కొంపే దొరికిందా ! ఈ ఖర్చంతా నేనెక్కడ భరించేది చారు !

54 చక్ర : పిల్లలంటే ఎంతప్రేమో ! దహనాలు, గిహనాలు అంటూ డబ్బు తగలెయ్యకండి మున్సిపాలిటీ వాళ్ళకిచ్చెయ్యమని చెప్పి కళ్ళు మూసిన గొప్పవాడయ్యా .... గోపాల్రావ్ ....ఇలాంటి మామ నీకు మళ్ళా దొరకడయ్యా.....

చారి : నాన్నొచ్చాడంటే ఎంత ధైర్యంగా వుండేదో.... మొగల్రాజపురం కొండ కొంపలో వున్నట్టే వుండేది. ఎలాగండి బతకడం.

గోపా : చారు – చారు తమాయించుకో ...ఏమిటో అంతా ఏదో నాటికి వెళ్ళిపోయే వాళ్ళమే. వెనకా ముందున్నూ. ఎంత సేపు బాధపడినా వచ్చి చావడేం.

చక్ర : అదే నేనూ చూస్తున్నా. ఆ .....తలుపు చప్పుడవుతోంది. ఏడవండి గట్టిగా

గోపా : ఆ వస్తున్నాడు....మావగారూ ! ( ముగ్గురు ఒక్కసారిగా ఘొల్లుమన్నారు. సీతారాం లోపల్నుంచి కంగారుగా వచ్చి ...)

సీతా : ఆపండి....మిమ్మల్నే ఆపండి.

చక్ర : శృతి పెంచాలా

గోపా : ఏమైంది. జగన్నాధం ఏడీ

సీతా : కొంపమునిగింది. వాడు పారిపోయేడు.

చారు : పారిపోయేడా ..... ఎలా.....

సీతా : కిటికీ చువ్వలు విరగదీసుకు పారిపోయేడు.

సత్యా : అయితే నే లేచి తిరగొచ్చా !

గోపా : రాస్కెల్, పారిపోయాడా. అంటే వాడికంతా అర్థమైందంటారా.

సీతా : అంటారా ఏమిటి ! పూర్తిగా అర్థమైయుంటుంది. గదిలో శవాన్ని చూసాడు. మిమ్మల్ని నన్ను చూసాడు. అంతే పారిపోయేడు. కాబట్టి గ్యారంటీగా పోలీసుల్ని వెంటపెట్టుకొని మరీ వస్తాడు.

గోపా : అయితే ఇప్పుడేమిటి చెయ్యటం.

సీతా : ఆ విషయం మీరు, మీరు తేల్చుకోండి. కాని ఒక సంగతి పోలీసులొచ్చాక మీలో ఏ ఒక్కరైనా నా పేరుగాని వాగేరో దీక్ష దిగి నలుగుర్ని నరికేసి మళ్ళీ దీక్ష పడతా. తెల్సిందా వస్తా – ఓం – ( సీతారాం వెళ్ళాడు )

చక్ర : పోలీసులొస్తున్నారంటే ఎవరు మాత్రం వుంటారయ్య నీ పిచ్చి గాని – అయినా హత్య చేసిన వాడివి నువ్వు. వాళ్ళకి ఏం చెప్పుకుంటావో, ఏం చేసుకుంటావో తేల్చుకోవాల్సింది కూడా నువ్వే – మాకేం సంబంధంలేదు.

సత్యా : బాగా చెప్పావ్ ! అసలు వాడు పారిపోవడం కూడా మంచిదయింది. లేకపోతే ఈ గొడవల్లో అకారణంగా ఇరుక్కుపోయి వుండేవాణ్ణి. అమ్మా బస్సుకు వేళయినట్టుంది. నే వెడతా గాని, త్వరగా ఓ కాగితం మీద చిన్నసంతకం చేసి నా మొహాన పడెయ్.

చారు : సంతకమా ? సంతకం దేనికి నాన్న ? దేని గురించి ?

గోపా : ఒక వేళనే జైలుకెళితే నీ పోషణతో తనకేం సంబంధం లేకుండా ప్లానేమో.

సత్యా : చాల్లే వూరుకోవయ్యా ! ....జైలుకెళ్ళబోతూ కూడా జోకులేసే వాణ్ణి ఇదే చూట్టం ! అదేం కాదమ్మా ! ఆస్థి గొడవలు – నీకు తెల్సుగా, ప్లీడరు గారు తీసుకు రమ్మంటేనూ –

గోపా : అదా సంగతి ! అంటే మీ ఆస్తిలో వాటా అక్కర్లేదని రాసిమ్మంటారు – అంతేగా

సత్యా : అంతేనయ్యా – అంతే ! అయినా రాతుల కోతలు అవన్నీ అక్కడికెళ్ళి నే చూసుకుంటాగా ! సంతకం పెట్టమనుచాలు.

చారు : చూస్తూ చూస్తూ లక్ష రూపాయలు వాటాని యివ్వొద్దని రాసివ్వటం నా వల్ల కాదు. కట్టుకున్నవాడు జైలు కెళ్ళి, కన్నతండ్రి ఆస్తి యివ్వనంటే – నా గతేం కాను ?

చక్ర : అసలు ఆస్తి మొత్తం ఏ మాత్రం ఉంటుందేం అహ ! షుమారుగా.

చారు : పది ! లకారాల దాకా వుంటుంది. కానీ ఏం లాభం టిక్కెట్టు గూడా కొనకుండా పాయిఖానాలో నిలబడి ట్రావెల్ చేస్తుంటారు.

గోపా : శ్రీశ్రీశ్రీ మహారాజశ్రీ మామయ్య గారూ ! మీ ఆస్తిలో చట్టరీత్యా సంక్రమించే వాటా అక్కర్లేదని మీ అమ్మాయి మీకు కాగితం రాసివ్వాలి అంతేగా !

సత్యా : అంతేనయ్యా అంతే ఆ పని చేయించావంటే, నీ చేతులు చేతులు కావు. అసలు అల్లుడి రూపంలో వున్న ఆదినారాయణమూర్తివని గట్టిగా నమ్మిగర్వంగా చెప్పుకుంటా.

చారు : నే ప్రాణం పోయినా చెయ్యను. అంతే. అమ్మో అమ్మో లక్ష రూపాయలే

గోపా : చారు నోరెత్తక సంతకం నే చేయిస్తా కాని, మీరు మాకు సహాయం చెయ్యాలి చేస్తారా !

సత్యా : సహాయమా ? నేను ! వొంట్లో ఓపిక కూడా లేనివాడ్ని నేనేం చెయగలనయ్య అయినా ఏమిటో చెప్పు.

చారు : మీరు మీరు ఏం మాట్లాడుకున్న నాకేం సంబంధం లేదు. నేను మాత్రం సంతకం పెట్టనంతే.

సత్యా : అమ్మడు నీవు ఇలాగంటే ఈ నాన్న ఏవైపోతాడు చెప్పు కావాలంటే పసుపు, కుంకుమల కింద పదో పరకా ఇస్తా. తృప్తి పడి సంతకం చెయ్యి.

చారు : నువు నాకేం ఇవ్వక్కర్లేదు నే సంతకం చెయ్యను.

గోపా : అవునండీ – మాకు డబ్బక్కర్లేదు.

సత్యా : మరింకేం కావాలి ?

గోపా : ఏం అక్కర్లేదు... ఆ కుర్రాడి హత్యా నేరాన్ని మీ నెత్తిన వేసుకోండి చాలు

సత్యా : ఆ ! ఆ నేరానన్ని వొప్పుకునని జైలుకెళ్ళాలా ?

చారు : అయినా సరే – నేను సంతకం పెట్టను.

చక్ర : గోపాల్రావ్ – నీది బుర్రకాదయ్యా పాదరసం బుడ్డి ఏమిటి సత్యానందంగారు ఏవంటారు సరేనా ?

సత్యా : ముందు జైలుకెళ్ళాలి. తర్వాత ఉరిశిక్ష పడితేనో ?

చక్రం : వురిశిక్షా ? ఊరుకోండి హాస్యాలూ, మీరున్నూ ప్రధానమంత్రిని చంపితేనే పదహారు కోర్టులు తిప్పి వొదిలేశారు. దిక్కూ మొక్కులేని కుర్రవెధవని చంపారంటే వురిశిక్షా కాదు గదా జైలుగ్గూడా వెయ్యరు.

గోపా : ఒకవేళ వేసినా, ఏడాదో రెండేళ్ళు వేస్తారు. వయసులో పెద్ద వాళ్ళు హార్టు పేషెంటు మొదటిసారి నేరం చేసాడు. కాబట్టి గ్యారంటీగా గాంధీ జయంతికి క్షమించి ఇంటికి పొమ్మంటారు.

సత్యా : అంటారా అనకపోతేనో !

గోపా : వడ్డీ వ్యాపారం చేసుకోవచ్చు ఏమిటి సరేనా

చారు : నే మాత్రం సంతకం చెయ్యను. చెయ్యను. చెయ్యను

గోపా : చారు – ఓసారి ఇలారా !

( గోపాల్రావూ, చారుమతిలోనకి వెల్ళారు. అది చూసి సత్యానందం, కంగారు పడ్డాడు )

సత్యా : ఆగండి. నన్ను కాస్త ఆలోచించుకోనివ్వరా ! ఏమిట రహస్యాలు.

చక్ర : మొగుడు, పెళ్ళాలకి అనేకం వుంటాయి. మనకెందుకు చెప్పండి. మీరు మాత్రం ధైర్యంగా వుండండి నేను అప్పుడప్పుడు వచ్చి పోతుంటాగా.

సత్యా : అంతా అయిపోయినట్టు నీ సలహాలేమిటి ! సరే అంటే నా వైఫ్ ఏమంటుందో ఏమో ?

చక్ర : మీరు జెలుకెళ్ళే ముందు, నా వైఫ్‌చావు గురించి చీటికి మాటికి మాట్లాట్టానికి వీల్లేదని కాస్త గట్టిగా చెప్పండి. మీకు పుణ్యం వుంటుంది ( గోపాలరావు, చారుమతి తిరిగి అక్కడికి వొచ్చారు. ఇప్పుడు చారుమతితో ఎంతో మార్పుకనిపిస్తోంది )

గోపా : సంతకం చేయటానికి మీ అమ్మాయిని వొప్పించాను. ఇహ మీదే ఆలస్యం.ఆ కుర్రాడిని ఆవేశంలో మీరే చంపినట్టు కాగితం రాసిస్తే ఆస్తిలో వాటా అక్కర్లేదని మీ అమ్మాయి రాసిస్తుంది సరేనా ! రెడీనా !

సత్యా : ఏం రెడీ నా బొంద రెడీ అసలింతకీ నే చంపానంటే నమ్మి ఛస్తారా అని.

చక్ర : పెద్దవాళ్ళు కాదనకండి, కూతురు ,అల్లుడు చిలకాగోరింకల్లాగా సంసారం చేసుకుంటారు. పిల్లల సుఖం కన్నా మనకేం కావాలి చెప్పండీ.

చారు : నోరు తెరిచి అడిగానని లక్ష రూపాయిల ఆస్థినే వొదిలేస్తున్నాను నా కాపురం నిలబెట్టటం కోసం ఆ మాత్రం జైలు కెళ్ళలేవా నాన్న !

సత్యా : అయితే సరే కాని కాగితాలు రాసి ఇప్పుడే ఇవ్వాలి. అలా అయితేనే సరే అంటా.

గోపా : నేరం ఒప్పుకుంటున్నట్టుగా, మీరూ ఇప్పుడే రాసివ్వాలి.

చక్ర : శుభం త్వరగా కానీండి పోలీసులు రాకముందే ఆ రాతకోతలు పూర్తి అయిపోతే ఎవరి దారినా వాళ్ళు పోవచ్చు.

చారు : కావాలంటే మామయ్య గారు సాక్షి సంతకం కూడా చేస్తారు

గోపా : అదీ నిజమే – సాక్షి సంతకం వుంటే సిమెంటు గోడకి నీళ్ళు చల్లినట్లు పగడ్బందీగా వుంటుంది.

చక్ర : కానీ నేనంత తేలిగ్గా సంతకం చేస్తాననుకోకు. పన్లో పని మా నిమ్మిని నే చంపానని ఇహనించి ఎక్కడా ప్రస్తావించనని కాగితం రాసిస్తేనే సాక్షి సంతకం చేసేది.

సత్యా : సరే ...అలాగే కానీండి ...పిచ్చి వెధవ - రెండు ముక్కలు రాసిస్తే వాడీక ధైర్యంగా వుంటుంది.

చారు : అందులో మొదటి నుంచి మామయ్య గారు మనకెంతో సహాయంగా వున్నారు.

గోపా : సరే ....అలాగే అయితే కాగితాలు, కలాలు తీసుకోండి ( డ్రాయిర్లోంచి తెల్లని కాగితాలు తీసుకున్నారు. తలో వైపు కూర్చుని దీక్షగా ఎవరికి వారు రాసుకుంటున్నారు )

చారు : నాన్న - దస్తూరి గొలుసుకట్టురాతగా కాకుండా కాస్త అర్ధమయ్యేట్టు రాయి ఏవండీ ! మీ ఇంగ్లీషు అసలే అంతంత మాత్రం తెలుగులోనే స్పష్టంగా రాయండి.

సత్యా : రెండే రెండు ముక్కలు - చట్ట రీత్యా ఆస్తిలో నీకు సంక్రమించే హక్కుని వొదిలి వేసినట్లు రాసేను. కావాలంటే చదివి మరి సంతకం పెట్టు.

గోపా : చిరంజీవి అనబడే కుర్రవాడిని ఆవేశంలో, పాతకక్షల కారణంగా మీ చేతుల్తో మీరే చంపినట్టు వేరెవరూ దానికి బాధ్యులు కారని వ్రాసాను.చదువుకొని సంతకం చెయ్యండి.

చక్ర : నా భార్య లేటు నిర్మలా చక్రదరం, చావు పుట్టకల గురించి ఎక్కడైనా , ఎన్నడయినా, ఏ రూపంలోనయినా, ఎవరితోనయినా, ప్రస్తావించిన యెడల నీ వద్ద నుంచి నాకు పాతికవేల నష్ట పరిహారం వసూలు చేసే అధికారాన్ని ఇస్తూన్నట్లుగా రాసేను. చదవకుండా సంతకం పెట్టు.

గోపా : మామగారూ - ఎంతయినా, వయోవృద్దులు, కాబట్టి తూర్పుకి తిరిగి ఇలవేల్పుని స్మరించుకుని ఇక్కడ సంతకం చెయ్యండి.
( సత్యానందం తాత్సారం చేస్తూ వుంటాడు )

చక్ర : ఇది ముడిపడే వ్యవహారం కాదు. పోలీసులు రాకముందు తప్పుకోవటం నయం. నాకెందుకొచ్చింది.

చారు : మామయ్య గారు. ఓ క్షణం ఆగండి. సరే నాన్న ! పోని ఓ పని చేద్దాం అందరూ ఒకేసారి సంతాకాలు చేస్తేనో.

గోపా : ఓ.కే.నాకేం అభ్యంతరం లేదు.

చక్ర : ఆడదాని మాట అసలు సిసలైన బాట అన్నారు. కానీండి. ఇంతకీ మీ సంగతేమిటి.

సత్యా : ఎంతయినా కన్న కూతురు కాదంటే కళ్ళ నీళ్ళు పెట్టుకుంటుంది. అలాగే కానీండి.

చక్ర : సరే....అయితే అంతా కాగితాలు తీసుకోండి. రెడి.....వన్....టు....త్రీ –
అందరూ కాగితాలు మార్చుకుంటున్నారు.

( జగన్నాథం ప్రవేశం )

జగ : హల్లో – అందరికి మళ్ళీ గుడ్ మార్నింగ్

గోపా : నువ్వా – పోలీసులేరి

జగ : పోలీసులా ? వాళ్ళతో మనకేం పని

చక్ర : మనకి ! వెధవ కలుపుగోలుతనం వీడున్నూ

చారి : అయితే మళ్ళీ ఎందుకొచ్చినట్టు

జగ : ఓహెూ కిటికీలోంచి పారిపోయి, మళ్ళీ వచ్చెనని ఆశ్చర్యంగా వుందా ! వెరీ సింపుల్
ఆ గదిలో శవాన్ని తీసుకెడదామని.

సత్యా : ఆ – శవం కావాలా ! రిక్షా డబ్బులు నేనిస్తా – తీసుకెళ్ళు బాబు.

చక్ర : నీ అవసరం మాగ్గాని, ఆ శవానిగ్గాని లేవు. అంచేత మర్యాదగా బయటకు నడు.

గోపా : అవును తక్షణం వెళ్ళకపోతే –

జగ : నన్ను కూడా చంపేస్తారు. అంతేగా, కాని నా శవాన్ని లక్ష రూనాయలనిచ్చి ఎవరూ
కొనుక్కోరు.

సత్యా : లక్ష రూపాయిలు ! అంటే ఆ కుర్రాడి శవాన్ని లక్ష రూపాయలిచ్చి–

జగ : కొనుక్కునేందుకు పార్టీ రెడీగా వుంది. ఇంతకి ఆ కుర్రాడ్ని చంపింది మీరా !
మీరా ! మీరా !

సత్యా : వాళ్ళెవరూ కాదు. నేను – కావాలంటే ఆ కాగితం చదువు. ఇప్పుడు చెప్పు
ఎవ్వరిస్తారు లక్ష – ఎందుకిస్తారు.

చారు : చాల్లే వూరుకో నాన్న – నీ కంత తొందర కంగారున్నూ – ప్రాణాలు తీస్తే ఎవరన్నా
లక్ష రూపాయలిస్తారా !

చక్ర : మరే – ఈ దేశంలో నాకు తెలిసిన మనిషిని ప్రాణానికి అంత రేటు లేదు.

జగ : సరే – నా మాట మీద నమ్మకం లేకపోతే మీ కెందుకు పనికి రాని ఆ శవాన్ని నాకిచ్చెయండి. నే పట్టుకుపోతా.

గోపా : వద్దు – పోలీసులు రావాలి – హంతకుడ్ని అరెస్టు చెయ్యాలి. అప్పటిదాకా శవాన్ని కదల్చటానికి వీల్లేదంతే !

సత్యా : అవును అయినా వాడ్ని చంపింది నేను. అంచేత ఆ శవం నాది. నా యిష్టం ఒరేయ్ అబ్బీ. అలాగే పట్టుకుని ఫో. నే చెప్తున్నాగా .

జగ : థేంక్యూ సార్. నిజంగా మీరు నాకు దేవుడుతో సమానం. నా జీవితంలో అదృష్టం ఇంత త్వరగా తోసుకొస్తుందని కల్లో కూడా వూహించలేదు.

సత్యా : వీడ్ని తగలెయ్య. శవాన్ని తీసుకెళ్ళటం అంటే ఏదో లంకె బిందెలు పట్టుకుపోతున్నంతగా పొంగిపోతున్నాడు. అమ్మాయ్ నాకేమిటో అనుమానంగా వుంది.

చక్ర : నాకే కాస్త అనుమానంగానే వుందయ్య, గోపాల్రావ్. అసలు సంగతి తెల్సుకునేదాకా ఆ శవాన్ని వీడికి దక్కకుండా చూడాలి. వాడు చెప్తున్నది నిజమే అయితే, ఒకటా రెండా లక్ష లక్ష రూపాయలు.

గోపా : అసలు విషయం ఏమిటో చెప్పు. మా అందర్ని నమ్మించగలిగితే నీకు శవం దక్కేది.

జగ : సరే చెప్తా వినండి. ఆ కుర్రాడి పేరు చిరంజీవి, తండ్రి పేరు బంగారప్ప. చాలా పేద కుటుంబం. ఒక శ్రీమంతుడి ఇంట్లో ఈ బంగారప్ప నౌకరుగాపని చేసేవాడు. ఈ కుర్రాడి చదువుకి ఆ శ్రీమంతుడు చాలా సాయం చేసాడు. వున్నట్టుండి ఆ శ్రీమంతుడికి అనారోగ్యం మొదలయ్యి మంచం పట్టాడు. మూత్రపిండాల్ని మారిస్తేగాని ఆయన బతకడని డాక్టర్లు తేల్చి చెప్పారు.

గోపా : అనడం గాదు. నిజం కూడా ఈ కుర్రాడి బ్లడ్‌గ్రూప్, ఆ జమీందారుగారి బ్లడ్‌గ్రూప్ ఒకటే కావంట చేత తండ్రి ప్రాణాల్ని కాపాడుకోవటానికి లక్ష రూపాయిలైనా సరే ఇవ్వటానికి సిద్ధపడ్డారు. ఆయన సంతానం.

చక్ర : అయినా ఈ సంగతులన్నీ నీకెలా తెలుసు !

జగ : జమీందారు  గారి కుమారుల్లో  ఒకరు నాకు బాగా పరిచయం. ఈ చిరంజీవి  ఆ జమీందారు  గారితో కల్సి తీయించుకున్న  ఫోటో చూపించారు. ఆ గదిలో  అతడ్ని చూడంగానే  ఆ సగంతి గుర్తుకొచ్చి కిటికీలోంచి  పారిపోయా. అన్ని విషయాలూ తెల్సుకుని మరి వచ్చాను.  ఇకనైనా  నమ్ముతారా !

గోపా : మైగాడ్ ! లక్ష రూపాయిలు వన్‌లాక్

చారు : ఏవండీ త్వరగా  బజారుకెళ్ళి  ఐస్ పట్రండీ, ఆ చేత్తోనే కాస్త , చీమల మందు , కలరా వుండలు.

సత్యా : అమ్మాయ్ ప్రతి చిన్న పనికి  అల్లుడ్ని  హైరాణ పెట్టకు, ఎదరుగా చెట్టంత  నేలేనూ ఇంకేం కావాలి పూలదండలు కూడా పట్టుకురానా .

గోపా : అవునూ, అంతా చెప్పావ్‌గాని,  ఆ జమీందారెవడో, పేరుగాని, అడ్రస్ కాని  చెప్పావ్ కాదు.

జగ : పేరు, అడ్రస్సు  చెప్పే ముందు – మరి  నా సగంతి  ఏమిటో తేలాలిగా

చక్ర : అంటే  – ఆ లక్షల్లో నీక్కూడా !

జగ : వాటా కావాలి, అసలు  నేనంటు  వచ్చి ఈ విషయాలన్ని  చెప్పకపోతే, మీరా శవాన్ని డబ్బులిచ్చి  మరీ వదిలించుకునేవాళ్ళు అవునా . ఆ కుర్రాణ్ణి  చంపింది గోపాల్రావ్ నాకు తెల్సు – ఇహ  శుభవార్త  చెప్పింది నేను. కాబట్టి ఇద్దరికీ  చెరో ముప్పయి వేలు. మిగిలిన మొత్తాన్ని మీ ముగ్గరు  సమానంగా పంచుకోండి.

సత్యా : వారు చెప్పింది సబబు గానే, న్యాయంగాను వుంది. ఓరేయ్ అబ్బి తీరా  అక్కడికి వెళ్ళినాకా శవం పనికి రాదంటే  నా గుండె  ఆగిపోతుంది.

గోపా : సరే , ఇప్పటికయిని  అడ్రస్ చెప్తావా .

జగ : అక్కర్లేదు. అన్ని ఏర్పాట్లు చేసే ఇక్కడికొచ్చాను జమీందారుగారింటికి ఫోన్ చేస్తే అంబులెన్స్ పంపిస్తారు.  నేవెళ్ళి  ఆ పన్జేసోస్తా. ఈ లోపు  మీరు శవాన్ని ఈ గదిలోకి మర్చండి అంతా  వెళ్ళి డబ్బు తెచ్చుకుందాం ( బయటకు )

సత్యా : అంటే బ్యాంకుకెళ్ళి డబ్బు తెచ్చుకున్నట్టేనన్నమాట. కాకపోతే పాస్‌బుక్కు బదులు పీనుగని పట్టుకెడుతున్నాం అంతే తేడా !

చక్రం : అంతే అంతే ...గోపాల్రావ్ పద ....శవాన్ని ...ఈ గదిలో ...ఏమిటా ఆలోచన

గోపా : ఏంలేదు ఆ కుర్రాడ్ని చంపినందుకు బాధపడాలో, ఆ జమీందారుని బతికిస్తున్నందుకు సంతోషపడాలో అర్థం కాకుండా వుంది.

సత్యా : అల్లుడు అనవసరంగా వర్రీ అవకు. ఓ సూత్రం చెప్తా గుర్తెట్టుకో, దరిద్రగొట్టు వెధవలు ఎన్ని వేల మంది పోయినా, ఒక శ్రీమంతుడ్ని కాపాడుతునన్నందుకు గర్వపడాలి. ఆనందపడాలి. అదే మనిషి లక్ష్యం కావాలి.

చక్ర : వచ్చాక మొదటిసారి నాకు నచ్చే మాటన్నారు. గోపాల్రావ్ పద...

( గోపాలరావు చక్రంలోనికి వెళ్ళుచుండగా, చిరంజీవి మత్తుగా నడుచుకుంటూ అక్కడికి రావటం కనిపించింది. మొదటగా చారుమతి కెవ్వున అరిచింది )

చక్ర : ద...ద...దయ్యం ........దయ్యం...

సత్యా : వోయమ్మో .....దయ్యాలే ( గుండె చేత్తో పుచ్చుకుని ఫ్రీజ్ అయిపోయాడు )

చారు : దయ్యం పదండి పారిపోదాం ....

చిరం : నేన్సార్, దెయ్యాన్ని కాను, చిరంజీవిన్సార్. అయినా నేనాగదిలో పడుకున్నా నేమిటి ? నాకేమైంది ! అదేమిటి సార్ అంతా అలా అయిపోయారు. మిమ్మల్నే సార్.

గోపా : అంటే....అంటే...నువ్వు...బతికే వున్నావన్న మాట

చిరం : అంటే నేను చచ్చిపోయాననుకున్నారా

చక్ర : గో...గో...పాల్రావ్...ని...నిజ్జంగా బతికేవచ్చాడా....ఒకసారి పాదాల వరకు చూడు.

గోపా : చారూ – ఒసే చారూ ....ఎక్కడే ఇక్కడే వున్నావా ! హమ్మయ్య ఎంత ఆనందంగా వుందో వాడు బతికే వున్నాడే.

చారు : దయ్యం కాదా ...నిజంగా.

గోపా : నీ బొందా, కానేకాదు. అహ ! ఎంత రిలీఫ్ ....నే హంతకుడ్ని కాను. నే హంతకుడ్ని కాను ( హాయిగా పెద్దగా నవ్వాడు ) చారూ....

చిరం : సార్ ముందు నా డబ్బులు నాకిప్పించండి సార్ త్వరగా నే వెళ్ళిపోవాలి.

చక్ర : గోపాల్రావ్ అటు చూడు మీ మామగారలా బిగుసుకుపోయారు. కొంపదీసి

గోపా : పోయాడంటారా. అయినా మనకేం సంబంధం లేదు కాబట్టి హేపీగా ఏడుద్దాం మామగారూ....

సత్య : అల్లుడు నాకు మాత్రం మహా బాధగా వుందయ్య !

చారు : దేన్ని గురించి నాన్న నువ్వనేది !

చిరం : సార్ నాకేమిటోగా వుంది. దయచేసి నా డబ్బులు నాకిప్పించండి సార్. నే వెళ్ళాలి.

గోపా : అలాగే కాని ఈ లోపు నీవు ఆ పక్కనే బాత్‌రూం వుంది. చక్కగా మొహం కడుక్కొని ఫ్రెష్‌గా రా వెండి కంచం అమ్మేసి నీ డబ్బులు నీకిస్తా..

చిరం : అలాగే సార్...థాంక్యూ సార్ ( ఎగ్జిట్ )

చక్ర : గోపాల్రావ్ ఏమిటా వెర్రి ఆనందం నాకయితే పదివేలు నష్టం. నోటి దగ్గర కూడు జారిపోయినట్టయింది గదా !

సత్యా : ప్రయిజ్ కొట్టిన లాటరీ టిక్కెట్టు గాలికి కొట్టుకుపోయినట్టయింది. ఛ....ఛ....టైం అస్సలు బాగాలేదు.

చారు : ఏవండీ ....ఆ కంచం కాస్తా అమ్మేస్తారా !

గోపా : అమ్మేస్తా. ఏం వెండి, బంగారంల కన్నా మనశ్శాంతి ముఖ్యం

చారు : అయితే నాన్న....మరి నే రాసిచ్చిన కాగితం ఇచ్చేస్తావా ?

సత్యా : ఇవ్వను గాక ఇవ్వను. అమ్మాయి సంతకం చేయాలంటే నేరం నెత్తినేసుకోమన్నారు. సరే అన్నా.ఆ వెధవ బతికొస్తే నేనేం చేసేది. అది నా తప్పా !

చక్ర : బాగా చెప్పారు. కావాలంటే ఇప్పటికయినా వాడ్ని ఎవరు చంపినా జైలుకి మాత్రం అంకుల్ వెడతారు. అంతేనా !

సత్యా : అంతే .....అంతే ఒప్పందం అంటే ఒప్పందమే.

గోపా : సరే ఆడదాన్ని మోసం చేసి సంతకం చేయించుకున్నారని నోటీసు ఇప్పించకపోతే నా పేరు – చారూ ఇలారా.

చక్ర : గోపాల్రావ్ ఆవేశపడక, నిదానంగా ఆలోచించు. ఆ కుర్రాడు మళ్ళీ చచ్చేడే అనుకో. అహ అనుకో లక్ష రూపాయలు క్యాష్.... నేరం నెత్తిన వేసుకోటానికి రెడీగా ఓ మనిషి....

సత్యా : పైగా పదిమందికి సాయం చేసే ఆ జమీందారుకి ప్రాణం పెట్టిన వాళ్ళవుతాం.

చారు : నీ మనసులో ఏముందో చెప్పు నాన్న, పెద్దవాడివి కాదనర్లే.

గోపా : అక్కర్లేదు. నాకంతా అర్ధమైంది. జమీందారుని కాపాట్టానికంటూ లక్ష కోసం ఆ కుర్రాడ్ని.... నో .....నాకిష్టం లేదు. పొరపాటున ప్రమాదవశాత్తు నేరం చేయటం వేరు కావాలని పనికొట్టుకుని....సారీ....నేను పవిత్రుడ్ని కాకపోవచ్చు. కాని సాటిమనిషిని చంపుకుతినే రాక్షసుణ్ణి మాత్రం కాను. చారూ ఇలారా

( గోపాలం లోనికి వెళ్ళాడు )

చారు : ఏం నాన్న. అయితే ఆ కాగితం ఇవ్వరా ! కన్న కూతుర్నే నిర్ధాక్షిణ్యంగా మోసం చేస్తారా ! నా చేతి కాగితం రాయించుకొని ఏం బాగుపడతావో చూస్తాగా ! నా వుసురు వూరికే పోదు ( చారు ఏడుస్తూ వెళ్ళిపోతుంది )

చక్ర : అంకులూ – ఎంత వ్యవహారవేత్తలయినా కాస్త తనమనా, పట్టు విడుపు వుండాలంటారు. కన్న కూతురి చేత కంట తడిపెట్టిస్తే మీకొచ్చేదేముంది చెప్పండి.

సత్యా : అంటే – అది రాసిచ్చిన కాగితం చించేసి లక్ష రూపాయల ఆస్తి వొదులుకోమంటావా .

చక్ర : అలా అని నే అంటానా..... లక్ష సంపాయించే మార్గం వుందేమో ఆలోచించమంటున్నా.

సత్యా : అంటే.....

( చిరంజీవి అక్కడికి వస్తూ )

చిరం : సార్ ఏమో అనుకున్నా గాని, గోపాల్రావ్‌గారు చాలా మంచి వాళ్ళు సార్, తన వెండి కంచం అమ్మేసి నా డబ్బు నాకిచ్చేస్తానంటున్నారు. పాపం, అమ్మగారు చాలా బాధపడిపోతున్నారు.

చక్ర : చూసేరా....అమ్మాయి తెగబాధపడిపోతోందిట.... ఏవంటారు !

సత్యా : అనటానికి నేనెవర్ని....అమ్ముకుంటారో – ఆర్చుకుంటారో నాకెందుకొచ్చింది. అయినా వచ్చిన పనయింది నేపోతా !

చక్ర : సరే కానీండి. కన్న తండ్రిగా మీరు గుండెరాయి చేసుకున్నా, సాటి మనిషిగా ఆ పిల్ల భాదపడటం నే సహించలేను. వోరెయి అబ్బీ – ఆ అయిదు వేలు నేనిస్తా ప....

చిరం : మీరిస్తారా... థాంక్యూసార్. మీ అందర్నీ అపార్థం చేసుకున్నా క్షమించండి.

సత్యా : అయిదువేలు – వాడికి – నువ్వు – అదా ఇందాకట్నించి నువ్వంటున్నది. అయితే నేనే ఇస్తా. ఏమయినా వాళ్ళు నా అల్లుడు – నా కూతురు.

చిరం : మీరిస్తారా !

చక్ర : అక్కర్లేదు. వీడ్ని నాకు వొదిలెయ్యండి. పదరా డబ్బులిస్తా.

సత్యా : కుదర్దు. వీడు నా మనిషి. మా ఇంటికొచ్చేడు. నేనే ఇస్తా.

చక్ర : వీడు నా సొంతం నేనే ఇస్తా.

సత్యా : కాదు – నా సొంతం నేనే ఇస్తా.

చక్ర : కాదు .... నేనే

సత్యా : ఏం కాదు నేను

( ఇద్దరూ చిరంజీవిని చెరో చెయ్యి పుచ్చుకొని అటు ఇటూ లాగుతున్నారు )

చిరం : సార్ ! అసలే నా ఒంట్లో బాగోలేదు. ఇద్దరు కలిసి నన్ను చంపకండి సార్

( ఆ మాటకి ఇద్దరూ చిరంజీవిని వొదిలేస్తారు. ఒకరి వంక ఒకరు చూసుకుంటూ )

చక్ర : చక్కటి మాట ఏమంటారు.

సత్య : తథాస్తు .... సరే....సగం....సగం....

చిరం : ఏమిట్సార్ అది ఇద్దరూ చెరిసగం నాకిస్తారా ....

చక్ర : నీ డబ్బుల్ని అంటే నీకివ్వాల్సిన డబ్బుని ఇద్దరం చెరో సగం ఇద్దామని. ఇంతకీ నీకు చదువుకి సాయం చేసినబుజూ ఆ జమీందారు పేరేమిట్రా.

చిరం : ఆయనా మీకు తెల్సాసార్. శ్రీనివాసరావు గారని

సత్యా : అడ్రస్సు

చిరం : బంజారాహిల్స్, రోడ్డు నెం. పది, ప్లాటు నెం. 8

చక్ర : అంకులూ, పని పూర్తయ్యింది. మరి ఆలస్యం దేనికి.

సత్యా : ఆ జగన్నాధం రాకముందే వీడ్ని తీసికెళ్ళిపోతే ఒక వాటా తగ్గుతుంది.

చిరం : వాటా ఏమిట్సార్ అదేంటి అలా చూస్తున్నారు

చక్రం : ఏం లేదురా ....ఆ శ్రీనివాస్‌రావు గారికి సీరియస్‌గా వుందట బ్లడ్‌గ్రూప్ ఒకటి కావటం చేత నిన్ను చంపి తీసుకొస్తే లక్ష రూపాయలిస్తా అన్నాడుట. అంచేత నేను వారు కల్సి

సత్యా : నిన్ను చంపి, ఆ డబ్బు చెరిసగం తీసుకుందామని

చిరం : నన్ను చంపకండి సార్..... నేనేం ద్రోహం చేసాను ప్లీజ్

చక్ర : లక్షరూపాయలిస్తావంటే ఎవరు ఎవర్ని చంపకుంటాడు.

చిరం : ప్లీజ్ సార్ నన్ను చంపకండి సార్. నాకు డబ్బులొద్దు నన్ను పోనీండి సార్....గోపా
( సత్యానందం అతడ్ని అరవకుండా నోరు నొక్కారు )

చక్రం : అంతా నిర్ణయం జరిగిపోయాక పన్లు ఆగవురా. అబ్బీ బతికి ఏం బావుకుంటావ్. చచ్చి సుఖపడు పేదోళ్ళు చావు పెళ్ళితో సమానం అన్నారు. అంకులూ ముహూర్తం వేళయింది. కానీండి. భజంత్రీలు వాయించండి.
( చిరంజీవి వాళ్ళిద్దరి చేతుల్లో గిలగిల్లాడుతున్నాడు. చక్రం, గొంతు పిసుకుతున్నాడు. చిరంజీవి మెల్లమెల్లగా నేలపైకి జారిపోతున్నాడు )

చక్ర : త్వరగా నేవెళ్ళి టాక్సీ పట్టుకొస్తా – గోపాల్రావ్ వస్తే....
(అంతలో గోపాల్రావ్, ఆ వెనకే చారుమతి అక్కడికొచ్చారు )

గోపా : ఏవిటా కేకలు, ఏవైంది అరే ఇదేమిటి మళ్ళీ పడిపోయాడా చిరంజీవి. .... చిరంజీవి ....

సత్యా : వాడు పోయాడు. ఈసారి నిజంగా.

గోపా : పోయాడా ! అంటే లక్ష కోసం వాడ్ని మీరే

చక్ర : జాయింటుగా చంపుకున్నాం ఆ శవం మా ఇద్దరిది.

గోపా : ఛ....ఎంత పన్జేసారు. మీరు మనుషులేనా ! డబ్బు కోసం నిండు ప్రాణాన్ని చేజేతులా బలి తీసుకున్నారా !

చక్ర : ఇందాక నువు పొరపాటున  చంపాననుకున్నావ్. ఇప్పుడు  మేము పని గట్టుకు చంపాం. రెండింటికి  పెద్ద తేడా లేదు.

సత్యా : అయినా  మనం జాలిపడి వీడ్ని వొదిలినా ఆ జగన్నాధం  ఒక్కడే  చంపేసుకుని లక్ష కొట్టేసేవాడు.

గోపా : ( తల పట్టుకుని ) నాకేమిటోగా వుంది. చారు నా తల తిరిగిపోతోంది. నాకేదో అయిపోతోంది.

( జగన్నాథం ప్రవేశం )

జగ : అంతా నాకోసం  ఎదురు చూస్తున్నారా. సారీసర్, డబ్బు  కోసం  మనసు చంపుకుందామనుకున్నా  అదృష్టం కల్సిరావటం  లేదు. పోన్లేండి.నాకో  సెన్సేషనల్ న్యూస్ దొరికి ఉద్యోగం  నిలబడింది.  అదే ముప్పయి వేలు.

చక్ర : అంటే !

సత్యా : త్వరగా చెప్పు.

జగ : మీకు చెప్పిన ఆ జమీందారు గారు కొద్ది సేపటికి క్రితం పోయారు. అంచేత  ఈ శవంతో వాళ్ళకి అవుసరం లేదు.

గోపా : మీరు చంపింది చిరంజీవిని కాదు. మంచిని మానవత్వాన్ని. చచ్చిపోయింది. మనిషిలోని  దయ, ప్రేమ, జాలి తాను  సృష్టించుకున్న డబ్బుకి  తానే బందీ అయిపోయిన మనిషి. దాన్ని ఆర్జించటం కోసం అశుద్దాన్నయినా  ఆబగా, ఆనందంగా భుజించే  అనాగరికి  స్థితికి చేరాడు. ( పెద్దగా పగలబడి నవ్వాడు ) స్వార్థంతో, డబ్బు కోసం  మంచిని , మానవత్వాన్ని , ప్రేమని , దయని, చంపేసుకుంటూ  రాక్షసుల్లాగా మారిపోతున్న  వాళ్ళని క్షమించకు.

హే భగవాన్  – మమ్మల్ని  క్షమించకు

ఈ మనుషుల్ని  క్షమించకు ! ఈ రాక్షసుల్ని  క్షమించకు !

( గోపాల్రావ్ ఇంకా పగలబడి  నవ్వి నవ్వి, చివరకు ఏడుస్తుండగా )

## ( తెరపడుతుంది )